సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 252

మంగళవారం 3-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




**కార్వీకి మరో షాక్..**

ట్రేడింగ్ లైసెన్సు సస్పెండ్ చేసిన ఎక్స్ఛేంజీలు

- బిజినెస్‌లో



**విజయంతో ముగిస్తా**

వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీకి సిద్ధమవుతోన్న భారత స్టార్ షట్లర్ సింధు

- స్పోర్ట్స్‌లో

# బస్సు చార్జీల పెంపు




**ప్రజలపై ఏటా రూ. 850 కోట్ల ఆర్థిక భారం**

## నష్టాల నేపథ్యంలో టికెట్ ధరలను సవరించిన ఆర్టీసీ

- కి.మీ.కు 20 పైసల చొప్పున బస్సు చార్జీల పెంపు
- మంగళవారం తెల్లవారుజామున తొలి షిఫ్ట్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ధరలు
- పల్లె వెలుగు, సిటీ సర్వీసుల కనిష్ట చార్జీ రెట్టింపుతో భారం ఎక్కువే.. చిల్లర సమస్య రాకుండా స్టేజీలవారీగా టికెట్ రేట్లు రౌండ్ ఆఫ్

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో మూడున్నరేళ్ల తర్వాత బస్సు చార్జీలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొనడం, ఇదే సమయంలో ఆర్టీసీ ఆదాయం తగ్గిపోవడం, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) భారం కావడంతో ఆర్టీసీ యాజమాన్యం చార్జీలు పెంచక తప్పలేదు. ఆర్టీసీ తీవ్ర నష్టాల్లో ఉండటంతో ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రస్తుతానికి బస్సు చార్జీల పెంపు మినహా గత్యంతరం లేదంటూ ఆర్టీసీ అధికారులు రెండేళ్లుగా చేస్తున్న విన్నపాలకు ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించడంతో టికెట్ ధరలను ఆర్టీసీ సవరించింది. 2016 జూన్‌లో 10 శాతం మేర టికెట్ ధరలు పెంచిన ఆర్టీసీ... ఇప్పుడు కి.మీ.కు 20 పైసలు చొప్పున పెంచింది. అంటే 18.80 శాతం మేర చార్జీల మోత మోగినట్టయింది. పెరిగిన చార్జీలు మంగళవారం తెల్లవారుజామున తొలి షిఫ్ట్ నుంచి అమల్లోకి వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక చార్జీలు పెరగడం ఇది రెండోసారి. తాజా పెంపుతో ప్రజలపై సాలీనా దాదాపు రూ. 850 కోట్ల మేర భారం పడనుంది. ఆర్టీసీకి అంతేమొత్తం ఆదాయం పెరగనుంది. కిలోమీటర్‌కు 20 పైసలు చొప్పున చార్జీలు పెంచితే వార్షిక భారం రూ. 752 కోట్ల మేర ఉంటుందని తొలుత లెక్కలేశారు. గత నెల 28న జరిగిన మంత్రివర్గ సమావేశానంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. కానీ సిటీ సర్వీసులు, పల్లె వెలుగు బస్సుల కనీస చార్జీని రెట్టింపు చేస్తూ రూ. 10కి సవరించడం, చిల్లర సమస్య ఉత్పన్నం కాకుండా స్టేజీలవారీగా మొత్తాన్ని రౌండ్ ఆఫ్ చేయడంతో కి.మీ.కు 20 పైసల కంటే ఎక్కువ మొత్తం పెరిగినట్టయింది. ఫలితంగా ప్రజలపై

మిగతా 4వ పేజీలో ▶

**కనీస చార్జీలు ఇలా**

| | | |
|---|---|---|
| పల్లె వెలుగు, సిటీలో రూ. 10 | ఎక్స్‌ప్రెస్‌లో రూ. 15 | రాజధాని, గరుడలో రూ. 35 |
| డీలక్స్‌లో రూ. 20 | సూపర్ లగ్జరీలో రూ. 25 | |

## సెప్టెంబర్ జీతం విడుదల

సాక్షి, హైదరాబాద్: సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులకు సెప్టెంబర్ జీతం సోమవారం విడుదలైంది. సమ్మె నేపథ్యంలో 49,700 మందికి డబ్బులు లేవనే కారణంతో జీతాన్ని జమ చేయలేదు. అలాగే సమ్మె సమయంలో అందులో పాల్గొనని వారికి కూడా ఆ జీతాన్ని ఇవ్వలేదు. కొద్ది రోజుల కిందట సమ్మెలో లేనివారికి మాత్రం చెల్లించారు. ఆదివారం ఉద్యోగులతో ఆత్మీయ భేటీలో వెంటనే అందరికీ జీతాలు చెల్లిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. దీంతో వెంటనే రూ.100 కోట్లు విడుదల చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మొత్తానికి మరికొంత కలిపి సోమవారం ఉద్యోగుల ఖాతాల్లోకి జీతం జమైంది.

## ఢిల్లీకి సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం రాత్రి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఢిల్లీలో జరగనున్న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) చైర్మన్ రాజీవ్‌శర్మ కుమారుడి వివాహానికి ఆయన హాజరై.. రాత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనం కానున్నారు. డిసెంబర్ తొలి వారంలో ఢిల్లీ పర్యటనకు వెళ్లాల్సి ఉందని, అక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలసి రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చిస్తానని గత గురువారం విలేకరుల సమావేశంలో సీఎం కేసీఆర్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఈ పర్యటనలో ప్రధాని మోదీతో పాటు కేంద్ర పెద్దలెవరినీ సీఎం కలవడం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.



# దోషులను ఉరి తీయాల్సిందే!

**'దిశ' ఘటనపై చర్చలో ఎంపీల డిమాండ్ • లోక్‌సభలో వాడివేడి చర్చ**

- వాయిదా తీర్మానంపై చర్చకు రేవంత్‌రెడ్డి పట్టు
- జీరో అవర్‌లో చర్చకు అవకాశం ఇస్తానన్న సభాపతి
- 'దిశ' ఉదంతంపై చర్చించిన అన్ని పార్టీల ఎంపీలు
- ఎంతటి కఠిన చట్టమైనా తెచ్చేందుకు సిద్ధమన్న రక్షణ మంత్రి
- గాంధీ విగ్రహం వద్ద టీ కాంగ్రెస్ ఎంపీల ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ

హత్యాచారం వంటి ఘటనల్లో దోషులకు కఠిన శిక్ష పడేలా చట్టాన్ని తేవడానికైనా కేంద్రం సిద్ధంగా ఉందని, ఈ ఘటనపై స్పందించేందుకు మాటలు రావడం లేదని, ఏ పదాలతో దీనిని ఖండించాలో కూడా అర్థం కావడం లేదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై లోక్‌సభ జీరో అవర్‌లో జరిగిన చర్చకు ఆయన సమాధానం ఇస్తూ ఒక దశలో ఆయన కూడా భావోద్వేగానికి లోనయ్యారు. హైదరాబాద్‌లో గత బుధవారం రాత్రి జరిగిన హత్యాచార ఘటనపై సోమవారం లోక్‌సభలో వాడివేడిగా చర్చ జరిగింది. తొలుత కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి దిశ ఘటనపై చర్చించేందుకు వాయిదా తీర్మానం ఇచ్చారు. సభ ప్రారంభం కాగానే సభా కార్యకలాపాలు వాయిదా వేసి దీనిపై చర్చించాలంటూ రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీలంతా ప్లకార్డులు ప్రదర్శించారు. 'రేపిస్టులను శిక్షించండి.. అత్యాచారాలను ఆపండి' అంటూ నినాదాలు చేశారు. డీఎంకే నేత టీఆర్ బాలు కూడా లేచి ఇదే అంశాన్ని సభాపతి దృష్టికి తెచ్చారు. అయితే సభాపతి ఓం బిర్లా.. ఈ అంశంపై చర్చించేందుకు జీరో అవర్‌లో

మిగతా 2వ పేజీలో ▶







## నిద్ర నుంచే అనంత లోకాలకు..

**తమిళనాడులో కూలిన గోడ, 17 మంది మృతి**

అందరిలాగే వారు కూడా రాత్రి ప్రశాంతంగా పడుకున్నారు. కానీ మూసిన కళ్లు తెరవక ముందే వారి జీవితాలు ముగిసిపోయాయి. తెల్లవారుజామున ప్రశాంతంగా నిద్రిస్తున్న రెండు కుటుంబాల్లోని 17 మందిని మృత్యువు తడిసిన గోడ రూపంలో కబళించిన ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చోటుచేసుకుంది.

5లో

## 'అయోధ్య'పై రివ్యూ పిటిషన్

పిటిషన్ దాఖలు చేసిన జామియత్ ఉలేమా ఇ హింద్ ఉత్తరప్రదేశ్‌శాఖ అధ్యక్షుడు

## ఎస్సీ/ఎస్టీ క్రీమీలేయర్ అంశాన్ని సమీక్షించండి

సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి






epaper.sakshi.com

# ఆలోచనలో మార్పు రావాలి

**ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ● దిశ ఘటనపై రాజ్యసభలో చర్చ**

**సాక్షి, న్యూఢిల్లీ:** హైదరాబాద్‌లో జరిగిన దిశ హత్యాచార ఘటనపై రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. సభ్యసమాజం తలదించుకునే ఇలాంటి క్రూరమైన ఘటనలపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. సోమవారం రాజ్యసభ ప్రారంభం కాగానే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వాటిని అరికట్టడానికి చేయాల్సిన సూచనలపై చర్చను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు ఆందోళనకరం. హైదరాబాద్‌లో జరిగిన దుర్ఘటన అమానవీయం. మానవత్వం సిగ్గుపడే ఇలాంటి ఘటనలు ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాలేదు. యావద్భారతంలో మహిళలు, యువతులు, చిన్నారులపై అత్యాచార ఘటనలను చూస్తున్నాం, వింటున్నాం. ఓ తల్లిగా, భార్యగా, చెల్లిగా, కూతురిగా మహిళ చూపించే ప్రేమానురాగాలు, కరుణ అపారం. అలాంటి వారిపై జరుగుతున్న అకృత్యాలపై మనం ఆలోచన చేయాలి. మన సమాజంలో ఇలాంటివి పునరావృతం కాకుండా ఏం చేయాలనేదానిపై చర్చించాలి. శిక్షలు విధించిన ప్పుడు కూడా అప్పీలు, క్షమాభిక్ష అంటూ ఏళ్ల తరబడి ప్రక్రియ నడుస్తోంది. ఇంతటి హేయమైన చర్యలకు పాల్పడిన వారిపై క్షమాభిక్ష అంశం అనేది ఎవరైనా ఊహించుకుంటారు.



అలాగే సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా కేసు తమ పరిధిలో లేదంటూ పోలీసులు చెప్పిన కారణాలు సహేతుకం కాదు. పలు సందర్భాల్లో తప్పుచేసిన వారు జువైనల్ అని అంటున్నారు, హేయమైన నేరాలు చేయగలిగే వారికి వయసుతో ఏం సంబంధం ఉంటుంది. ఈ అంశంపై కూడా విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చట్టం ఒక్కటే పరిష్కారం కాదన్నారు. కఠినమైన శిక్షలు, త్వరితగతిన విచారణ, పరిపాలన నైపుణ్యం, నిరంతర నిఘా, ప్రతి కేసు నమోదు చేయడం, సామాజిక చైతన్యం, టీవీ, సోషల్ మీడియాలపై అదుపు వంటివి అత్యవసరమన్నారు. ప్రజల ఆలోచనాధోరణిలో మార్పురావాలని, ఈ మార్పు తీసుకురావడంలో నాయకులు, పత్రికలు, సినిమా రంగంలోని వారు దృష్టి పెట్టాలని వెంకయ్య సూచించారు.

## ఏకతాటిపైకి రావాలి: గులాం నబీ ఆజాద్, కాంగ్రెస్



మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు యావత్ దేశం ఒక్క తాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. అత్యాచారం, హత్య ఘటనల నిరోధానికి చట్టాలు చేసినా, వాటి ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితిని కనిపించడం లేదు. మహిళలపై ఇలాంటి దాడులను ఏ ప్రభుత్వం, ఏ పార్టీ, ఏ నాయకుడు, ఏ అధికారి కోరుకోరన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మతాలు, రాజకీయాలకు అతీతంగా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలన్నారు.

## దోషులను బహిరంగంగా శిక్షించాలి: జయాబచ్చన్, ఎంపీ



దిశ అత్యాచారం, హత్య లాంటి ఘటనల్లో దోషులను బహిరంగంగా కొట్టి చంపాలి. కొన్ని దేశాల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలే తగిన శిక్ష విధిస్తారు. నేనే కాస్త కఠినంగా మాట్లాడుతున్నానని తెలుసు. అయినా అలాంటి నేరగాళ్లను బహిరంగంగా కొట్టి చంపడమే సరైంది. ఈ తరహా ఘటనలపై ఎన్నోసార్లు మాట్లాడా. నిర్భయ, కథువా, హైదరాబాద్‌లో జరిగిన ఘటనలపై ప్రజలు, ప్రభుత్వం నుంచి ఇప్పుడు కచ్చితమైన సమాధానాన్ని కోరుకుంటున్నా. రక్షణ కల్పించడంలో విఫలమైన అధికారులను దేశం ముందు తలదించుకునేలా చేయాలి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. ఇటీవల ఓ అత్యాచార ఘటనలో కింది కోర్టు ఉరిశిక్ష విధిస్తే.. అప్పీల్‌కు వెళ్లిన దోషులు జీవితఖైదు పొందారని, దోషులకు వెంటనే శిక్షపడేలా చట్టాలు రూపొందించాలని టీఆర్ఎస్ ఎంపీ బండ ప్రకాశ్ కోరారు. హత్యాచార ఘటన జరిగిన 15–20 రోజుల్లోనే విచారించి దోషులను శిక్షించాలని ఎంపీ టి. సుబ్బిరామిరెడ్డి సూచించారు. టీఎంసీ ఎంపీ డా.సంతను సేన్, టీడీపీ ఎంపీ రవీంద్రకుమార్, కాంగ్రెస్ ఎంపీ అమీ యాజ్నిక్, అన్నాడీఎంకే ఎంపీ విజిలా సత్యనాథ్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఆర్జేడీ ఎంపీ మనోజ్‌కుమార్ ఝా, డీఎంకే ఎంపీ పి. విల్సన్, కాంగ్రెస్ ఎంపీ ఎంఏ ఖాన్ మాట్లాడారు.




**దిశ ఘటనపై ఢిల్లీలో ఆందోళన**

**సాక్షి, న్యూఢిల్లీ:** దిశ ఘటనపై ఢిల్లీలో ఆందోళనలు వెల్లువెత్తాయి. జంతర్ మంతర్ వద్ద ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. దిశ ఘటనలో దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశాయి. ఇలాంటి ఘటనలకు చోటివ్వకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశాయి. ఈ ధర్నాలో కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ కుంతియా, ఎంపీ రేవంత్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హత్యాచారానికి పాల్పడిన దోషులకు 30 రోజుల్లో మరణశిక్ష విధించేలా కేంద్రం చట్టం చేయాలన్నారు.

## హోంమంత్రి వైఫల్యాన్ని అంగీకరించినట్లేనా?

**కేటీఆర్ వ్యాఖ్యలపై ఎంపీ అరవింద్**



**సాక్షి, న్యూఢిల్లీ:** దిశ దుర్ఘటన కేసును తానే స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పిన మంత్రి కేటీఆర్ రాష్ట్ర హోంమంత్రి వైఫల్యాన్ని అంగీకరించినట్లేనా? అని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రశ్నించారు. కేటీఆర్ ఏ అర్హతతో ఆ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. సోమవారం ఆయన ఢిల్లీలో సహచర ఎంపీలతో కలిసి మీడియాతో మాట్లాడారు. అన్నీ కేటీఆర్ చూసుకుంటే హోంమంత్రిగా డమ్మీలను ఎందుకు పెట్టినట్టని ఎద్దేవాచేశారు. ఇంటర్‌లో అవకతవకల వల్ల, ఆర్టీసీ సమ్మెలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, దీనికి ముందు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. దిశ దుర్ఘటనలో బాధితురాలిని నిందించేలా టీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. హన్మకొండ, ఆసిఫాబాద్, శంషాబాద్‌ల్లో జరిగిన ఘటనలకు బాధ్యులు ఎవరో చెప్పాలని నిలదీశారు.

## మొరాయించిన హాక్‌–ఐ యాప్

**సాక్షి, హైదరాబాద్:** ఆండ్రాయిడ్ వర్షన్ 10, ఐవోఎస్ వర్షన్ 10లలో హాక్‌–ఐ యాప్ పని చేయకుండా మొరాయించింది. దీనిపై స్పందించిన నెటిజన్లు నేరుగా డీజీపీ మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వరుసగా వస్తున్న ఫిర్యాదులపై డీజీపీ స్పందించారు. సాంకేతిక సమస్యలతో ఆండ్రాయిడ్, ఐవోఎస్ హాక్‌–ఐ యాప్ పనిచేయడంలేదని చెప్పారు. దీన్ని సాంకేతిక నిపుణులు సవరించే పనిలో ఉన్నారని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని ట్విట్టర్‌లో డీజీపీ సమాధానం ఇచ్చారు.



సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల జేఏసీ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 'దిశ'అనే అక్షరాల ఆకృతిలో విద్యార్థులు కూర్చున్నారు.

# దోషులను ఉరి తీయాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం ఇస్తానని చెప్పడంతో రేవంత్‌రెడ్డి సభాపతితో సంవాదానికి దిగారు. 'ఈ అంశం చాలా తీవ్రమైంది. జీరో అవర్‌లో చర్చించే అంశం కాదిది. వాయిదా తీర్మానానికి జీరో అవర్‌కు ఎలా ముడిపెడతారు. ఒక అమ్మాయిపై జరిగిన అత్యాచారకాండపై దేశం రోదిస్తోంది'అని అన్నారు. దీనికి సభాపతి స్పందిస్తూ 'మొత్తం దేశం విచారం వ్యక్తం చేసింది. ఈ సభ కూడా విచారం వ్యక్తం చేస్తోంది. అయితే జీరో అవర్‌లో అందరూ దీనిపై మాట్లాడొచ్చు'అని పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ ఎంపీలు శాంతించారు. జీరో అవర్‌లో ఈ అంశంపై చర్చను కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.

### ఖండించేందుకు మాటలు లేవు: రాజ్‌నాథ్

హత్యాచార ఘటనపై జీరో అవర్‌లో పలు పార్టీల నేతలు మాట్లాడిన తరువాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ జోక్యం చేసుకుని దోషులకు కఠిన శిక్ష విధించేందుకు ఎలాంటి చట్టమైనా తేవడానికి కేంద్రం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. 'హైదరాబాద్‌లో జరిగిన ఘటనను మించిన అమానవీయ చర్య ఇంకొకటి ఉండదు. ఈ ఘటనపై యావత్తు దేశం విచారం వ్యక్తం చేస్తోంది. ఘటనను అందరూ ఖండించారు. దోషులను కఠినంగా శిక్షించాలని అందరూ కోరుకుంటున్నారు.



నిర్భయ ఘటన తరువాత దేశంలో ఒక కఠిన చట్టాన్ని ప్రవేశపెట్టాం. దేశంలో మళ్లీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవని అప్పుడు అందరూ అనుకు న్నారు. అయితే దీని తరువాత కూడా అలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటన లను అరికట్టేందుకు దోషులను శిక్షించేందుకు ఎంత కఠిన చట్టాన్ని చేయడానికైనా మేము సిద్ధంగా ఉన్నాం. సభ దీనిపై చర్చించాల నుకుంటే చర్చించండి. సలహాలు ఇవ్వండి. ఈ ఘటనపై స్పందించేందుకు నాకు మాటలు రావడం లేదు. ఏ పదాలతో దీనిని ఖండించాలో కూడా తెలియడం లేదు'అని పేర్కొన్నారు.

### ఐపీసీ, సీఆర్పీసీలో మార్పులకు సిద్ధం: కిషన్‌రెడ్డి, హోం శాఖ సహాయ మంత్రి

'ఐపీసీ, సీఆర్పీసీలో మార్పులు చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ఈ బాధ్యతను బోర్డు ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు అప్పగించాం. ఇప్పటికే రాష్ట్రాలకు లేఖలు రాసి సూచనలు కోరాం. డ్రాఫ్ట్ కూడా సిద్ధంగా ఉంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా త్వరలోనే బిల్లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. హైదరాబాద్ ఘటనలో పోలీసులు ఇంకా క్రియాశీలకంగా పని చేయాల్సింది. దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టంను ప్రారంభించాం. కేంద్రం మహిళల రక్షణపై నిబద్ధతతో ఉంది. ఉగ్రవాదం, అవినీతి నిర్మూళనకు మోదీ ప్రభుత్వం ఎలా పని చేస్తోందో.. అలాగే మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు పనిచేస్తోంది'అని పేర్కొన్నారు.



### పోలీసుల నిర్లక్ష్యం, మద్యం అమ్మకాలతోనే..: ఉత్తమ్, కాంగ్రెస్

'తెలంగాణ పోలీసుల నిర్లక్ష్యం, జాతీయ రహదారుల పక్కన విచ్చలవిడి మద్యం అమ్మకాలతోనే హైదరాబాద్ నగర శివారులో దిశ హత్య జరిగింది. తమ అమ్మాయి కనిపించడం లేదంటూ బాధితురాలి తల్లిదండ్రులు మొదట ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేయకపోగా.. మీ అమ్మాయి ఎవరితోనో వెళ్లిపోయి ఉంటుందంటూ అవమానకరంగా మాట్లాడారు. అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ఉంటే ఆ యువతి ప్రాణాలతో బతికుండేది. మరోవైపు సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణలో జాతీయ రహదారి పక్కన విచ్చలవిడి మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. దీనిపై కేంద్రం దృష్టిసారించాలి. ఇక ఘటనకు ముందు బాధితురాలు కుటుంబ సభ్యులకు కాకుండా పోలీసులకు ఫోన్ చేసి ఉంటే బతికుండేదని రాష్ట్ర హోం మంత్రి బాధ్యతారహితంగా మాట్లాడటం తగదు.'



### వెంటనే శిక్షలు పడాలి: బండి సంజయ్, బీజేపీ

'దిశపై అత్యాచారం, హత్య ఘటన దేశం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. మహిళల రక్షణకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో వాటి అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. మహిళలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు మాత్రమే స్పందిం చడం కాకుండా వారి రక్షణకు తీసుకుం టున్న చర్యల అమలు ఏ మేరకు జరుగుతోంది అన్నదానిపై చర్చ జరగాలి. ఇలాంటి ఘటనల్లో దోషులకు వెంటనే శిక్ష పడేలా చట్టంలో మార్పులు తీసుకురావాలి'



### ఉరిశిక్ష పడేలా చట్టం చేయాలి: ఎం. కవిత, టీఆర్ఎస్

'మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే దోషులకు వెంటనే ఉరిశిక్ష పడేలా ప్రత్యేక చట్టం చేయాలి. శంషాబాద్‌లో యువతిని అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన సమాజం సిగ్గుపడాల్సిన విషయం. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కొందరు రాజకీయాలు మాట్లాడుతున్నారు. ఇలాంటి సమయాల్లో రాజకీయాలు చేయ కుండా పార్టీలకతీతంగా మహిళల రక్షణకు ఎలాంటి చట్టాలు చేయాలన్నదానిపై మాట్లాడాలి. దోషులకు ఉరిశిక్ష పడేలా కఠిన చట్టాలు రూపొందించాలి.'



### 30 రోజుల్లో శిక్షలు వేయాలి: నామా నాగేశ్వరరావు, టీఆర్ఎస్

'మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన దోషులకు 30 రోజుల్లోగా శిక్షలు పడేలా ఐపీసీ, సీఆర్పీసీ సెక్షన్లలో మార్పులు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. తెలంగాణలో మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం.'



### స్వేచ్ఛగా బతకనివ్వండి చాలు: వంగా గీతావిశ్వనాథ్, వైఎస్సార్‌సీపీ

'భవిష్యత్‌లో మహిళలు బయటకు రాకుండా ఉండే పరిస్థితులు ఏర్పడకుండా సమాజంలో స్వేచ్ఛగా బతకనివ్వాలి. మహిళలను పూజించాల్సిన, గౌరవించాల్సిన అవసరం లేదు.. స్వేచ్ఛగా బతకనిస్తే చాలు. కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా అయితే జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు బిల్లును తీసుకొచ్చి భారతమాత తలెత్తుకొనేలా చేసిందో అలాగే హత్యాచార ఘటనలకు పాల్పడిన దోషులకు ఉరిశిక్ష పడేలా రాష్ట్రాలతో కలసి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి.'



### భయాందోళనలో మహిళలు: రామ్మోహన్ నాయుడు, టీడీపీ

'దిశ హత్య ఘటనతో దేశంలోని ప్రతి మహిళ భయాందోళన చెందుతోంది. ఇలాంటి క్రూరమైన నేరాలకు పాల్పడేవారికి ఉరిశిక్ష వేయాలి. మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి. విద్యార్థి దశలోనే యువకుల్లో కూడా అవగాహన కల్పించాలి. 'నో మీన్స్ నో(లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం)'పై స్కూలు, కాలేజీల్లో, పని ప్రదేశాల్లో అవగాహన కల్పించాలి.'



### ఉరిశిక్ష ఎందుకు అమలు చేయడం లేదు: రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్

'దిశ ఘటన పోలీసుల వైఫల్యం వల్లే జరిగింది. దీనికంటే ముందు హాజీపూర్‌లో 9 నెలల అమ్మాయిని కిడ్నాప్ చేసి అత్యా చారం చేసి హత్య చేశారు. సెషన్స్ కోర్టు దోషికి ఉరి శిక్ష విధించింది. కానీ హైకోర్టు దాన్ని జీవితఖైదుగా మార్చింది. ఉరిశిక్షను ఎందుకు అమలు చేయలేదు? నిర్భయ ఘటనలో కూడా దోషులను ఇప్పటి వరకు శిక్షించలేదు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలి.'



### నిర్ణీత సమయంలో శిక్ష విధించండి: రఘురామ కృష్ణమరాజు, వైఎస్సార్‌సీపీ

'హత్యాచార ఘటనల్లో దోషులకు 30 రోజుల్లోగా శిక్షలు విధించేలా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోపు చట్టం తీసుకోవాలి. దేశంలోఎంత బలమైన నిర్ణయాలనైనా తీసుకోగలిగే ప్రధాని మోదీకి ఈ విషయంలో త్వరగా నిర్ణయం తీసుకో వాలి. దీనికి అన్ని పార్టీలు సహకరిస్తాయి.'



### ముక్తకంఠంతో ఖండించిన అన్ని పార్టీలు..

హైదరాబాద్ ఘటనను లోక్‌సభలో అన్ని పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారికి వెంటనే శిక్షలు పడేలా చట్టం చేయాలని కేంద్రాన్ని కోరాయి. దిశ హత్యాచార ఘటనను ఖండిస్తూ లోక్‌సభలో బీజేడీ సభ్యుడు పినాకి మిశ్రా, ఎన్సీపీ నుంచి సుప్రియా సూలే, అప్నాదల్ నుంచి అనుప్రియా పటేల్, శివసేన నుంచి వినాయక్ బి.రౌత్, బీఎస్పీ నుంచి కున్వర్ దమ్మిఅలీ, టీఎంసీ నుంచి సౌగత్‌రాయ్ మాట్లాడారు. కాగా, చర్చ ముగిసిన అనంతరం ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. రేపిస్టులకు శిక్ష పడాలని ప్లకార్డులు ప్రదర్శించారు.



సోమవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఆందోళన చేస్తున్న ఏబీవీపీ. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఏబీవీపీ ప్రధాన కార్యదర్శి నిధి త్రిపాఠి




### దిశ నిందితులకు న్యాయ సహాయం అందించం

**షాద్‌నగర్ బార్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం**

**షాద్‌నగర్ రూరల్:** శంషాబాద్ సమీపంలోని తొండుపల్లివద్ద జరిగిన దిశపై అత్యాచారం, హత్య చేసిన నిందితులకు న్యాయ సహాయం అందించబోమని షాద్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నడికూడ సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ దిశ హత్య అమానుషమని అన్నారు. మానవ రూపంలో ఉన్న మృగాల వల్ల ఆడపిల్లలకు స్వేచ్ఛ లేకుండాపోయిందని వాపోయారు. నిందితులకు కఠినతరమైన శిక్ష అమలు చేస్తేనే ఇలాంటి తప్పు చేసేందుకు మరొకరు సాహసించరని అభిప్రాయపడ్డారు. కాగా, 'దిశ'మృతికి న్యాయవాదులు వేణుగోపాల్‌రావు, చెంది మహేందర్‌రెడ్డి, గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, పాతపల్లి కృష్ణారెడ్డి, బెన్నూరి చంద్రయ్య, నరేందర్, రమేశ్ బాబు, ఇంజమూరి నర్సింహులు, చెట్లశంకర్, అంజయ్య తదితరులు సంతాపం తెలిపారు.

## విద్యార్థినులకు ఆత్మరక్షణ మెలకువలు నేర్పించండి

**డీజీపీకి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి లేఖ**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని విద్యార్థినులకు షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఆత్మరక్షణ మెలకువలను నేర్పించేందుకు చర్యలు చేపట్టాలని డీజీపీ మహేందర్‌రెడ్డికి విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి సోమవారం లేఖ రాశారు. విద్యార్థినులపై అఘాయిత్యాలు, దాడులు జరగకుండా సరైన అవగాహన కల్పించాలని డీజీపీకి సూచించారు. ఈ విషయంలో పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమస్య వచ్చినపుడు ఎలా ఎదుర్కోవాలి, ఎవరిని ఆశ్రయించాలి అనే విషయంపై విద్యార్థినులను చైతన్య పరచాలని అన్నారు. షీ–టీమ్స్‌పై అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్‌ల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. వేధింపులకు గురవుతున్న మహిళలు, కళాశాల విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. వాట్సాప్, కంట్రోల్ రూమ్, షీ–టీమ్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల్లో వస్తున్న ఫిర్యాదులపై పోలీసులు స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు.

## మా కస్టడీకి ఇవ్వండి

**'దిశ'కేసు నిందితుల కోసం కోర్టులో పోలీసుల పిటిషన్**

**షాద్‌నగర్ టౌన్:** 'దిశ'ను అత్యాచారం, హత్య చేసిన నిందితులను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సోమవారం షాద్‌నగర్ పోలీసులు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఉదయం కోర్టుకు వచ్చిన పోలీసులు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అందుబాటులో లేకపోవడంతో కొద్ది సేపటికే వెళ్లిపోయారు. తిరిగి మధ్యాహ్నం కోర్టుకు వచ్చి పిటీషన్ దాఖలు చేశారు. నిందితులను విచారించి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించాల్సి ఉందని, పది రోజుల కస్టడీ కావాలని పిటీషన్‌లో కోరినట్లు సమాచారం. కస్టడీపై కోర్టు తమ నిర్ణయాన్ని నేడు వెల్లడించనుంది. కాగా, నిందితులను చర్లపల్లి జైలు నుంచి షాద్‌నగర్ కోర్టుకు తీసుకొస్తున్నారన్న పుకార్లతో జనం పెద్ద ఎత్తున కోర్టు వద్దకు వచ్చారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

## నిందితులకు మరణశిక్ష వేయాలి

**ఏబీవీపీ ప్రధాన కార్యదర్శి నిధి త్రిపాఠి**

**కవాడిగూడ:** హైదరాబాద్ నగర శివారులో జరిగిన 'దిశ'అత్యాచారం, హత్యను నిరసిస్తూ సోమవారం అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి పార్క్ నుంచి ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి అనుమతి నిరాకరిస్తూ పోలీసులు విధించిన ఆంక్షలను ధిక్కరిస్తూ విద్యార్థులు కదంతొక్కారు. ఇందిరాపార్క్ చౌరస్తా వద్దకు రాగానే పోలీసులు ర్యాలీని అడ్డుకోవాలని యత్నించగా.. పోలీసులకు, ఏబీవీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో విద్యార్థులు ధర్నాచౌక్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. బహిరంగసభ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నిధి త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హ త్యలు, అత్యాచారాలను అరికట్టడంలో పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన షీ టీమ్స్ షో టీమ్‌లుగా మారాయని ఎద్దేవా చేశారు. దిశ కేసులో నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా మరణశిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పంచాయతీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

### ఫోరంఫర్ గుడ్ గవర్నెన్స్

**సాక్షి, హైదరాబాద్:** గ్రామ పంచాయతీలకు నిధుల కటకట ఏర్పడింది. 30 రోజుల ప్రణాళికలో ఇబ్బడిముబ్బడిగా పనులు చేపట్టిన పంచాయతీ పాలకవర్గాలకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. ప్రత్యేకంగా నయాపైసా విడుదల చేయకపోగా.. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 12వేల పంచాయతీలకు కేవలం రూ.172 కోట్లు సర్దుబాటు చేసింది. 30రోజుల ప్రణాళికలో నిధులు విడుదల చేస్తారనే ఆశతో సొంత డబ్బులు ఖర్చుపెట్టిన సర్పంచ్‌లకు అప్పులే మిగిలాయని తమ విశ్లేషణలో తేలినట్లు ఫోరంఫర్ గుడ్‌గవర్నెన్స్ ప్రకటించింది. సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ పంచాయతీల పనితీరు, నిధుల కేటాయింపుపై జరిపిన పరిశీలనలో నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నట్లు స్పష్టమైందని ఆ సంస్థ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి తెలిపారు. ఈ మేరకు తక్షణమే కేంద్రంతో సమానంగా నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఆయన పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్‌కు లేఖ రాశారు. 2017–18లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పంచాయతీలకు రూ.19.02 కోట్లు విడుదల చేయగా.. ఒక పాలకుర్తి నియోజకవర్గానికే రూ.20కోట్లు (జీవో 618) మంజూరు చేశారని, నారాయణపేటకు జీవో 833 ద్వారా రూ.23.98 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. 73వ రాజ్యాంగ సవరణకనుగుణంగా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాల్సిన సర్కారు.. వాటికి నిధులు, విధులు ఇవ్వకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని ధ్వజమెత్తారు.

## వార్షిక బొగ్గు ఉత్పత్తిలో వెనకబడ్డాం

### సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్



**సాక్షి, హైదరాబాద్:** వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించడానికి ఇంకా మిగిలి ఉన్న 4 నెలలు చాలా కీలకమైనవని సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ అన్నారు. ఇప్పటికే వెనుకబడిన లక్ష్యాలతో పాటు, నెలవారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను గడువులోగా సాధించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం ఆయన సంస్థ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు తదితర కారణాలతో ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యంలో 3 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిలో వెనకబడ్డామన్నారు. రోజుకు 2 లక్షల 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపాలని ఆదేశించారు. ప్రతి రోజు కనీసం 39 రైలు ర్యాక్‌ల ద్వారా బొగ్గు రవాణాకు సంసిద్ధంగా ఉండాలని అన్నారు. కొత్త ఓసీ గనులైన ఐకేఓసీ, కేఓసీ, కేటీకేఓసీ నుంచి మరో 2 నెలల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభంకావాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఎన్.శంకర్, ఎస్.చంద్రశేఖర్, బి.భాస్కర్‌రావు, ఎన్.బలరాం తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన ఉద్యోగి కుటుంబానికి ట్రెసా చేయూత

**సాక్షి, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయారెడ్డిని కాపాడే ప్రయత్నంలో నిప్పంటుకొని 28 రోజులు మృత్యువుతో పోరాడి మరణించిన ఆఫీస్ సబార్డినేట్ చంద్రయ్య కుటుంబానికి తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) బాసటగా నిలిచింది. శంషాబాద్ మండలం రాళ్లగూడలో సోమవారం జరిగిన చంద్రయ్య అంతిమ యాత్రలో పాల్గొన్న ఆ సంఘం నాయకులు అత్యవసర ఖర్చులకుగాను మృతుడి కుటుంబ సభ్యులకు రూ. లక్ష అందజేశారు. చంద్రయ్య మరణం బాధాకరమని, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం, స్థల కేటాయింపు, గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేలా ప్రభుత్వంతో చర్చిస్తామని ట్రెసా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

## బీట్ ఆఫీసర్ల మృతిపై మంత్రి విచారం

**సాక్షి, హైదరాబాద్:** ప్రాణహిత నదిలో పడవ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మృతి చెందడం పట్ల అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చింతల మానెపల్లి మండలం చిత్తాం బీట్ అధికారి బాదావత్ సురేష్ నాయక్, కేతిని బీట్ అధికారి ముంజం బాలకృష్ణ, శివపెల్లి బీట్ అధికారి సద్దాం విధి నిర్వహణలో భాగంగా ప్రాణహిత తీరం వెంట తరచూ తనిఖీలు చేపట్టేవారు. ఆదివారం పడవ బోల్తాపడిన ఘటనలో సద్దాం బయట పడగా మిగతా ఇద్దరు బీట్ అధికారులు నీళ్లలో మునిగిపోయారు. వారి మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి.



సోమవారం జనాభాలెక్కల సేకరణపై ఉన్నతాధికారులతో సమావేశమైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి

# తెలంగాణ భూ చట్టం!

**నూతన రెవెన్యూ చట్టంపై సర్కారు కసరత్తు**

- ఒకే గొడుగు కిందకు పాత చట్టాలు
- కలెక్టర్ల నుంచి అభిప్రాయ సేకరణ
- న్యాయ నిపుణులతో సంప్రదింపులు
- ఉద్యోగుల సర్దుబాటుపై కొత్త చట్టంలో స్పష్టత ఇచ్చే అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** కొత్త రెవెన్యూ చట్టం అమలుతోపాటు రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వివిధ మార్గాల్లో సమాచారాన్ని సేకరిస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న రెవెన్యూ చట్టాలను ఒకే గొడుగు కిందకు తేవాలని భావిస్తున్న సర్కారు.. కొత్త చట్టం అమల్లో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తోంది. కొత్త రెవెన్యూ చట్టానికి 'తెలంగాణ భూ చట్టం'గా నామకరణం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉన్న రెవెన్యూ చట్టాలను ఏకీకృతం చేసేందుకు ప్రస్తుతం మనుగడలో ఉన్న చట్టాలతోపాటు కొత్త చట్టం తీరుతెన్నులు ఎలా ఉండాలనే కోణంలో కలెక్టర్ల నుంచి సమాచారాన్ని కోరింది. అసైన్డ్, ఇనాం, రక్షిత, కౌలుదారు, ప్రభుత్వ భూములు ఇలా ఒక్కో కేటగిరీకి సంబంధించి కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకుంది. మరోవైపు కొత్త చట్టం రూపకల్పనపై నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం నిపుణుల అభిప్రాయాన్ని కూడా కోరింది. గ్రామ పరిపాలనాధికారులు (వీఆర్వో), గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) వ్యవస్థను రద్దు చేయాలా లేక ఇతర శాఖల్లో విలీనం చేయాలా అనే అంశంపైనా సర్కారు కసరత్తు చేస్తోంది.

**తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ కోడ్...**

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ కోడ్–2019ను ప్రవేశపెట్టాలనే వాదన కొందరు అధికారుల్లో వినిపిస్తోంది. ఈ కోడ్ ద్వారా ఇబ్బడిముబ్బడిగా ఉన్న చట్టాల స్థానంలో ఒకే చట్టం అందుబాటులోకి రానుంది. ఈ రెండింటితోపాటు భూ పరిపాలనకు మూలాధారంగా భావించే ల్యాండ్ రెవెన్యూ యాక్ట్–1907ను ప్రామాణికంగా తీసుకొని తెలంగాణ భూ చట్టానికి రూపకల్పన చేస్తే ఎలా ఉంటుందనే అంశంపైనా చర్చ సాగుతోంది. భూ పరిపాలనకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్పృశించే ఈ పాత చట్టం కొలబద్ధగా కొత్త చట్టం రూపొందించడం ఉత్తమమనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

**న్యాయ నిపుణులతో సంప్రదింపులు...**

కొత్త చట్టానికి తుదిరూపు ఇచ్చేందుకు పలు మార్గాల్లో అభిప్రాయ సేకరణ జరుపుతున్న ప్రభుత్వం.. న్యాయపరమైన అవరోధాలు రాకుండా నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం నిపుణుల అభిప్రాయాలను తీసుకుంది. పీఓటీ, ఇనాం, రక్షిత కౌలుదారు, భూ ఆక్రమణ, భూ దురాక్రమణ, ఎల్‌టీఆర్, అసైన్డ్, సర్వే, హద్దులు తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించింది. మరోవైపు రెవెన్యూశాఖలో కొందరు ఉద్యోగుల అవినీతిపై గుర్రుగా ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్.. వీఆర్వో, వీఆర్‌ఏల రెవెన్యూ సేవలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తున్నట్లు కనబడుతోంది. ఇదే అంశంపై శాసనసభ సాక్షిగా స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే వారిని పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖలలో విలీనం చేయలా లేదా పనితీరు, మెరిట్ ఆధారంగా రెవెన్యూలోనే సర్దుబాటు చేయాలా? అనే దానిపై కొత్త చట్టంలో స్పష్టత రానుంది. అలాగే బ్రిటిష్ కాలంలో శిస్తు వసూలు చేయడానికి నియమించిన కలెక్టర్ల వ్యవస్థను ఇప్పటికీ కొనసాగిస్తుండటాన్ని తప్పుబడుతున్న ముఖ్యమంత్రి.. కలెక్టర్ల హోదాను పునఃనిర్వచించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ హోదాల మార్పు కేవలం కలెక్టర్లకే పరిమితం చేయకుండా ఆర్డీఓ, తహసీల్దార్లకు కూడా వర్తింపజేసే అవకాశం కనిపిస్తోంది.

### ప్రభుత్వం ముందు 3 మార్గాలు..!

ప్రస్తుతం అమలులో ఉన్న 124 చట్టాలు/నియమాలను ఒకే గొడుగు కిందకు తేవడంతో పాటు కాలం చెల్లిన వాటిని తొలగించడం, గజిబిజిగా ఉన్న చట్టాలను సరళతరం చేస్తూ ప్రభుత్వం ఒకే చట్టం తీసుకురానున్నది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన టైటిల్ గ్యారంటీ చట్టం అమలు అంశాన్ని పరిశీలిస్తోంది. అయితే పొరుగు రాష్ట్రం ఏపీ టైటిల్ గ్యారంటీ చట్టానికి ఆమోదముద్ర వేయడంతోపాటు సమగ్ర భూ సర్వేకు కూడా శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించింది. అయితే తెలంగాణ ప్రభుత్వం మొదట వేగంగా స్పందించినా ప్రస్తుతం టైటిల్ గ్యారంటీ చట్టం అమలుపై వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఇక ఉమ్మడి రాష్ట్రంలో 1999లో అప్పటి రెవెన్యూశాఖ మంత్రి దేవేందర్‌గౌడ్ 196 చట్టాలను ఏకీకృతం చేస్తూ 'ఏపీ ల్యాండ్ రెవెన్యూ కోడ్'ను ప్రవేశపెట్టడమేగాకుండా రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం ఫైలును ఢిల్లీకి పంపారు. కానీ కాలగమనంలో ఆ ఫైలు అటకెక్కగా రాష్ట్ర పునర్విభజన తర్వాత తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా రెవెన్యూ కోడ్‌ను రూపొందించాలనే అభిప్రాయాన్ని రెవెన్యూ వర్గాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

## జనగణన 45 రోజులు..

- ఏప్రిల్–సెప్టెంబర్ మధ్యలో నిర్వహణ
- 71,136 మంది ఎన్యూమరేటర్లకు శిక్షణ
- ఏర్పాట్లపై సీఎస్ జోషి సమీక్ష

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ జనాభా గణన–2021 కార్యక్రమంలో భాగంగా వచ్చే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 45 రోజుల పాటు రాష్ట్రంలో తొలి విడత జనాభా లెక్కల సేకరణ నిర్వహించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వెల్లడించారు. 2021 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు 20 రోజుల పాటు రెండో విడత జనగణన నిర్వహిస్తామని చెప్పారు. 71,136 మంది ఎన్యూమరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. జనాభా గణన–2021 కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. 65 మంది మాస్టర్ ట్రైనర్లకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో తొలి విడత శిక్షణ ముగిసిందని, రెండో విడత సోమవారం నుంచి 7 వరకు జరుగుతుందని చెప్పారు. జనవరి 2020లో దాదాపు 2,000 మంది ఫీల్డ్ ట్రైనర్లకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఫీల్డ్ ట్రైనర్లు ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు ఏప్రిల్‌లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. జనాభా లెక్కల సేకరణలో భాగంగా గృహాల జాబితాల తయారీ, జనగణనతో పాటు జాతీయ జనాభా రిజిస్టర్‌ను నవీకరిస్తారని వెల్లడించారు. వ్యక్తుల వివరాలతో పాటు సాంఘిక, సాంస్కృతిక, భౌగోళిక, ఆర్థికపర వివరాలను సేకరిస్తారని చెప్పారు. ఎన్యూమరేటర్లు తమ మొబైల్ ఫోన్ యాప్‌తో పాటు కాగితపు దరఖాస్తులను నింపడం ద్వారా జనాభా వివరాలను సేకరిస్తారన్నారు. ఎన్యూమరేషన్ బ్లాకులుగా ఏర్పడి చార్జ్ ఆఫీసర్లను నియమిస్తారన్నారు. జనాభా గణన వ్యవహారాల డైరెక్టర్ కె.ఇలంబర్తి ఇప్పటివరకు చేపట్టిన చర్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్ తివారి, శాంతి కుమారి, అధర్ సిన్హా, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ఉన్నత అధికారి శివశంకర్, విద్యా శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన భూగర్భ జలాలు

### గతేడాది కన్నా 3.56 మీటర్ల ఎగువకు పాతాళగంగ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో భూగర్భ నీటి మట్టాలు మెరుగయ్యాయి. ఈ ఏడాది వర్షాకాల సీజన్‌లో నవంబర్ చివరి వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 840 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, అంతకుమించి 961 మిల్లీమీటర్ల మేర నమోదు కావడం భూగర్భ మట్టాల పెరుగుదలకు కారణమైంది. దీంతో గతేడాది నవంబర్‌లో భూగర్భ జల మట్టాలు 11.09 మీటర్ల లోతులో ఉండగా, ఈ ఏడాది 7.53 మీటర్లకు చేరాయి. అంటే గతేడాదికన్నా 3.56 మీటర్ల ఎగువకు భూగర్భమట్టం పొంగివచ్చింది. అలాగే సిరిసిల్ల జిల్లాలో గతేడాది 14.48 మీటర్లలో భూగర్భ మట్టం ఉండగా, అది ఈ ఏడాది 5.61కి మీటర్లకు చేరింది. ఇక్కడ భూగర్భజల మట్టాల్లో పెరుగుదల గరిష్టంగా 8.87 మీటర్లు మేర ఉంది. ఇక జనగాం, సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, వరంగల్ రూరల్, కరీంగనర్, కామారెడ్డి జిల్లాల్లోనూ 5 మీటర్లకు పైగా పాతాళగంగ పైకి వచ్చినట్లు సోమవారం విడుదలైన భూగర్భ జల విభాగం నివేదికలో వెల్లడించింది. రాష్ట్ర విస్తీర్ణంలో 37 శాతం భూభాగంలో 5 మీటర్ల లోతులోనే భూగర్భ మట్టాలుండగా, మరో 38 శాతం భూభాగంలో 5–10 మీటర్ల లోతులో భూగర్భ మట్టాలున్నాయని నివేదిక తెలిపింది.

# తక్షణం స్పందించండి

- తప్పిపోయిన కేసుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- పోలీసులకు డీజీపీ కార్యాలయం ఆదేశాలు
- రాష్ట్రంలో రోజుకు 44 అదృశ్యం కేసులు నమోదు

**మిస్సింగ్ కేసుల వివరాలు..**

| ఏడాది | కేసులు |
|---|---|
| 2016 | 16,134 |
| 2017 | 19,488 |

| | |
|---|---|
| రోజుకు నమోదవుతున్న కేసుల సగటు | 44 |
| ప్రతీ గంటకు నమోదవుతున్న కేసులు | 02 |
| మిస్సింగ్ కేసుల్లో పురోగతి శాతం | 67 |

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో నమోదవుతున్న మిస్సింగ్ కేసులు ఇప్పుడు మరోసారి చర్చానీయాంశమవుతున్నాయి. వాస్తవానికి ఇలా నమోదవుతున్న వాటిలో 67% పైగా కేసుల్లో తప్పిపోయినవారిని గుర్తిస్తున్నారు. కానీ, యువతులు, టీనేజీ బాలికల విషయంలో మాత్రం పోలీసులు అది ప్రేమ వ్యవహారమంటూ కొట్టిపారేస్తున్నారు. దీంతో కొన్నింటిలో బాధితులు విగతజీవులుగా కనిపిస్తున్నారు. గతంలో బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామంలోనూ ఫిర్యాదు చేసినపుడు పోలీసులు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి. తాజాగా శంషాబాద్ 'దిశ'కేసులోనూ పోలీసులకు యువతి అదృశ్యంపై ఫిర్యాదు చేయగానే.. తొలుత ప్రేమ వ్యవహారమంటూ తేలిగ్గా తీసుకున్నారు. మరునాడు ఆమె విగతజీవిగా మారింది. పోలీసులు అదేక్షణంలో స్పందించి ఉంటే తమ బిడ్డ బతికి ఉండేదని బాధిత కుటుంబీకులు ఆరోపించడంతో ముగ్గురు పోలీసులపై వేటుపడిన సంగతి తెలిసిందే.

**67 శాతం పురోగతి..**

తెలంగాణలో మిస్సింగ్ కేసుల నమోదు భారీగా ఉంటోంది. వాటి పరిశోధన కూడా అంతేస్థాయిలో ఉంటుంది. నేషనల్ క్రైం బ్యూరో రికార్డ్స్ (ఎన్సీఆర్‌బీ) 2017 ప్రకారం.. నమోదైన ప్రతీ వంద కేసుల్లో 67 కేసులను పోలీసులు ఛేదిస్తున్నారు. మిస్సింగ్ కేసుల పురోగతిలో ఒడిశా 87%, కేరళ 85.4 శాతంగా ఉంది. వీటి తరువాత స్థానంలో తెలంగాణ నిలవడం గమనార్హం. సాధారణంగా మిస్సింగ్ కేసుల్లో ఇంటినుంచి పారిపోయిన, తప్పిపోయిన పిల్లలు, మతిస్థిమితం లేనివారు, వృద్ధులు, ప్రేమవ్యవహారాలు, కిడ్నాపులు అన్ని రకాలు ఉంటాయి. పిల్లలు, వృద్ధుల విషయంలో ఎలాంటి ప్రశ్నలు అడగకుండా కేసులు నమోదు చేసే పోలీసులు, యువతుల విషయంలో మాత్రం ప్రేమ వ్యవహారం ఏదైనా ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. అదృశ్యమైనవారు ఆత్మహత్యకు పాల్పడటమో, హత్యకు గురవ్వడమో లేదా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం లాంటి అవకాశాలున్నా.. పోలీసుల తీరు మాత్రం ప్రేమ కోణంలోనే ఉండటంతో తల్లిదండ్రులు కలత చెందుతున్నారు. గతంలో నగరశివారులోని హాజీపూర్‌లో శ్రీనివాస్‌రెడ్డి అనే సైకో... గ్రామంలో ఓ చిన్నారిని కిడ్నాప్ చేసినపుడు పోలీసులు సరిగా దర్యాప్తు చేసి ఉంటే.. తరువాత మరో ఇద్దరు మైనర్ల హత్య జరిగేది కాదనే అభిప్రాయం అక్కడి గ్రామస్తుల్లో వ్యక్తమవ్వడం విదితమే.

**నిర్లక్ష్యం వద్దు : డీజీపీ కార్యాలయం..**

'దిశ'కేసు నేపథ్యంలో యువతులు, బాలికల మిస్సింగ్ కేసుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దని డీజీపీ కార్యాలయం అన్ని జిల్లాల ఎస్పీ, కమిషనరేట్లకు ఆదేశాలు జారీ చేసింది. నిర్లక్ష్యం వహిస్తే.. చర్యలు తప్పవని హెచ్చరించింది. డయల్ 100కు వచ్చే కాల్స్‌లోనూ వీలైనంత త్వరగా ఘటనాస్థలానికి చేరుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.

# అటెండర్ చంద్రయ్య మృతి

- ఎమ్మార్వో విజయారెడ్డిని కాపాడబోయి గాయపడిన చంద్రయ్య
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత..

**హైదరాబాద్, శంషాబాద్:** అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయారెడ్డిని కాపాడబోయి తీవ్రంగా గాయపడిన అటెండర్ చంద్రయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. నవంబర్ 4న అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయారెడ్డిపై కార్యాలయంలోనే రైతు పెట్రోల్ పోసి నిప్పంటించడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. విజయారెడ్డిని కాపాడబోయిన కారు డ్రైవర్ గురునాథం, అటెండర్ చంద్రయ్య తీవ్రంగా గాయపడ్డారు. అయితే, గురునాథం 5న చికిత్స పొందుతూ మృతి చెందగా, హత్యకు కారణమైన కూర సురేశ్ 8న మృతిచెందాడు. ఇక చంద్రయ్య డీఆర్‌డీఎల్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ప్రాణాలొదిలాడు.

**రాళ్లగూడలో చంద్రయ్య అంత్యక్రియలు**

అటెండర్ చంద్రయ్య అంత్యక్రియలు సోమవారం శంషాబాద్ పట్టణంలోని రాళ్లగూడలో జరిగాయి. శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన



చంద్రయ్య జిల్లాల విభజన సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యాలయంలో అటెండర్‌గా నియమితులయ్యారు. సంఘటన జరిగిన తర్వాత ప్రభుత్వం వైద్యం చేయించినప్పటికీ ఇంతవరకు ఆర్థిక సాయం మాత్రం చేయలేదని కుటుంబ సభ్యులన్నారు. ఈ ఘటనలో మృతిచెందిన నలుగురికీ చిన్న పిల్లలే ఉన్నారు. హత్యకు గురైన తహసీల్దార్ విజయారెడ్డికి ఓ కూతురు, ఓ కుమారుడు ఉన్నారు. నిందితుడు సురేశ్‌కు కూతురు, కుమారుడు, డ్రైవర్ గురునాథంకు ఏడాదిన్నర వయసు కుమారుడు, అటెండర్ చంద్రయ్యకు ఓ కూతురు, ఓ కుమారుడు ఉన్నారు. కాగా వీరంతా స్కూల్‌కు వెళ్లే వారే కావడం అందరినీ కలిచివేస్తోంది.

**డ్యూటీకి వెళ్లిన రోజు నుంచి మళ్లీ ఇప్పుడే..**

డ్యూటీకి వెళ్లిన రోజు మా నాన్నను చూశాం.. ఆ తర్వాత మేము ఆస్పత్రికి కూడా వెళ్లలేదు. ఈ రోజు చనిపోయాడని చెప్పారు. మా నాన్న బతికుండగా చూసి చనిపోయిన తర్వాత మళ్లీ ఈరోజే చూడాల్సి వచ్చింది. మా నాన్నే ఇం టికి ఆధారం.. మేము ఇప్పుడు పదో తరగతి, తొమ్మిదో తరగతి చదువుతున్నాం. మమ్మల్ని ఎవరు చదివిస్తారు.. ప్రభుత్వం ఆదుకోవాలి.

–చంద్రయ్య పిల్లలు అభినవ్, కీర్తన

## చికిత్స పొందుతూ ఏఎస్‌ఐ మృతి

**గత నెల 22న ఆత్మహత్యాయత్నం**

**హైదరాబాద్:** బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ముందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మంచాల ఏఎస్సై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మంచాల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.నర్సింహ గత నెల 22న మధ్యాహ్నం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ పైకెక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న విషయం విదితమే. అప్పటి నుంచి కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీవో అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందిన అతడు ఉదయం 5.55 గంటలకు మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న బాలాపూర్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా ఈ ఘటనకు ముందు ఏఎస్సై నర్సింహ బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లోనే విధులు నిర్వహించేవాడు. గత నెల 15వ తేదీన బాలాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తమ బంధువుల విందులో ఉన్న సమయంలో అక్కడికి బాలాపూర్ పెట్రోలింగ్ వాహనం రావడం, ఏఎస్సై కుమారుడికి పోలీసులతో వాగ్వాదం జరగడం, మధ్యలో నర్సింహ రావడంతో గొడవ జరిగింది. ఆ సమయంలో నర్సింహ దూషించిన వీడియోతో కానిస్టేబుళ్లు రాచకొండ సీపీకి ఫిర్యాదు చేయడంతో అతన్ని మంచాల ఠాణాకు బదిలీ చేశారు. గత నెల 21న మంచాల స్టేషన్‌లో విధుల్లో చేరిన ఆయన, మరుసటి రోజు బాలాపూర్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.



# రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన

## ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు మల్లు రవి, నాగం ధ్వజం




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన సాగుతోందని కాంగ్రెస్ నేతలు మల్లు రవి, నాగం జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆనాటి తుగ్లక్ పాలనను మించి ప్రస్తుత పాలనాతీరు ఉందని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలతో పోలీస్ వ్యవస్థ మీద నమ్మకం లేకుండా పోతోందన్నారు. దిశ హత్య అత్యంత దారుణమన్నారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్టుగా కేసీఆర్ తీరు ఉందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినా సీఎం పట్టించుకోవడం లేదని, మహిళల ఆర్తనాదాలు కేసీఆర్‌కు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై సీఎం కనీసం స్పందించకపోవడం దారుణమని, సీఎం మౌనం వెనుక ఆంతర్యమేంటని నిలదీశారు. హోంమంత్రి బాధ్యతారహితంగా 100 డయల్ చేయాలి కదా అంటూ మాట్లాడటం సిగ్గుచేటని, పశు సంవర్థక శాఖ మంత్రి తీరు కూడా సరిగా లేదన్నారు. సుదీర్ఘ కాలం పాటు ఆర్టీసీ సమ్మె సాగినా స్పందించని సీఎం ఇప్పుడు కాలిన గాయాలకు మలామ్ రాస్తూ మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీని బొంద పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సీఎంను నమ్మొద్దని ఆర్టీసీ కార్మికులను కోరుతున్నామన్నారు. సీఎంగా విఫలమైన కేసీఆర్ ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

# మహిళలకు రక్షణ కరువైంది: లక్ష్మణ్



హైదరాబాద్: తెలంగాణలో మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో 'దిశ'పై అత్యాచారం, హత్యకు నిరసనగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. షీ టీమ్‌లు షో టీమ్‌లుగా మారాయే తప్ప ఏ ఒక్క మహిళకూ రక్షణ కల్పించలేకపోతున్నాయని ఆరోపించారు. రోజురోజుకూ మహిళలపై అత్యాచారం, హింస పెరుగుతున్నా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మహిళలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడ్డాక పోలీస్ రిక్రూట్‌మెంట్ మాత్రమే జరుగుతుందని, పోలీసులను నియమించుకునేది సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల రక్షణ కోసమేనా.. మహిళలకు రక్షణ కల్పించరా? అని నిలదీశారు. దిశ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని, అత్యాచారం చేయాలంటేనే భయపడే విధంగా నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

# మైనార్టీలకు పథకాలు అందాలి: పోచారం



సాక్షి, హైదరాబాద్: మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎక్కువ నిధులు కేటాయిస్తున్న ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందని, ప్రభుత్వ పథకాలు మైనార్టీలకు అందేలా చూడాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైనార్టీలను విద్యాపరంగా వృద్ధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం 206 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసిందన్నారు. సోమవారం శాసనసభ కమిటీ హాల్‌లో జరిగిన మైనార్టీ అభివృద్ధి కమిటీ సమావేశంలో పోచారం, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ ఎండీ ఫరీదుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, అన్ని మతాల పండగలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతోందన్నారు. అన్ని మతాల ప్రార్థనా మందిరాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. శాసనసభ మైనార్టీ అభివృద్ధి కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని గుత్తా అన్నారు. తద్వారా మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఉద్దేశించిన పథకాలు పారదర్శకంగా అమలవుతాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు అబ్దుల్ బలాలా, మాగంటి గోపీనాథ్, మాణిక్‌రావు, స్టీఫెన్‌సన్, డి.రాజేశ్వరరావు, ఫారూక్ హుస్సేన్, హుస్సేన్ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు.

# నార్మలైజేషన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



హైదరాబాద్: 2018 కానిస్టేబుల్ నియామకాల్లో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పారదర్శకత పాటించకుండా నూతనంగా నార్మలైజేషన్ విధానాన్ని తీసుకొచ్చి నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. తక్షణమే నార్మలైజేషన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద సోమవారం నిరుద్యోగ పోలీస్ కానిస్టేబుల్స్ అభ్యర్థుల ధర్నా నిర్వహించా రు. జీవో 49, నార్మలైజేషన్‌లను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం సంఘీభావం తెలిపింది. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో అర్హత సాధించినా వారిని ఉద్యోగాల్లో చేర్పించుకోకుండా అశాస్త్రీయ పద్ధతిలో నూతన జీవోలు తీసుకొచ్చి నిరుద్యోగుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నార్మలైజేషన్‌తో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగి పలువురు అన్యాయానికి గురయ్యారని తెలిపారు. మెరిట్ మార్కులు సాధించిన వారికంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులను ఎలా నియమించారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. అన్యాయానికి గురైన నిరుద్యోగ పోలీస్ కానిస్టేబుల్స్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై ఉద్యమించాలి: చాడ



సాక్షి, హైదరాబాద్: కార్మికులు వారి హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. కార్మికసంఘాల నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటున్న ఏఐటీయూసీని గ్రామస్థాయి వరకు విస్తరించి, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై పోరాడాలని సూచించారు. సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో చాడ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తోందని ధ్వజమెత్తారు. ఉద్యమ నాయకుడినని చెప్పుకునే సీఎం కేసీఆర్.. కార్మిక చట్టాలు, హక్కులను గౌరవించకుండా రాష్ట్రంలో సంఘాలే లేకుండా కుట్రపన్నుతున్నా రని ఆరోపించారు. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు 55 రోజులు సమ్మె చేస్తే ఏమాత్రం స్పందించని సీఎం కార్మికులను ప్రగతిభవన్‌ను పిలిపించుకుని వరాల జల్లును కురిపించడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు టి.నరసింహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ బోస్, వర్కింగ్ ప్రెసిడెంట్ యూసఫ్, ఉపాధ్యక్షుడు కె.గంగాధరరావు పాల్గొన్నారు.

భారత ఆహార సంస్థ
No. S&S.2(1)/OMSS(D)/Wheat/2019-20 తేదీ : 30-11-2019
ప్రకటన
తెలంగాణ ప్రాంతంలో సాంకేతికంగా అర్హత కలిగిన టోకు వినియోగదారులు / ఎఫ్‌సిఐతో ఎంపానెల్ చేయబడిన వ్యాపారుల నుండి 2019 డిసెంబర్ నెలలో వారానికొకసారి ఇ-వేలం ద్వారా ఓఎంఎస్ఎస్(డి) క్రింద గోధుమల అమ్మకం కోసం బిడ్లు ఆహ్వానించబడతాయి. మరిన్ని వివరాలు www.fci.gov.in/tender.php మరియు www.valuejunction.in/fci లో లభిస్తాయి.
జనరల్ మేనేజర్ (తెలంగాణ)

- ఈ నెల 5వ తేదీని రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ దినోత్సవంగా జరపాలని మైనార్టీ కమిషన్ సర్వసభ్య సమావేశంలో నిర్ణయించినట్లు రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ ఖమురుద్దీన్ తెలిపారు. సోమవారం జలమండలి నాలుగో అంతస్తులోని కమిషన్ కార్యాలయంలో ఖమురుద్దీన్ విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణ ప్రభుత్వం
డైరెక్టర్ కార్యాలయం, ఆయుష్ శాఖ
5వ అంతస్తు, TSGLI బిల్డింగ్, తిలక్ రోడ్, అబిడ్స్, తెలంగాణ, హైదరాబాద్
నోటిఫికేషన్
తెలంగాణ రాష్ట్ర ఆయుష్ శాఖ నియంత్రణ క్రింద శాశ్వత ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ (యునాని)-18 SC/ST బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకం కోసం అర్హతగల అభ్యర్థుల నుండి www.ayush.telangana.gov.in ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి. సవివరమైన నోటిఫికేషన్, యూజర్‌గైడ్ మరియు ఇన్ఫర్మేషన్ బులెటిన్ 03.12.2019 నుండి వర్తింపుతో www.ayush.telangana.gov.in వెబ్‌సైట్‌లో లభ్యమగును. అర్హత గల SC/ST అభ్యర్థులు వారి దరఖాస్తులను 03.12.2019 నుండి 15.12.2019 వరకు ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయవలెను.
సం/- డైరెక్టర్
DIPR RO. No.1833-DP/CL/ADVT/1/2019-20, Dt: 02.12.2019

# బస్సు చార్జీల పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

కనీసం రూ. 100 కోట్ల అదనపు భారం పడనుంది. దీంతో తాజా పెంపు భారం రూ. 850 కోట్లకు చేరుతుందని అంచనా. సుదీర్ఘ కాలం సమ్మె తర్వాత బేషరతుగా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడంతో వారిలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. దీనికితోడు ముఖ్యమంత్రి ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేయడంతో పనితీరులో గణనీయ మార్పు వస్తుందన్న అంచనా ఉంది. దీనివల్ల బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరుగుతుందని అధికారులు నమ్ముతున్నారు. ఇదే జరిగితే చార్జీల పెంపుతో వచ్చే అదనపు ఆదాయం రూ. వెయ్యి కోట్లకు చేరుతుందన్న భావన వ్యక్తమవుతోంది.

**వై.ఎస్. హయాంలో పెరగని చార్జీలు...**

ఉమ్మడి రాష్ట్రంలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా బస్సు చార్జీలు పెరగలేదు. చార్జీల పెంపుతో జనంపై భారం మోపడం కంటే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయం పెంచుకోవడంతోపాటు సిబ్బంది పనితీరు మెరుగుపరచడం, ఖర్చులను నియంత్రించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే పద్ధతులను అవలంబించారు. దీంతో ఆర్టీసీకి పెద్ద ఇబ్బంది లేకుండా పోయింది. అయితే ఆయన మరణానంతరం వరుసగా ఏటా టికెట్ చార్జీలు పెంచుతూ పోయారు. 2010లో ఏకంగా 28.41 శాతం పెంచి జనంపై రూ. 196 కోట్ల భారం మోపారు. 2011లో 10 శాతం పెంచారు. ఫలితంగా ప్రజల జేబుకు రూ. 221 కోట్ల మేర చిల్లు పడింది. 2012లో 12.50 శాతం, 2013లో 9.50 శాతం మేర టికెట్ చార్జీలు పెంచారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలి రెండున్నరేళ్లలో సర్కారు టికెట్ చార్జీల పెంపు జోలికి వెళ్లలేదు. అయితే ఆర్టీసీ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి జీతాలు చెల్లించేందుకు కూడా ఇబ్బంది పడే స్థాయికి చేరడంతో వెంటనే టికెట్ చార్జీలు పెంచుకునేందుకు అనుమతించాల్సిందిగా అధికారులు ప్రభుత్వాన్ని కోరడం మొదలుపెట్టారు. ఎట్టకేలకు 2016లో 10 శాతం చార్జీలు పెంచారు. కానీ అది ఏమాత్రం సరిపోకపోవడంతో కనీసం 15 శాతం నుంచి 20 శాతం మేర పెంచుకునేందుకు అనుమతించాలని ఆ తర్వాత నాలుగు పర్యాయాలు ఆర్టీసీ కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇంతకాలం తర్వాత ఇప్పుడు మరోసారి పెంచుకునేందుకు సీఎం అనుమతించారు. దాదాపు అధికారులు కోరిన స్థాయిలోనే పెంపు జరిగింది.

### ప్రధాన ప్రాంతాల మధ్య వివిధ కేటగిరీ బస్సు చార్జీలు ఇలా.. (అంకెలు రూ.లలో)

| | ఎక్స్‌ప్రెస్ | | సూపర్ లగ్జరీ | | రాజధాని (ఏసీ) | | గరుడ ప్లస్ (ఏసీ) | |
|---|---|---|---|---|---|---|---|---|
| రూటు | పాత | కొత్త | పాత | కొత్త | పాత | కొత్త | పాత | కొత్త |
| హైదరాబాద్–బెంగళూరు | – | – | – | – | – | – | 1,010 | 1,290 |
| హైదరాబాద్– పుణే | – | – | – | – | – | – | 1,305 | 1,500 |
| హైదరాబాద్– షిర్డీ | – | – | – | – | – | – | 1,245 | 1,610 |
| హైదరాబాద్– తిరుపతి | – | – | – | – | – | – | 1,130 | 1,170 |
| హైదరాబాద్–విజయవాడ | – | – | – | – | – | – | 570 | 620 |
| హైదరాబాద్–రాయచూర్ | 195 | 224 | – | – | – | – | – | – |
| జేబీఎస్– కరీంనగర్ | 148 | 180 | 195 | 230 | 269 | 310 | 330 | 370 |
| హైదరాబాద్– హన్మకొండ | 130 | 170 | 185 | 215 | 260 | 290 | 310 | 350 |
| హైదరాబాద్–నిజామాబాద్ | 174 | 210 | 232 | 270 | 294 | 330 | – | – |
| హైదరాబాద్–ఖమ్మం | 179 | 220 | 238 | 280 | 326 | 370 | 400 | 400 |
| హైదరాబాద్–ఆదిలాబాద్ | – | – | 394 | 460 | 523 | 590 | – | – |
| హైదరాబాద్–నిర్మల్ | 220 | 270 | 290 | 345 | 363 | 445 | – | – |
| హైదరాబాద్–మహబూబ్‌నగర్ | 95 | 115 | 125 | 145 | – | – | – | – |
| సంగారెడ్డి– విజయవాడ | – | – | 409 | 480 | – | – | – | – |
| హన్మకొండ– బెంగళూరు | – | – | 884 | 1,045 | 1,049 | 1,350 | 1,303 | 1,620 |
| ఖమ్మం– భద్రాచలం | 110 | 135 | 146 | 175 | 208 | 220 | – | – |

### వివిధ ప్రాంతాలకు పల్లె వెలుగు చార్జీలు ఇలా (అంకెలు రూ.లలో)

| రూటు | పాత | కొత్త |
|---|---|---|
| సిద్దిపేట–హన్మకొండ | 61 | 83 |
| జేబీఎస్– గజ్వేల్ | 41 | 54 |
| సంగారెడ్డి–పటాన్‌చెరు | 16 | 21 |
| హన్మకొండ–నర్సంపేట | 29 | 35 |
| హన్మకొండ–ఖమ్మం | 82 | 105 |
| ఆదిలాబాద్–నిర్మల్ | 58 | 76 |
| నిర్మల్–నిజామాబాద్ | 49 | 64 |
| ఖమ్మం–కోదాడ | 24 | 34 |
| హైదరాబాద్–వికారాబాద్ | 50 | 66 |
| హైదరాబాద్–కల్వకుర్తి | 61 | 80 |

| సాధారణ పాస్‌ల రకాలు | పాత ధర | కొత్త ధర |
|---|---|---|
| **జీబీటీ–నెల బస్‌పాస్‌లు** | | |
| జీబీటీ–సాధారణం | 770 | 950 |
| జీబీటీ–మెట్రో ఎక్స్‌ప్రెస్ | 880 | 1070 |
| జీబీటీ–మెట్రో డీలక్స్ | 990 | 1185 |
| **ఎన్‌జీవో–నెల బస్‌పాస్‌లు** | | |
| జీబీటీ–సాధారణం | 260 | 320 |
| మెట్రో ఎక్స్‌ప్రెస్ | 370 | 450 |
| మెట్రో డీలక్స్ | 480 | 575 |
| ఎంఎంటీఎస్–ఆర్టీసీ కాంబీ టికెట్ | 880 | 1090 |
| సీటీ–మెట్రో కాంబీ టికెట్ | 10 | 10 |
| జిల్లా స్టూడెంట్ కాంబీ టికెట్ | 10 | 10 |
| రివైజ్‌డ్ టారీఫ్ ఫర్ ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్స్ (ఫర్ గ్రేటర్ హైదరాబాద్, వరంగల్) | | |
| నాన్ ఏసీ | 80 | 100 |

### విద్యార్థుల బస్సు పాస్‌ల పాత, కొత్త ధరలు

| పాస్‌ల రకాలు | పాత | కొత్త | ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు పాత | కొత్త ధర (రూ.) |
|---|---|---|---|---|
| **1. రూట్ పాస్‌లు సిటీస్/టౌన్స్ (త్రైమాసిక)** | | | | |
| 4 కి.మీ. వరకు | 130 | 165 | – | – |
| 8 కి.మీ. వరకు | 160 | 200 | – | – |
| 12 కి.మీ. వరకు | 195 | 245 | – | – |
| 18 కి.మీ. వరకు | 225 | 280 | – | – |
| 22 కి.మీ. వరకు | 265 | 330 | – | – |
| **2.స్కూల్/కాలేజీ విద్యార్థులు–మఫిసిల్ (త్రైమాసికం)** | | | | |
| 5 కి.మీ. వరకు | 235 | 310 | 60 | 80 |
| 10 కి.మీ. వరకు | 315 | 415 | 80 | 105 |
| 15 కి.మీ. వరకు | 385 | 510 | 100 | 135 |
| 20 కి.మీ. వరకు | 510 | 675 | 130 | 175 |
| 25 కి.మీ. వరకు | 645 | 850 | 165 | 220 |
| 30 కి.మీ. వరకు | 705 | 930 | 180 | 240 |
| 35 కి.మీ. వరకు | 775 | 1,025 | 195 | 260 |
| **3. స్కూల్/కాలేజీ విద్యార్థులు–మఫిసిల్ (నెలవారీగా)** | | | | |
| 5 కి.మీ. వరకు | 85 | 115 | 25 | 35 |
| 10 కి.మీ. వరకు | 105 | 140 | 30 | 40 |
| 15 కి.మీ. వరకు | 135 | 180 | 35 | 50 |
| 20 కి.మీ. వరకు | 180 | 240 | 45 | 60 |
| 25 కి.మీ. వరకు | 225 | 300 | 60 | 80 |
| 30 కి.మీ. వరకు | 250 | 330 | 65 | 85 |
| 35 కి.మీ. వరకు | 270 | 355 | 70 | 95 |
| **4. విద్యార్థుల జనరల్ బస్ టికెట్ (ఎస్జీబీటీ) (హైదరాబాద్/వరంగల్)** | | | | |
| ఎస్జీబీటీ (నెల) | 130 | 165 | 40 | 50 |
| ఎస్జీబీటీ (త్రైమాసిక) | 390 | 495 | 120 | 150 |
| ఎస్జీబీటీ చైల్డ్ మెట్రో ఎక్స్‌ప్రెస్ (నెల) | – | – | 70 | 90 |
| ఎస్జీబీటీ చైల్డ్ మెట్రో ఎక్స్‌ప్రెస్ (త్రైమాసిక) | – | – | 210 | 270 |
| ఎస్‌జీబీటీ–స్పెషల్ (నెల) | 210 | 260 | 55 | 70 |
| ఎస్జీబీటీ–స్పెషల్ (త్రైమాసిక) | 630 | 780 | 165 | 210 |

### పల్లె వెలుగు చార్జీలు ఇలా.. (రూ. లలో)

| దూరం | పాత చార్జీ | కొత్త చార్జీ | చిన్నపిల్లలకు | క్యాట్/వనిత కార్డులకు |
|---|---|---|---|---|
| 5 కి.మీ. | 6.00 | 10.00 | 10.00 | 10.00 |
| 10 | 8.00 | 10.00 | 10.00 | 10.00 |
| 15 | 11.00 | 13.00 | 10.00 | 12.00 |
| 20 | 13.00 | 17.00 | 10.00 | 15.00 |
| 25 | 16.00 | 21.00 | 11.00 | 19.00 |
| 30 | 19.00 | 25.00 | 13.00 | 22.00 |
| 35 | 23.00 | 30.00 | 15.00 | 27.00 |
| 40 | 26.00 | 34.00 | 17.00 | 31.00 |
| 45 | 29.00 | 38.00 | 19.00 | 34.00 |
| 50 | 32.00 | 42.00 | 21.00 | 38.00 |
| 55 | 35.00 | 46.00 | 23.00 | 41.00 |
| 60 | 38.00 | 50.00 | 25.00 | 45.00 |
| 65 | 41.00 | 54.00 | 27.00 | 49.00 |
| 70 | 44.00 | 59.00 | 30.00 | 53.00 |
| 75 | 47.00 | 63.00 | 32.00 | 57.00 |
| 80 | 50.00 | 67.00 | 34.00 | 60.00 |
| 85 | 53.00 | 71.00 | 36.00 | 64.00 |
| 90 | 56.00 | 75.00 | 38.00 | 67.00 |
| 95 | 59.00 | 79.00 | 40.00 | 71.00 |
| 100 | 61.00 | 83.00 | 42.00 | 75.00 |
| 105 | 64.00 | 88.00 | 44.00 | 79.00 |
| 110 | 67.00 | 92.00 | 46.00 | 83.00 |
| 115 | 70.00 | 96.00 | 48.00 | 86.00 |
| 120 | 73.00 | 100.00 | 50.00 | 90.00 |

### సిటీ సర్వీసులు ఇలా....(రూ. లలో)

| కి.మీ. | స్టేజీలు | సిటీ ఆర్డినరీ | | మెట్రో ఎక్స్‌ప్రెస్ | | మెట్రోడీలక్స్ | |
|---|---|---|---|---|---|---|---|
| | | పాత | కొత్త | పాత | కొత్త | పాత | కొత్త |
| 2 | 1 | 5 | 10 | 10 | 10 | 10 | 15 |
| 4 | 2 | 10 | 10 | 10 | 15 | 10 | 15 |
| 6 | 3 | 10 | 15 | 10 | 15 | 15 | 20 |
| 8 | 4 | 10 | 15 | 15 | 20 | 15 | 20 |
| 10 | 5 | 10 | 15 | 15 | 20 | 15 | 20 |
| 12 | 6 | 15 | 20 | 15 | 20 | 15 | 20 |
| 14 | 7 | 15 | 20 | 15 | 20 | 20 | 25 |
| 16 | 8 | 15 | 20 | 20 | 25 | 20 | 25 |
| 18 | 9 | 15 | 20 | 20 | 25 | 20 | 25 |
| 20 | 10 | 20 | 25 | 20 | 25 | 20 | 25 |
| 22 | 11 | 20 | 25 | 20 | 25 | 20 | 25 |
| 24 | 12 | 20 | 25 | 20 | 25 | 25 | 30 |
| 26 | 13 | 20 | 25 | 25 | 30 | 25 | 30 |
| 28 | 14 | 20 | 25 | 25 | 30 | 25 | 30 |
| 30 | 15 | 25 | 30 | 25 | 30 | 25 | 30 |
| 32 | 16 | 25 | 30 | 25 | 30 | 30 | 40 |
| 34 | 17 | 25 | 30 | 25 | 30 | 30 | 40 |
| 36 | 18 | 25 | 30 | 30 | 35 | 30 | 45 |
| 38 | 19 | 25 | 30 | 30 | 35 | 30 | 45 |
| 40 | 20 | 30 | 35 | 30 | 35 | 30 | 45 |

### కిలోమీటరు చార్జీ, కనిష్ట చార్జీ ఇలా...(రూ.లలో)

| బస్సు రకం | ప్రస్తుత చార్జీ | కొత్త చార్జీ | కనిష్ట చార్జీ పాత | కనిష్ట చార్జీ కొత్త |
|---|---|---|---|---|
| పల్లెవెలుగు | 63 పైసలు | 83 పైసలు | రూ.5 | రూ.10 |
| ఎక్స్‌ప్రెస్ | 87 పైసలు | రూ. 1.07 | రూ.10 | రూ.15 |
| డీలక్స్ | 98 పైసలు | రూ. 1.18 | రూ.10 | రూ.20 |
| సూపర్‌లగ్జరీ | రూ.1.16 | రూ. 1.36 | రూ.15 | రూ.25 |
| రాజధాని/వజ్ర | రూ. 1.46 | రూ. 1.66 | రూ.20 | రూ.35 |
| గరుడ | రూ. 1.71 | రూ. 1.91 | – | రూ.35 |
| గరుడ ప్లస్ | రూ. 1.82 | రూ. 2.02 | – | రూ.35 |
| వెన్నెల | రూ. 2.53 | రూ. 2.73 | – | రూ.70 |

## పెంపుతో సిటీ బస్సు ఆదాయం రూ.324 కోట్లు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చార్జీల పెంపు ప్రభావం హైదరాబాద్‌పై భారీగానే పడనుంది. ప్రస్తుతం ఆర్టీసీకి వస్తున్న నష్టాల్లో సగం వాటా సిటీవే ఉంటున్నాయి. ఆ నష్టాలను వీలైనంత మేర తగ్గించేందుకు కసరత్తు మొదలైన తరుణంలో, చార్జీల పెంపు ఆర్టీసీకి బాగానే కలిసి వచ్చే అవకాశం ఉంది. కిలోమీటరుకు 20 పైసలు చొప్పున పెంచగా, శాతాల్లో అది 18.80 శాతంగా ఉండనుంది. కానీ సిటీ సర్వీసుల వరకు వచ్చేసరికి అది 23 శాతంగా ఉంటోంది. కిలోమీటర్ల లెక్క కాకుండా సిటీలో స్టాపుల ప్రాతిపదికగా చార్జీల పెంపు ఉంది. పైగా, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులకు రూ.5గా ఉన్న కనిష్ట చార్జీని రూ.20కి పెంచారు. నగరంలో ఉన్న బస్సుల్లో వీటి సంఖ్యే ఎక్కువగా ఉండటం, ప్రయాణికుల సంఖ్య కూడా వీటిల్లోనే ఎక్కువగా ఉంటుండటంతో ఈ మార్పు కూడా కలిసిరానుంది. వెరసి.. తాజా రేట్ల సవరణతో సిటీ సర్వీసులకు సంబంధించి వార్షికంగా రూ.324 కోట్ల మేర ఆదాయం వస్తుందని అధికారుల అంచనా వేస్తున్నారు. సుదీర్ఘకాలం సమ్మె కొనసాగిన నేపథ్యంలో ప్రయాణికులు ప్రత్యామ్నాయ వాహనాలను ఆశ్రయించటం అలవాటు చేసుకున్నారు. ఇప్పుడు వారంతా యథావిధిగా సిటీ బస్సుల్లోనే ఎక్కుతారని భావిస్తున్నారు.



# ఆర్టీసీ సమ్మెపై పిల్ డిస్మిస్

- సమ్మె ముగించడం ఆనందంగా ఉందన్న హైకోర్టు
- కార్మికులను విధుల్లోకి తీసుకోవడంపై హర్షం

సాక్షి, హైదరాబాద్: 'లంక దహనం తర్వాత విభీషణుడిని రాజ్యాధిపతిని చేశారు. ఏదేమైనా ఆర్టీసీ సమస్యకు ముగింపు రావడం ఆనందంగా ఉంది' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. 52 రోజుల పాటు జరిగిన ఆర్టీసీ సమ్మె ముగింపు ఏవిధంగా జరిగినా, మొత్తానికి ముగింపు రావడం ఆనందంగా ఉందని పేర్కొంది. ఆర్టీసీకి రూ.100 కోట్లు ఇస్తామని, రూట్లను ప్రైవేటీకరణ చేయబోమని, ఈ వ్యవహారాన్ని లేబర్ కోర్టుకు తీసుకుపోబోమని ప్రభుత్వం ప్రకటించడంపై ధర్మాసనం ప్రస్తావించింది. సిబ్బందిని విధుల్లో చేర్చుకునేందుకు ప్రభుత్వం సమ్మతి తెలిపినందున పిల్‌పై విచారణ అవసరం లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం, సమ్మె విరమించినా విధుల్లోకి చేర్చుకోవట్లేదని ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు దాఖలు చేసిన వ్యక్తిగత వ్యాజ్యాన్ని సోమవారం ధర్మాసనం మరోసారి విచారించింది. ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల్లోని ఒకరికి ఉద్యోగం ఇస్తామని, పనిచేసిన సెప్టెంబర్ నెలకే కాకుండా సమ్మె కాలానికి కూడా జీతాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. యూనియన్లు తమ డిమాండ్ల సాధన కోసం పనిచేసే మార్గాలున్నాయని, ఇలాంటి అంశాలపై పిటిషనర్లు పిల్స్ ద్వారా పోరాటం చేయాల్సిన అవసరం రాకుండా యూనియన్లు తమ విధులు నిర్వహించుకునే అవకాశాలు కల్పించాలని ధర్మాసనం హితవు పలికింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. నాలుగు డిమాండ్ల సాధన కోసం రూ.47 కోట్లు ఇవ్వాలని హైకోర్టు కోరితే.. ససేమిరా అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించడాన్ని తప్పుపట్టారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, ఆర్టీసీ సమ్మె సమస్యను పరిష్కరించిన తీరు ఏమాత్రం హుందాగా లేదని విమర్శించారు. దీనిపై స్పందించని ధర్మాసనం పిల్‌ను డిస్మిస్ చేసింది.

# నష్టాలు.. ఆపై సమ్మె కష్టాలు

**రూ.1200కోట్లకు చేరిన ఆర్టీసీ ఆర్థిక భారం..**

సాక్షి, హైదరాబాద్: గత ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీ దాదాపు రూ.928 కోట్ల నష్టాన్ని మూటగట్టుకుంది. ఈసారి అది రూ. వేయికోట్లకు మించుతుందని అప్పట్లోనే అంచనా వేశారు. తాజాగా 52 రోజుల పాటు జరిగిన సమ్మె వల్ల పరిస్థితి అంతా అస్తవ్యస్తమై ఆ నష్టం రూ.1,200 కోట్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. అధికారులు ఇదే విషయాన్ని ఇటీవల సీఎం కేసీఆర్‌కు కూడా తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా నష్టాలు ఈస్థాయిలో నమోదుకాలేదు. అప్పట్లో గరిష్టంగా రూ.718 కోట్లుగా నమోదయ్యాయి. ఇప్పుడు ఒక్క టీఎస్‌ఆర్టీసీ నష్టాలే రూ.1200 కోట్లకు చేరుకునే స్థితి ఉత్పన్నం కావటం ఆందోళన పరుస్తున్న విషయం. పెరిగిన టికెట్ల ధరలతో రూ.850 కోట్ల మేర ఆదాయం పెరగనుంది. సమ్మె వల్ల అదనపు నష్టం నమోదై ఉండకపోతే ఆర్టీసీ స్థితి మెరుగ్గా ఉండేది. ఇప్పుడు ఆశించిన అదనపు ఆదాయం వచ్చినా నష్టాలదే పైచేయి కానుంది.

**మరోసారి పెంచే యోచన**

ప్రస్తుత టికెట్ ధరల పెంపుతో ప్రయాణికులపై భారం పడనున్నప్పటికీ, ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మరోసారి కూడా చార్జీలు పెంచే అవకాశం ఉందనిపిస్తోంది. మరో 10 % మేర ధరలను సవరిస్తే నష్టాలను వీలైనంత మేర తగ్గించుకుని బ్రేక్ ఈవెన్‌కు చేరుకుంటుందని అధికారుల అంచనా. మరో ఏడాది తర్వాత ప్రభుత్వానికి చార్జీలు పెంపుపై ప్రతిపాదించాలని యోచిస్తున్నారు.

**ఆర్థిక పరిస్థితిపై అంచనాకు వచ్చినందునే...**

సాధారణంగా ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు అనగానే ఇటు ప్రజలతోపాటు అటు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు భగ్గుమనటం సహజం. ఈసారి ఆ స్థాయిలో నిరసనలు లేవు. సమ్మె వల్ల తీవ్రంగా ఇబ్బంది పడ్డ జనం, నిరసనల్లో ఆర్టీసీ కార్మికులు చెప్పిన మాటలతో ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై ఓ అంచనాకొచ్చినట్టు కనిపిస్తోంది. బస్సు చార్జీలు పెంచితే తప్ప పరిస్థితి చక్కబడదన్న మాటలు ప్రభావం చూపినట్టు కనిపిస్తోంది. ఇక రాజకీయ పార్టీలు కొన్ని విమర్శలు చేసినా .. నిరసనల వరకు వెళ్లకపోవటం గమనార్హం. బస్సు చార్జీల పెంపు వల్ల ఇతర వస్తువుల ధరలు కూడా భగ్గుమంటాయన్న ఆందోళన జనంలో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా చాలా ప్రాంతాల్లో కూరగాయలను బస్సుల్లో తరలిస్తుంటారు. చార్జీల మోతతో వాటి ధరలు కూడా పెంచుతారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# వేధింపుల పర్వం



## ఆరేళ్ల చిన్నారిని చిదిమేసిన ట్రక్కు డ్రైవర్

**జైపూర్:** ఆరేళ్ల చిన్నారిని రేప్ చేసి, హత్య చేసిన ఓ ట్రక్కు డ్రైవర్‌ను రాజస్తాన్‌లోని టొంక్ జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేశారు. చాక్లెట్లు ఇస్తానని చెప్పి, స్కూల్ వద్ద నుంచి తీసుకెళ్లిన నిందితుడు మహేంద్ర అలియాస్ ఢోలు చిన్నారిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. నిందితుడు చిన్నారికి తెలిసిన వ్యక్తి కావడంతో.. తల్లిదండ్రులకు చెబుతుందేమోనన్న భయంతో పాపను అక్కడే చంపేశాడని ఎస్పీ ఆదర్శ్ తెలిపారు. ఈ అఘాయిత్యానికి పాల్పడ్డ సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని చెప్పారు. ఈ దారుణానికి పాల్పడ్డ తర్వాత రాజస్తాన్ విడిచి పారిపోవాలని భావించాడని, అయితే అలీగఢ్‌లో పట్టుపడ్డాడని వివరించారు. నిందితుడి వయసు 41 ఏళ్లు ఉంటుందని, ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అతడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారని ఎస్పీ తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమం తర్వాత చిన్నారి కన్పించడం లేదని మొత్తం వెతికారు. మరుసటి రోజు ఉదయం స్కూల్ సమీపంలో పాప శవమై కన్పించింది. స్కూల్ బెల్టుతో మెడకు బిగించి ఊపిరాడకుండా చంపేశాడని పోలీసులు తెలిపారు.

## కన్న తండ్రే కూతురిపై..

**జైపూర్:** సొంత తండ్రే కన్న కూతురిని గొలుసులతో కట్టేసి, హింసించి, పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డ హేయమైన ఘటన రాజస్తాన్‌లోని జలోర్ జిల్లాలో జరిగింది. తన తండ్రి వేరే మహిళతో చనువుగా ఉన్న సమయంలో తాను చూశాననే కోపంతో గొలుసులతో తన కాళ్లు, చేతులు కట్టేసి పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని పేర్కొంది. ఇంటి నుంచి బాధితురాలు శుక్రవారం తప్పించుకుని తన మేనమామ పొలం దగ్గరికి వచ్చింది. అప్పటికీ తన చేతులు గొలుసులతో కట్టేసి ఉన్నాయి. జరిగిన విషయాన్ని తన మేనమామతో చెబితే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోజూ ఇంట్లో జరిగే హింసను తట్టుకోలేక బాధితురాలి తల్లి ఏడేళ్ల కిందటే నిందితుడిని వదిలేసి వేరే పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు.

## ఒడిశాలో గ్యాంగ్ రేప్..
### నిందితుల్లో కానిస్టేబుల్

**పూరి:** ఒడిశాలోని పూరీలో సోమవారం ఓ మహిళపై గ్యాంగ్ రేప్ జరిగింది. కాకట్‌పర గ్రామానికి చెందిన బాధితురాలు నిమపరలోని బస్టాండ్ వద్ద బస్ కోసం ఎదురుచూస్తోంది. అదే సమయంలో అక్కడికి కారులో వచ్చిన ఓ వ్యక్తి..కాకట్‌పర తీసుకెళ్తానంటూ ఆమెను కారులో ఎక్కించుకున్నాడు. ఆ సమయంలో కారులో మరో ముగ్గురు వ్యక్తులున్నారు. బాధితురాలిని ఝుడేశ్వరి క్లబ్ పక్కనున్న పోలీస్ క్వార్టర్ల వద్దకు తీసుకెళ్లి ఇద్దరు రేప్ చేశారు. అక్కడ తనకు దొరికిన పర్స్‌ను బాధితురాలు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదుచేసింది. అందులోని ఐడీకార్డుల ద్వారా నిందితుడైన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసి, అరెస్ట్‌చేశారు.

## నిర్భయ నిధుల పరిస్థితేంటి?
### కేంద్రం, రాష్ట్రాలు, యూటీలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

**న్యూఢిల్లీ:** మహిళలపై లైంగిక వేధింపుల ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆందోళన వ్యక్తం చేసింది. లైంగిక వేధింపుల కేసుల విషయంలో ఏ విధంగా స్పందిస్తున్నారు? నిర్భయ నిధుల వినియోగం ఎలా ఉంది? అనే వివరాలు కోరుతూ కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ) ప్రభుత్వాలకు సోమవారం నోటీసులు జారీ చేసింది. మహిళలపై లైంగిక వేధింపుల ఘటనలు పెరుగుతుండటంపై మీడియాలో వచ్చిన కథనాలను సుమోటోగా తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. గత మూడేళ్లలో నిర్భయ నిధులను వినియోగించిన తీరును, ప్రస్తుతం ఆ నిధులు ఏ మేరకు ఉన్నాయనే విషయాన్ని తెలుపుతూ ఆరు వారాల్లోగా తమకు నివేదిక అందించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. తమ పిల్లలో, ఇంట్లోని మహిళలో కనిపించడం లేదని, వారి ఆచూకీ తెలుసుకోవాలని ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. ఎవరితోనైనా వెళ్లిపోయిందేమోనన్న నిర్లక్ష్యపూరిత జవాబే ఎక్కువగా పోలీసుల నుంచి వస్తోందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ వ్యాఖ్యానించింది. ఇలాంటి ఆలోచన తీరును మార్చుకోవాలని సూచించింది. 'హైదరాబాద్‌లో వెటర్నరీ డాక్టర్‌ను నలుగురు రేప్‌చేసి, చంపేసి, మృతదేహాన్ని కాల్చేశారు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే ఈ దారుణం జరిగి ఉండేది కాదేమో' అని ఎన్‌హెచ్‌ఆర్‌సీ అభిప్రాయపడింది. నిర్భయ నిధి సహా మహిళల రక్షణ కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయాలు, నిబంధనలను.. రాష్ట్రాలు, యూటీల్లో వాటి అమలును సమగ్ర నివేదిక రూపంలో తమకు అందించాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

## ప్రియాంకా గాంధీ భద్రతా వ్యవస్థలో లోపం!



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఇంట్లోకి కొందరు ఆగంతకులు చొరబడి సెల్ఫీలు తీసుకుంటామని కోరడం చర్చనీయాంశమైంది. ఇటీవల ప్రియాంకతోపాటు గాంధీ కుటుంబానికి ఎస్పీజీ రక్షణ వ్యవస్థను తొలగించి జెడ్ ప్లస్ భద్రత కల్పించడం తెల్సిందే. సీఆర్‌పీఎఫ్‌తో కూడిన జెడ్ ప్లస్ కేటగిరి భద్రతలో నేతల ఇళ్లతోపాటు ప్రయాణాల్లోనూ కమాండోలు తోడు ఉంటారు. ఢిల్లీలోని లోధీ ఎస్టేట్‌లో నవంబరు 26న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనుమతి లేకుండా ఓ వాహనం లోపలికి వచ్చిందని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి. వాహనంలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులతోపాటు ఒక పసిబిడ్డ ఉన్నారని తెలుస్తోంది. సంఘటన జరిగిన సమయంలో ప్రియాంక ఓ సమావేశంలో ఉండగా.. వీరంతా లోపలికొచ్చారు. అభిమానులమని మిమ్మల్ని కలవాలని వచ్చినట్లు చెప్పారు. భద్రత వ్యవస్థలో ఏర్పడ్డ ఈ లోపానికి సంబంధించి ప్రియాంక కార్యాలయం సీఆర్‌పీఎఫ్ దృష్టికి తీసుకువచ్చింది. అయితే ఇంటి లోపలికి వచ్చే దారి కాపలా బాధ్యత ఢిల్లీ పోలీసులదని సీఆర్‌పీఎఫ్ తెలపగా.. తగిన అనుమతి వచ్చిన తరువాతే తాము గేట్లు తెరిచినట్లు ఢిల్లీ పోలీసులు చెప్పడం కొసమెరుపు!

# ..అందుకే ఫడ్నవీస్‌ను సీఎం చేశాం!

- రూ. 40వేల కోట్ల నిధులు కాపాడేందుకేనంటూ బీజేపీ నేత అనంత్ కుమార్ హెగ్డే వ్యాఖ్య



అనంతకుమార్ హెగ్డే



దేవేంద్ర ఫడ్నవీస్

**బెంగళూరు:** 'రూ. 40 వేల కోట్ల నిధులను కాపాడేందుకే మహారాష్ట్రలో హుటాహుటిన ఫడ్నవీస్‌ను సీఎం చేశాం' అంటూ బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలు దుమారం లేపుతున్నాయి. ఆ వ్యాఖ్యలను ఫడ్నవీస్ ఖండించారు. హెగ్డే వ్యాఖ్యల్లో వాస్తవం ఉంటే ప్రధాని నరేంద్రమోదీ తక్షణమే రాజీనామా చేయాలని ఎన్సీపీ, ఇది మహారాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనని శివసేన మండిపడ్డాయి. కర్ణాటక ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా.. శనివారం అనంత్ కుమార్ హెగ్డే పై వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీకి మెజారిటీ లేకపోయినా, మహారాష్ట్రలో ఫడ్నవీస్‌ను ఎందుకు సీఎం చేశారన్న ప్రశ్న చాలా మంది అడుగుతున్నారు. అదంతా ముందుగా అనుకున్న ప్రణాళికే. మహారాష్ట్రలో సీఎం నియంత్రణలో రూ. 40 వేల కోట్లు ఉన్నాయి. శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీ కూటమి వ్యక్తి ముఖ్యమంత్రి అయితే ఆ నిధులు దుర్వినియోగమవుతాయి. ఆ నిధులను కాపాడటం కోసమే హుటాహుటిన ఫడ్నవీస్‌ను సీఎం చేశాం.. వాటిని అభివృద్ధి పనులకు కేటాయించడం కోసమే ఆ డ్రామా ఆడాం. ఫడ్నవీస్ సీఎం అయిన 15 గంటల్లోనే ఆ నిధులను ఎక్కడికి పంపాలో అక్కడికి పంపి, వాటిని కాపాడారు. ఆ నిధులను కేంద్రానికి తిరిగి పంపించనట్లయితే.. అవి శివసేన కూటమి సీఎం చేతిలో పడితే ఏం జరుగుతుందో మీకు తెలుసు' అంటూ హెగ్డే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్సీపీ శాసనసభా పక్ష నేత అజిత్ పవార్ మద్దతుతో నవంబర్ 23న ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కావడం, ఆ తరువాత మెజారిటీ నిరూపించుకోలేని పరిస్థితుల్లో 80 గంటల్లోపే రాజీనామా చేయడం తెలిసిందే.

**అదంతా అబద్ధం: ఫడ్నవీస్**

హెగ్డే వ్యాఖ్యలను మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అబద్ధాలంటూ ఖండించారు. తాను సీఎంగా ఉన్న ఆ మూడు రోజుల్లో ఎలాంటి నిధుల గురించి కేంద్రం అడగలేదని, తాము కూడా కేంద్రానికి నిధులను పంపించలేదని సోమవారం స్పష్టం చేశారు. 'బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ కంపెనీ చేపట్టింది. వారికి భూ సేకరణ కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కేంద్రం మమ్మల్ని నిధులు అడగలేదు. మేం పంపించలేదు. ఏ ప్రాజెక్టు నుంచి కూడా మహారాష్ట్రకు చెందిన ఒక్క రూపాయిని కూడా కేంద్రానికి పంపించలేదు' అని ఫడ్నవీస్ వివరణ ఇచ్చారు.

## మోదీ ఆఫర్ ఇచ్చారు.. నేనే వద్దన్నా!



**ముంబై:** ప్రధాని మోదీ కలిసి పనిచేద్దామంటూ ఇచ్చిన ఆహ్వానాన్ని తానే తిరస్కరించానని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ తెలిపారు. రాష్ట్రపతి పదవిని తనకు ప్రధాని ఇవ్వజూపారన్న వార్తలను పవార్ కొట్టిపారేశారు. ఓ మరాఠా టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన. గత నెలలో ప్రధాని మోదీతో భేటీ, అనంతర రాజకీయ పరిణామాలకు సంబంధించి పలు విషయాలు వెల్లడించారు. 'కలిసి పనిచేద్దామంటూ మోదీ నన్ను అడిగారు. మన మధ్య వ్యక్తిగత సంబంధాలు చాలా బాగున్నాయి. వాటిని అలాగే కొనసాగనివ్వండి. కానీ, కలిసి పనిచేయడం మాత్రం కుదరదు అని ప్రధానికి తెలిపా'నన్నారు. ఆ భేటీలో తనకు రాష్ట్రపతి పదవి ఇవ్వజూపారంటూ వచ్చిన వార్తలపై ఆయన స్పందిస్తూ..'అలాంటిదేమీ లేదు. కానీ, నా కుమార్తె సుప్రియా సూలేకు కేబినెట్‌లో చోటు కల్పిస్తామని చెప్పారు'అని పవార్ వివరించారు. దేవేంద్ర ఫడ్నవీస్‌తో అనూహ్యంగా చేతులు కలిపినందుకే అజిత్ పవార్‌కు ఉద్ధవ్ ఠాక్రే కేబినెట్‌లో స్థానం కల్పించలేదన్నారు. 'అజిత్ ప్లేటు ఫిరాయించిన విషయం తెలియగానే మొట్టమొదటగా ఉద్ధవ్ ఠాక్రేకు ఫోన్ చేశా. అజిత్ అలా చేసి ఉండకూడదు.. నాపై నమ్మకముంచండి.. ఆ తిరుగుబాటును అణిచివేస్తానని ఠాక్రేకు తెలిపా'అని చెప్పారు. 'అజిత్‌కు ఎన్సీపీ మద్దతు లేదని తెలియగానే అతడి వెంట ఉన్న ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెరిగిపోయింది. అందుకే వెంటనే వచ్చేశారు'అని వివరించారు. 'ఫడ్నవీస్ పక్షంను వీడి రావాలంటూ నా కుటుంబ సభ్యులు ఎవరైనా అజిత్‌ను కోరిన విషయం నాకు తెలియదు. కానీ, అజిత్ చేసింది తప్పని అంతా భావించారు' అని తెలిపారు. 'నువ్వు క్షమించరాని పని చేశావు. దీనికి ఫలితం ఎవరైనా సరే అనుభవించాల్సిందే. నువ్వు అందుకు మినహాయింపు కాదు'అని అజిత్‌కు చెప్పానన్నారు.



## నేవీలో మొదటి మహిళా పైలట్

**కొచ్చి:** భారత నావికాదళానికి చెందిన సబ్–లెఫ్టినెంట్ శివాంగీ నావికా దళ పైలట్ అయిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. సోమవారం నావికాదళ ఉన్నతాధికారుల సమక్షంలో ఆమె పైలట్‌గా విధుల్లో చేరారు. ఇక్కడ శివాంగీతో పాటు 7వ డోర్నియర్ కన్వర్షన్ కోర్సుకు చెందిన మరో ఇద్దరు అధికారులు కూడా డోర్నియర్ పైలట్లుగా క్వాలిఫై అయినట్లు రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. దీనిపై శివాంగీ స్పందిస్తూ తొలి మహిళా పైలట్‌గా నిలిచినందుకు గర్వంగా ఉందని, ఇదో కొత్త అనుభూతి అని పేర్కొన్నారు. దీనికోసమే ఎంతోకాలంగా ఎదురు చూసినట్లు తెలిపారు.

## అధిర్ వ్యాఖ్యలపై రభస
### మోదీ, షాలను చొరబాటుదారులనడంపై బీజేపీ ఆగ్రహం



లోక్‌సభలో మాట్లాడుతున్న అధిర్ రంజన్

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలను చొరబాటుదారులంటూ కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌధురి చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ స్తంభించింది. ఇలాంటి వాఖ్యలను సహించబోమని, అధిర్ వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది. 'కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ చొరబాటుదారు. అందుకే ఆ పార్టీకి ఇతరులు కూడా చొరబాటుదారులు మాదిరిగానే కనిపిస్తున్నారు'అంటూ మండిపడింది. అధిర్ వ్యాఖ్యలపై సోమవారం లోక్‌సభలో అధికార ప్రతిపక్షం మధ్య వాదోపవాదాలు జరిగాయి. ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడేందుకు అధిర్ ప్రయత్నించగా చొరబాటుదారు అంటూ బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. 'అవును. నేను చొరబాటుదారునే. మోదీ, అమిత్ షా, ఎల్‌కే అద్వాణీ కూడా చొరబాటుదారులే'అంటూ అధిర్ బదులిచ్చారు. దీనిపై బీజేపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధిర్ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. క్షమాపణ చెప్పేందుకు సిద్ధమేనని తెలిపినా బీజేపీ సభ్యులు శాంతించకపోవడంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు. సోమవారం రాజ్యసభ సమావేశమైన వెంటనే బీజేపీ సభ్యుడు భూపేందర్ యాదవ్ అధిర్ వ్యాఖ్యలను ప్రస్తావించారు. 'ప్రధాని, హోం మంత్రిపై చొరబాటుదారులు వంటి మాటలను వాడే హక్కు ఏ పార్టీ నేతకైనా ఉందా? ఇది దేశ పార్లమెంటరీ ప్రజాసామ్యాన్ని కించపరచడం కాదా?'అని అన్నారు. అధిర్ వ్యాఖ్యలను సభ ఖండించాలని కోరారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు.



కేరళకు చెందిన 21 ఏళ్ల దివ్యాంగ చిత్రకారుడు ప్రణవ్ తాను గీసిన పెయింటింగ్‌ను చెన్నైలో సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఇచ్చి, ఆయనతో సెల్ఫీ దిగుతున్న దృశ్యాలు

## 2024 కల్లా వెళ్లగొడతాం: అమిత్‌షా

**చక్రధర్‌పూర్/బహారాగోరా:** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) ప్రక్రియ పూర్తికి 2024ను డెడ్‌లైన్‌గా పెట్టుకున్నామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పారు. దేశంలో అక్రమంగా నివసిస్తున్న చొరబాటుదారులను గుర్తించి.. వారిని 2024లోపు దేశం నుంచి బయటకు పంపేస్తామన్నారు. జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చక్రధర్‌పూర్, బహారాగోరాలో సోమవారం నిర్వహించిన ర్యాలీలలో అమిత్ మాట్లాడారు.

## ఇబ్బందిపడే మహిళలకు ఉచిత ప్రయాణం

**ఛండీగఢ్:** మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నిర్మూలించడానికి పంజాబ్‌లోని లూథియానా పోలీసులు కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో క్యాబ్ దొరక్క ఇబ్బందులు పడుతున్న మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని నిర్ణయించారు. పోలీస్ వాహనం ఉచితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతుందని పోలీస్ కమిషనర్ రాకేశ్ తెలిపారు. ఇందుకోసం మహిళలు పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 1091కు గానీ, 7837018555 నెంబర్‌కు ఫోన్‌చేసి సహాయం కోరవచ్చని పేర్కొన్నారు. ఈ సౌకర్యం ఏడాది పొడవునా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈమేరకు ఆపదలో ఉన్న మహిళల రక్షణకు పోలీసులు 'శక్తి' అనే యాప్‌ను ప్రారంభించినట్లు చెప్పారు.

## 'దిశ'పై సందేశం... ఒంటరిగా 3,200 కి.మీ.

**జోధ్‌పూర్:** హైదరాబాద్‌లో 'దిశ' ఉదంతంపై ఉదయ్‌పూర్‌కు చెందిన 28 ఏళ్ల నీతూ చోప్రా స్పందించారు. హత్యాచార ఘటనలను కారణంగా చూపించి, మహిళలను ఇంటికే పరిమితం చేయడం సరికాదని ఈ రాజస్తాన్ యువతి అంటోంది. మహిళలకు ధైర్యాన్నిస్తూ రాజస్తాన్‌లోని బలోత్రా నుంచి కన్యాకుమారికి 3,200 కిలోమీటర్లు ఆమె ఒంటరిగా స్కూటర్ ప్రయాణం చేయనున్నారు. ఇందుకోసం జైపూర్‌లో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌ను కలవనున్నట్లు ఆమె చెప్పారు. ఆదివారం జోధ్‌పూర్‌లో కేబినెట్ మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిసి తన మిషన్ గురించి తెలియజేశారు. తనను తాను సైనికురాలిగా భావిస్తున్నానని, ఒంటరిగా ప్రయాణించడానికి భయపడనని అన్నారు.

## 'అయోధ్య'పై రివ్యూ పిటిషన్

**న్యూఢిల్లీ:** అయోధ్యలో రామ జన్మభూమి- బాబ్రీమసీదు వివాదాస్పద స్థలానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలైంది. తీర్పులో కొన్ని తప్పులున్నాయని, వాటిని సవరించాలని కోరుతూ సోమవారం మౌలానా సయ్యద్ అషాద్ రషీది, జామియత్ ఉలేమా ఇ హింద్ ఉత్తరప్రదేశ్ శాఖ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. సయ్యద్ రషీది తొలి పిటిషన్‌దారు ఎం సిద్ధిఖీకి చట్టబద్ధ వారసుడు. 'ఆ స్థలంలో బాబ్రీ మసీదును నిర్మించాలని తీర్పునివ్వడం ద్వారానే నిజమైన న్యాయం జరిగినట్లవుతుంది' అని 93 పేజీల ఆ రివ్యూ పిటిషన్‌లో పేర్కొన్నారు. 2.77 ఎకరాల వివాదాస్పద స్థలంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన ట్రస్ట్ ఆధ్వర్యంలో రామాలయ నిర్మాణం జరగాలని, ప్రతిగా, ముస్లింల తరఫున సున్నీ వక్ఫ్ బోర్డుకు అయోధ్యలోని ప్రముఖ ప్రాంతంలో మసీదు నిర్మాణం కోసం 5 ఎకరాల స్థలం కేటాయించాలని జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం నవంబర్ 9న సంచలన తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.

## ఎస్సీ/ఎస్టీ క్రీమీలేయర్ అంశాన్ని సమీక్షించండి

**న్యూఢిల్లీ:** షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ)లోని సంపన్న శ్రేణి(క్రీమీ లేయర్)కి రిజర్వేషన్ కోటాలో భాగం ఇవ్వకూడదంటూ గతంలో ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కేంద్రం సోమవారం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. సమీక్షించే బాధ్యతను ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించాలని ప్రభుత్వం కోరింది. తీర్పు ఎస్సీ/ఎస్టీలకు వర్తించదని, ఈ తీర్పును సమీక్షించాలని, ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించాలని అటార్నీ జనరల్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేయగా సీజేఐ జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్‌ల బెంచ్ దాన్ని పరిగణనలోకి తీసుకుంది. క్రీమీలేయర్‌కు రిజర్వేషన్ కోటా దక్కరాదన్న సూత్రం ఎస్సీ/ఎస్టీ వర్గాలకు వర్తించదని అటార్నీ జనరల్ పేర్కొన్నారు. 'ఇది ఉద్వేగాలతో కూడుకున్న అంశం. విస్తృత ధర్మాసనానికి నివేదించాలి' అని ఆయన స్పష్టం చేశారు. అయితే సమతా ఆందోళన్ సమితి తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ వినతిని గట్టిగా వ్యతిరేకించారు.

## 'రియల్' సంస్థలో 3 వేల కోట్ల బ్లాక్‌మనీ

**న్యూఢిల్లీ:** రూ.3 వేల కోట్ల మేరకు వెల్లడించని ఆదాయం తమ వద్ద ఉందంటూ దేశ రాజధాని కేంద్రంగా పనిచేసే ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అంగీకరించిందని ఆదాయ పన్ను(ఐటీ) శాఖ వెల్లడించింది. ఇటీవల దాడులు జరిపిన సందర్భంగా సదరు సంస్థ రూ.3 వేల కోట్ల ఆదాయం వివరాలు వెల్లడించలేదని, ఆ ఆదాయానికి పన్ను చెల్లించేందుకు ఒప్పుకుందని ఐటీ శాఖ తెలిపింది. సంబంధిత సంస్థ పేరును వెల్లడించనప్పటికీ అది ఢిల్లీలోని ఓరియంటల్ ఇండియా గ్రూప్ కంపెనీ అయి ఉంటుందని అధికార వర్గాలు అంటున్నాయి.

## నలుగురిలో ఒకరికి స్మార్ట్‌ఫోన్ వ్యసనం!

**లండన్:** ప్రపంచంలో ప్రతి నలుగురు యువతీయువకుల్లో ఒక్కరు స్మార్ట్‌ఫోన్ వ్యసనానికి అలవాటు పడ్డారని లండన్‌లోని కింగ్స్ కాలేజీ శాస్త్రవేత్తలు జరిపిన తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. స్మార్ట్‌ఫోన్ అందుబాటులో లేకపోతే వీరు ఆందోళనకు గురవుతున్నారని, నిరుత్సాహానికి గురవుతున్నారని వీరు అంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు విస్తృత వ్యాప్తిలోకి వచ్చిన 2011 సంవత్సరం నుంచి జరిగిన వేర్వేరు అధ్యయనాలు పిల్లలు, యువతీయువకుల్లో 10 – 30 శాతం మంది వీటిని తగువిధంగా వాడటం లేదని ఇప్పటికే ఒక విశ్లేషణ ఉంది. ఇదే లెక్కన చూస్తే వీరిలో సగటున 23 శాతం మంది సమస్యాత్మక స్మార్ట్‌ఫోన్ వినియోగం చేస్తున్నారని శాస్త్రవేత్తలు గుర్తించారు.

# నిద్ర నుంచే అనంత లోకాలకు..



గోడ కూలిన చోటులో శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

## తమిళనాడులో కూలిన గోడ, 17 మంది మృతి

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** అందరిలాగే వారు కూడా రాత్రి ప్రశాంతంగా పడుకున్నారు. కానీ మూసిన కళ్లు తెరవక ముందే వారి జీవితాలు ముగిసిపోయాయి. ఏం జరిగిందో గుర్తించేలోపే ప్రమాదం ముంచుకు రావడంతో పడుకున్న స్థితిలోనే అనంతలోకాలకు చేరుకున్నారు. తెల్లవారుజామున ప్రశాంతంగా నిద్రిస్తున్న రెండు కుటుంబాల్లోని 17 మందిని మృత్యుదేవత తడిసిన గోడ రూపంలో కబళించిన ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఈ ఘటన కారణంగా మరణించిన వారిలో పది మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం సమీపం నడూరు కన్నప్పన్ లే–అవుట్‌లో ఓ వస్త్ర వ్యాపారి ఇంటి సమీపంలో 50 మందికి పైగా పేద రైతులు, కార్మికులు గుడిసెలు, పెంకుటిళ్లు వేసుకుని నివసిస్తున్నారు. ఈ ఇళ్లకు ఆనుకునే ఉన్న వస్త్రవ్యాపారి ఇంటికి 30 అడుగుల పొడవు, 25 అడుగుల ఎత్తులో బండరాళ్లతో నిర్మించిన ప్రహరీగోడ ఉంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షం ధాటికి.. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మూడు పెంకుటిళ్లపై కూలింది. రెండు కుటుంబాలకు చెందిన సభ్యులు శిథిలాల్లో చిక్కుకున్నారు. మేట్టుపాళయం పోలీసులు, అగ్నిమాపక దళాలు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మొత్తం 17 మంది నిద్రిస్తున్న దశలోనే ప్రాణాలు విడిచారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కోయంబత్తూరు కలెక్టర్ రాజామణి బాధితులను పరామర్శించి మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి మంగళవారం మేట్టుపాళయంకు వెళ్లనున్నారు.

## రైల్వేల పనితీరు దారుణం

**న్యూఢిల్లీ:** రైల్వే శాఖ పనితీరును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తప్పుబట్టింది. 2017–18 సంవత్సరంలో రైల్వేల నిర్వహణ రేషియో 98.44 శాతం అంతకుముందు పదేళ్ల కంటే అధ్వానంగా ఉందని పేర్కొంది. ఈమేరకు సోమవారం పార్లమెంట్‌కు ఓ నివేదికను సమర్పించింది. రైల్వే శాఖ ఆదాయ, వ్యయాల రేషియోను బట్టి నిర్వహణలో సమర్థత, ఆర్థిక బాగోగులను అంచనా వేస్తారు. 'ఎన్టీపీసీ, ఇర్కాన్ సంస్థల నుంచి అడ్వాన్సులు అందడంతో 2017–18 సంవత్సరాల కాలంలో రూ.1665.61 కోట్ల మిగులుంది. అదే లేకుంటే రూ.5,676.29 కోట్లు లోటు మిగిలేది. ఆ శాఖ ప్రతి రూ.100 ఆదాయంలో రూ.98.44 ఖర్చు పెట్టింది. ఈ రేషియో గత పదేళ్ల కంటే అధ్వానం. అడ్వాన్సులను మినహాయిస్తే నిర్వహణ రేషియో 102.66కు పెరిగి ఉండేది'అని పేర్కొంది. 'ప్రయాణికులు, కోచ్ సర్వీసుల నిర్వహణ వ్యయాలను కూడా రైల్వేలు నియంత్రించుకోలేదు'అని తెలిపింది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

Urgently Required for AL JALHAMI COMPANY-DAMMAM Client Interview 09th Dec'19
HIGH SALARY, LARGE POSTS, FREE FOOD+FREE Acc., 8Hours Duty + OT
- MECHANICAL ENGINEER
- QA / QC ENGINEER MECHANICAL
- INSTRUMENTATION ENGINEER
- ELECTRICAL ENGINEER
- INSTRUMENTATION TECHNICIAN
- MECHANICAL TECHNICIAN
- ELECTRICAL FOREMAN
- ELECTRICAL TECHNICIAN
- BLASTER PAINTER
- CRANE OPERATOR
- RIGGER LEVEL 1-2

SALARY NEGOTIABLE
VENUE: ALFA TECHNICAL SERVICES (GULF JOBS | GULF STUDY'S) Nr.Navata Transport, High School Road, Gajuwaka, Visakhapatnam-530012
E-mail: alfatechservices22@gmail.com, Ph: 7799747680, 7799747682
M/S FALCON INTERNATIONAL, LIC. No.: B-0984/DEL/PER/1000+/5/3255/92, ARN : PT6430183

సాక్షి
మంగళవారం, డిసెంబర్, 3

# భారీ చార్జీల బాదుడు

టెలికాం సంస్థల మధ్య కొన్నేళ్లుగా హోరాహోరీగా సాగుతున్న టారిఫ్‌ల పోరు చల్లారింది. అవన్నీ ఏకమై ఇప్పుడు వినియోగదారుల పనిపట్టడానికి సిద్ధమయ్యాయి. వోడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ సంస్థలు కాల్, డేటా చార్జీలను సోమవారం అర్ధరాత్రి నుంచి దాదాపు 50 శాతం పెంచబోతున్నట్టు ఆదివారం ప్రకటించాయి. రిలయన్స్ జియో మరో మూడు రోజులు గడిచాక కొత్త రేట్లు అమలు చేస్తానంటూనే ఈ పెరుగుదల 40 శాతంవరకూ ఉండొచ్చునని తెలిపింది. 4జీ ఇప్పటికే పాతబడి 5జీ ఎప్పుడెప్పుడా అని వినియోగదారులంతా ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఈలోగా ఊహించని రీతిలో వారికి ఈ ధరల షాక్ తగిలింది. ధరల బాదుడు విషయంలో ఇప్పటికే టెలికాం కంపెనీలు ఓదార్పు వచనాలు పలుకుతున్నాయి. ఈ పెరుగుదల వారంరోజులపాటు టీ కోసం పెట్టే ఖర్చంత కూడా ఉండదని నచ్చజెబుతున్నాయి. మార్కెట్‌లో రకరకాల కంపెనీలొచ్చాక స్మార్ట్ ఫోన్‌లు చవగ్గా లభించడం, కాల్ చార్జీలు, డేటా చార్జీలు అందుబాటులోకి రావడం, ఉచిత కాల్స్ లభ్యత తదితరాలన్నీ వినియోగదారుల సంఖ్యను అమాంతం పెంచేశాయి. ముఖ్యంగా 2016లో రిలయన్స్ జియో దూకుడుగా రంగ ప్రవేశం చేయడం ఆ రంగంలో అప్పటికే ఉన్న సంస్థలన్నిటినీ వణికించింది. అపరిమిత వాయిస్ కాల్స్, డేటా టారిఫ్ అత్యంత చవగ్గా ఉండటంతో ఇతర సంస్థలు కూడా ఆ తోవన వెళ్లక తప్పలేదు. ఒకసారంటూ వినియోగదారులను కోల్పోతే మళ్లీ పెంచుకోవడం అసాధ్యమని ఆ సంస్థలు ఆందోళన పడ్డాయి. అప్పటినుంచే పోటాపోటీగా టారిఫ్‌ల తగ్గింపు, వాయిస్ కాల్స్, డేటా వినియోగం వంటివాటిపై పరిమితి పెంపు మొదలయ్యాయి. కేంద్రానికి వివిధ టెలికాం సంస్థలు చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులు, స్పెక్ట్రం వినియోగ చార్జీల బకాయిల విషయంలో ఈమధ్య సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అసలే టారిఫ్ పోటీతో నష్టాలు మూటగట్టుకుంటున్న సంస్థల్ని మరింత కుంగదీశాయి. ఆ సంస్థలన్నీ చెల్లించాల్సిన బకాయిలు లక్షా నాలుగువేల కోట్లని లెక్కతేలింది. మొన్న సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికానికి వోడాఫోన్ ఐడియా రూ. 50,921 కోట్లు, ఎయిర్‌టెల్ 23,045 కోట్లు నష్టాలు ప్రకటించాయి.

ఆర్థిక మాంద్యం పర్యవసానంగా ఉపాధి లేమి, నిరుద్యోగితవంటివి పెరిగి, అందరినీ భయపెడుతున్న వర్తమానంలో ఫోన్ చార్జీలే కాస్త చవగ్గా ఉన్నాయి. ఎవరికి వారు కావలసినప్పుడు, కావలసినంతసేపు మాట్లాడుకోవడానికి వీలుండేది. కాస్త ఖాళీ దొరికిందంటే వాట్సాప్, ఫేస్‌బుక్ వగైరా సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫొటోలు, వీడియోలు వీక్షించడానికి, పంపడానికి, ఛాటింగ్‌కు అందరూ తహతహలాడేవారు. ఈ మాధ్యమాలు భావ వ్యక్తీకరణ విస్తృతిని పెంచి కోట్లాది మందికి గొంతునివ్వడంతోపాటు ఎందరో ఎదగడానికి తోడ్పడుతున్నాయి. చవగ్గా మొబైల్, కాల్ డేటా లభించడం వల్లనే ఇదంతా సాధ్యమైంది. కానీ అన్నింటిలో మంచీ చెడు ఉన్నట్టే ఇందులోనూ ఉన్నాయి. ఫోన్ ఒక సామాజిక రుగ్మతగా మారుతోందని, స్థలకాలాదులు కూడా చూసుకోకుండా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ దానికి అతుక్కుపోతున్నారని... కుటుంబ బాంధవ్యాలపై కూడా దీని దుష్ప్రభావం పడుతున్నదని సామాజిక శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలకరింపులన్నీ గుడ్ మార్నింగ్‌లకూ, గుడ్‌నైట్‌లకూ పరిమితమయ్యాయి. స్వప్రయోజనపరులు, అసాంఘిక శక్తులు ఈ పరిస్థితిని చక్కగా వినియోగించుకుని వదంతులు వ్యాప్తి చేయడం, తప్పుడు సమాచారం ప్రచారంలో పెట్టడం, మార్ఫింగ్‌లు చేయడం ఎక్కువైంది. ఇప్పుడు పెరిగిన టారిఫ్‌లు అలాంటివారందరికీ కళ్లెం వేస్తాయి. కాకపోతే ఈ చెడుతో పాటు మంచిని కూడా కత్తిరిస్తాయి.

యూపీఏ హయాంలో ఒకసారి ఎయిర్‌టెల్ , ఐడియా సంస్థలు చార్జీలు పెంచినప్పుడు కేంద్ర ప్రభుత్వంలో అప్పుడు టెలికాం మంత్రిగా ఉన్న కపిల్ సిబల్ ఇది సరికాదని హితవు చెప్పారు. టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్‌తో మాట్లాడి ధరల పెంపు విషయంలో ఏదో ఒకటి చేయమని కోరతామని ప్రభుత్వం తెలిపింది. రోజులు మారాయి. ఇప్పుడలాంటి పరిస్థితి లేదు. ప్రపంచం మొత్తం మీద మన దేశంలో మాత్రమే కాల్, డేటా చార్జీలు తక్కువని విశ్లేషకులు చెబుతున్నారు. పైగా టారిఫ్‌ల పెంపుదలకు ఇది ఆరంభం మాత్రమేనని, ముున్ముందు కూడా ఇలాంటి షాకులుంటాయంటున్నారు. ఇది నిజమే కావొచ్చు. కానీ అత్యంత చవకైన చార్జీలతో ఆకర్షించి, కోట్లాదిమంది వినియోగదారుల్ని పెంచుకుంటూపోయి తీరా అందరూ అలవాటు పడ్డాక అదును చూసి భారీ టారిఫ్‌లతో మొత్తడం వ్యాపార సంస్థలకు కొత్తగా అబ్బిన విద్య కాదు. టారిఫ్ పెంపును వారం రోజులకయ్యే టీ ఖర్చుతో ఒక కంపెనీ ప్రతినిధి పోల్చారు. తాను ఏ ఉద్దేశంతో అన్నప్పటికీ ఒక విధంగా అది సరైన పోలికే. ఎందుకంటే మన దేశంలో ఇప్పుడు విపరీతంగా పెరిగిన టీ అలవాటుకు మూలం కూడా ఈ వ్యాపార సూత్రంలోనే ఉంది. ఈస్టిండియా కంపెనీ వ్యాపారులు మొదట దాన్ని ఉచితంగా ఇచ్చి అలవాటు చేసి ఆ తర్వాత దానికొక మార్కెట్‌ను సృష్టించు కోగలిగారు.

దేశంలో వందకోట్ల మొబైల్ ఫోన్లు వినియోగంలో ఉన్నాయని ఒక అంచనా. ఇకపై వీరంతా అదనంగా సగటున 50 శాతం వరకూ చెల్లించకతప్పదు. మొబైల్ కనెక్షన్‌కు ఆమధ్య తప్పనిసరి చేసిన కనీస నెల చార్జి కూడా రూ. 35 నుంచి రూ. 49కి పెరిగింది. ఇతర నెట్‌వర్క్‌లకు చేసే కాల్స్‌పై కొంత పరిమితి దాటాక నిమిషానికి 6 పైసలు చెల్లించాల్సివస్తుంది. తాజా నిర్ణయంతో వినియోగదారులు జారిపోకుండా ఉండటానికి వివిధ సంస్థలు రకరకాల పథకాలతో సిద్ధమవుతున్నాయి. ఏ పేరు పెట్టుకున్నా, ఎన్ని వెసులుబాట్లు కల్పిస్తామంటున్నా దాదాపు గత మూడేళ్లుగా వినియోగదారులకు దొరికిన స్థాయిలో అవేమీ ఉండవు. స్వర్ణయుగం అనదగ్గ ఆ దశ దాటిపోయింది. అయితే వెనక్కి వెళ్లలేనంతగా వినియోగదారులంతా అలవాటు పడిపోయారు గనుక వారి సంఖ్య తగ్గదని, త్వరలోనే అంతా సర్దుకుంటుందని పలువురు నిపుణులు వేస్తున్న అంచనాలు ఏమేరకు సరైనవో చూడాల్సి ఉంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి శు.సప్తమి రా.10.50 వరకు తదుపరి అష్టమి, నక్షత్రం ధనిష్ఠ ప.2.54 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం రా.10.44 నుంచి 12.31 వరకు, దుర్ముహూర్తం ఉ.8.29 నుంచి 9.13 వరకు, తదుపరి రా.10.30 నుంచి 11.22 వరకు, అమృతఘడియలు... లేవు.

**సూర్యోదయం :** 6.18
**సూర్యాస్తమయం:** 5.20
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# వ్యవస్థ 'దిశ' దశ మార్చగల స్త్రీ..!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**దేశంలో మహిళలపై, చిన్నారులపై అనునిత్యం జరుగుతున్న అత్యాచారాలు కర్ణకఠోర సత్యాలుగా మారి మనల్ని వేధిస్తున్నాయి. అత్యాచార ఘటనలను ప్రసారం చేయడంలో మన మీడియా భావోద్వేగంతో కూడిన శీర్షికలతోనే సరిపెట్టుకుంటోంది తప్ప, ఈ అకృత్యాలకు వ్యవస్థాగతమైన పునాది ఎక్కడ ఉందో వివరించడంలో వెనుకాడుతోంది. మహిళను నిస్సహాయ స్థితి నుంచి బయటపడవేసి, సర్వ శక్తిమంతురాలైన చైతన్యమూర్తిగా తీర్చిదిద్దగలగడమే శాశ్వత పరిష్కారమన్న భావనను మీడియా పెంచగలగాలి. ఈ వ్యవస్థ దిశనూ, దశనూ సమూలంగా మార్చివేయగల ఆ పరిణామంవైపునకు సమాజం అడుగులు వేయడమే తదుపరి ఘట్టం కావాలని ఆశిద్దాం. 'భారతదేశంలో దోపిడీ వ్యవస్థ కొనసాగినంత కాలం సంపన్న స్త్రీ కూడా దళితురాలేన'ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పింది అక్షర సత్యం.**

నేనీ మధ్య ఓ హాస్యాస్పదమైన మాట విన్నాను. స్త్రీ–పురుషుల మధ్య వివక్ష లేని సమానత వెలుగు చూడడానికి మరో 250 సంవత్సరాలు మనం కళ్లు కాయలు కాచేలా ఎదురు తెన్నులు చూడవలసి వచ్చేలా ఉంది అని. నిజానికి ఇది ఓ వ్యంగ్యపూరితమైన చరుపు! వస్తుతహ ప్రజలు చెడ్డవారు కారు. వారు మరోలా మారడానికి కారణం వారి చుట్టూ ఉన్న సమాజ పరిస్థితులు. ఆ పరిస్థితుల్ని సమూలంగా మార్చడమే సర్వత్రా మన నిరంతర ఎజెండాగా ఉండాలి.

*– కేన్స్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవ సభలో ప్రసిద్ధ ఫ్రెంచ్ నటి ఇసాబెల్లి హ్యూపెర్ట్*

సమాజంలో మానవ లంపటత్వానికి, లైంగికపరమైన హింసకు కారణమైన సంక్లిష్టమైన సాంఘిక సమస్యలను పరిష్కరించడానికి కఠిన తరమైన శిక్షలు విధించడం, మరణశిక్ష విధించడం ఒక్కటే మార్గంగా చూడకూడదు. ఇందుకు క్రిమినల్ (నేర) చట్టం ఒక్కటే చాలదు. ప్రతి మహిళ నేను సహితం (మీ టూ) అంటూ స్వీయరక్షణార్థం తెగించి ప్రతిఘటనా శక్తిగా ముందుకు దూకాలి.

*– ప్రభా కోటేశ్వరన్, లా అండ్ సోషల్ జస్టిస్ ప్రొఫెసర్, లండన్. ఢిల్లీలో 'క్రిమినల్ లా 39–ఎ సెక్సువల్ వయొలెన్స్' అనే అంశంపై జరిగిన సదస్సులో చేసిన ప్రసంగం*

సామాజిక మాధ్యమాల పేరిట నేడు సోషల్ మీడియా ముమ్మరించినందున ఇప్పుడు భారీ స్థాయిలో సమాజంలో బహుముఖాలుగా జరుగుతున్న హింసాకాండ, అకృత్యాలు, హత్యలు, ఆత్మహత్యలు ప్రజల దృష్టికి, పాలకుల దృష్టికి వచ్చి కళ్లు తెరిపించడానికి ప్రయత్నిస్తున్నాయి, అంతకు ముందు కూడా ఎన్నో అసాంఘిక అకృత్యాలు జరిగినా మాధ్యమాల దృష్టికి ఈ స్థాయిలో వచ్చేవి కాదు. కానీ సమాజంలో జరుగుతున్న అనేక అకృత్యాలు, అవకతవకలు వెల్లడవుతున్నా, కొంతమంది రాజకీయనేతలు, అధికారులు కలిసి నేరగాళ్లతో మిలాఖత్ కావడం వల్ల దేశంలో నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరుగుతోంది. ఈ వాస్తవాన్ని సుమారు ముప్పై ఏళ్ల నాడే కేంద్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి ఓర్రా నిశితంగా ఒక నివేదికలో బహిర్గతం చేశారు. అయినా సరే, అయ్యవారు ఏం చేస్తున్నారంటే చేసిన తప్పులు దిద్దుకుంటున్నారు అన్న సామెతలాగా పాలకులు, నేరగాళ్ల పరిస్థితి తయారైంది. ఇందులో భాగంగానే గాంధీజీ ఎంతగానో మద్యాన్ని (తాగుడును) ప్రోత్సహించడం ద్వారా వచ్చే రెవెన్యూ ఆధారంగా ప్రభుత్వాలు పరిపాలన నిర్వహించడాన్ని వేనోళ్లా నిరసించి, హెచ్చరించినా పలువురు స్వతంత్ర భారత రాష్ట్రాల పాలకులు ఏదో ఒక రూపంలో మద్యపానాన్ని విచ్చలవిడిగా ప్రోత్సహిస్తూనే ఉన్నారు. వెరసి వీటన్నింటి ఫలితమే ఇటీవలి కాలంలో దేశంలోనూ, తెలంగాణా రాష్ట్రంలోనూ పోటెత్తిన స్త్రీల మానభంగాలు, హత్యలు, ఆత్మహత్యలు... ఇందులో భాగమే. పెట్టుబడిదారీ వ్యవస్థ దశనూ, దిశనూ మార్చగల స్త్రీ విమోచన ఉద్యమానికి, తద్వారా వ్యవస్థాగతమైన కుదుపునకూ, ఒక దశలో శ్రీకారం చుట్టాయి. నిర్భయ, అభయల హత్యా ఉదంతాలు. కాగా, ఆతర్వాత కొద్ది కాలంగానూ, నిన్నగాక మొన్న జరిగిన డాక్టర్ దిశ తదితర యువతులపై అత్యాచారాలు, అభంశుభం తెలియని చిన్నారులపైనా గురిపెట్టిన మగమృగాలు ఉదాహరణలు. వినడానికి సైతం మనస్కరించని కర్ణకఠోర సత్యాలుగా మనల్ని వేధిస్తున్నాయి.

రెండో మాట



'ఇన్ని అఘాయిత్యాలు, మన చుట్టూ జరుగుతున్నా మన టీవీలూ, ఇతర మాధ్యమాలూ ఘటనల ప్రసారంలో గానీ, విమర్శలలో, వ్యాఖ్యానాలలో గానీ, ఎంతసేపూ 'మృగాళ్ల అంతు చూద్దాం', ఇంటి నుంచి బయటకు వెళ్తే చాలు మళ్లీ వచ్చేవరకు భయమే, 'మన సంస్కృతి ఆడపిల్లల్ని గౌరవించడం', 'కామాంధుల వికృత చేష్టలకు ఇంకెంతమంది బలికావాలో' అన్న శీర్షికలతోనే సరిపెట్టుకుంటున్నాం. కానీ ఎక్కడా మన మాధ్యమాల ప్రసారాలలో, సమాజంలోని ఈ అకృత్యాలకు పునాది, లేదా పుట్టి పెరిగిన 'పుండు' ఎక్కడ ఉందో వివరించడంలో జంకుతున్నాయి. స్త్రీ అబల కాదు, సబల అని చెప్పుకోవడంలో పురాణ కథలతో, లేదా కట్టు కథలతో సరిపెట్టుకుంటున్నాం. అంతేగానీ–అమృతాన్ని, హాలాహలాన్ని సమానంగా ఇముడ్చుకోగల శక్తి కూడా స్త్రీకి ఉందన్న సత్యాన్ని గుర్తించి, ఆమెను శాశ్వతంగా నిస్సహాయ స్థితి నుంచి, సర్వ శక్తిమంతురాలైన చేతనామూర్తిగా తీర్చగలిగేది పెట్టుబడిదారీ దోపిడీ సమాజ వ్యవస్థను సమూలంగా మార్చడంవల్లనే సాధ్యమూ, శాశ్వత పరిష్కారమూనన్న అవగాహనను వారిలో వ్యాఖ్యాతలు, విశ్లేషకులూ పెంచగలగాలి.

మాధ్యమాలు దోపిడీ వ్యవస్థకు వాహకాలుగా వ్యవహరించకూడదు. దోషాలు సోషలిస్టు వ్యవస్థల్లో మాత్రం ఉండవా అంటే, ఉండవచ్చు గానీ, పెట్టుబడిదారీ వ్యవస్థలో సాగే దోపిడీలో కానవచ్చే నామమాత్రపు 'సుగుణం' దాని నూరు దోషాలలో ఒకటిగా మాత్రమే గణనలోకి వస్తుంది. ఇదీ నిరంతర దోపిడీపై ఆధారపడితేగానీ తన ఉనికిని కాపాడుకోలేని పెట్టుబడి వ్యవస్థకూ, దాని రద్దుపై ఆధారపడిన సమసమాజ వ్యవస్థకూ మధ్య మౌలికమైన వాస్తవ వ్యత్యాసమని ప్రసార మాధ్యమాలకు స్పృహ ఉండాలి. ఈ స్పృహకు స్వార్థ చింతనలేని చైతన్యం అవసరం. బహుశా అందుకనే భారత రాజ్యాంగ అగ్రశ్రేణి నిర్మాత, దళిత వెలుగు దివ్వె డాక్టర్ అంబేడ్కర్ 'భారతదేశంలో దోపిడీ వ్యవస్థ కొనసాగినంత కాలం సంపన్న స్త్రీ కూడా దళితురాలేన'ని స్పష్టం చేశారు. గాంధీజీ 'దేశంలో ఆఖరి నిరుపేద కూడా బానిసత్వం నుంచి, దోపిడీనుంచి విముక్తి అయ్యే దాకా దేశానికి స్వాతంత్ర్యం రానట్టే'నని చాటడంతోపాటు 'అర్ధరాత్రి కూడా స్త్రీ నిర్భయంగా వీధులలో స్వేచ్ఛగా నడిచి వెళ్లగలిగినప్పుడే' దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు భావించాలన్నాడు. ఈ వరసలోని వారే ఫ్రెంచి విప్లవకాలంనాటి బ్రిటిష్ వనిత ఉద్యమ సారథి ఊల్‌స్టోన్‌క్రాఫ్ట్, ఆ తరువాత ఫ్రెంచి మహిళా విమోచనోద్యమ నాయకురాలైన సిమన్ దిబోవెర్, భారతదేశంలో అనీబిసెంట్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, రాజారామ్మోహన్‌రాయ్, వీరేశలింగం, చిలకమర్తి ప్రభృతులు విద్యలో, వివాహంలో, మానవ పురోగతికి చెందిన సకల శాస్త్ర, సాంకేతిక రంగాలలో మహిళల నిరంతర పురోగతిని, ఉన్నతిని ఆశించి అందుకు కృషి చేసిన మహోదయులు.

ఇక ప్రపంచ శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతకర్తలు మార్క్స్–ఎంగెల్స్‌లు... ఫ్యూడల్, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థల్లో పాలక స్థానాల్లో ఉన్నవారు నేరగాళ్లు, బేరగాళ్లతో చేతులు కలిపి తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం క్రిమినల్స్‌పైన, నేరస్థుల ఆధారంగా ఏర్పడే న్యాయవ్యవస్థలూ, న్యాయవాదులు, న్యాయ మూర్తులూ, పోలీసు యంత్రాంగం, దళారీ వ్యవస్థతోపాటు తలారులు, వీరందరి పరస్పర ఆధారంతో వెలువడే తీర్పు సారాంశం– స్థూలంగా అమలులో ఉన్న దోపిడీ వ్యవస్థను ఏదో విధంగా కొనసాగేలా చేదోడువాదోడు కావడమేనని మార్క్స్ 'ధనికవర్గ నాగరికత–నేరాలు' అన్న రచనలో పేర్కొన్నాడు. 150 సంవత్సరాల నాటిదే అయినా, ఎంతటి దార్శనికత.

కాకపోతే ఏమిటి చెప్పండి తానింకా తల్లిగర్భంనుంచి పూర్తిగా లోకంలోకి వచ్చి కళ్లు తెరవనేలేదు/ నా ప్రార్థన మనసులో ఉంచండి/ పశుప్రాయుడైనవాడు/ భగవంతుడన్నేవాడు/ నాకు ఈ ఇరువురి సంపర్కం వదిలించండి/ బయటికి రాబోతున్న నాకు ఇవ్వండి– నాలో గల మానవత్వం ఎవరైతే రేపు అపహరించబోతారో /ఎవరైతే నన్నొక యంత్రంగా మార్చాలని ప్రయత్నిస్తారో/ బజారులో నన్నొక సరుకుగా మొఖానికొక ఖరీదు తగిలించి/ నా ఆస్తిపాస్తుల్ని ఎవరైతే చీల్చాలనీ చూస్తారో/ అటూ ఇటూ బంతిలాగా తంతారో/ ఎవరైతే నన్నొక జీవంలేని శిలను చేసి వేధిస్తారో/ అలాంటివారందరినీ ప్రతిఘటించగల శక్తిని నాకివ్వండి/ ఈ షరతుల మీదనే నన్ను బయటికి రానివ్వండి'! రేపో మాపో, ఈవేళో లోకంలోకి అడుగుపెట్టడానికి ఉవ్విళ్లూరుతూ భీతిభీతిగా ఆక్రోశిస్తున్న శిశు ఘోష, పుట్టిన, పుట్టబోయే బిడ్డల, తల్లులందరి మనస్సుల్లో నిప్పుకణాలుగా మారి 'మేము సహితం' అంటూ నేటి నుంచే ముందడుగై సాగాలి.

నికృష్టపు మన దోపిడీ వ్యవస్థకు, ఆర్థిక, మానసిక, వివక్షాపూరిత దోపిడీ వ్యవస్థలో బందీలైపోయి కునారిల్లుతున్న వివాహిత, అవివాహిత మహిళలందరూ ఒక్కొక్కరూ ఒక– ''అగ్నికాళిగా/ ఒక భద్రకాళిగా/ ఒక మంత్ర కాళిగా/ ఒక నాట్యకాళిగా/ ఓ ఘటనకాళిగా/ ఓ ఉగ్రకాళిగా, ఓ రుద్రకాళిగా మారాలి' అప్పుడే ఆ క్షణమే సామాజిక అజ్ఞాత విదూషకుల ఆత్మహత్యకు ప్రారంభోత్సవమూ జరగాలి. అప్పుడే–పెట్టుబడి దోపిడీపై ఆధారపడిన ఈ వ్యవస్థ దిశనూ, దశనూ మన మహిళా లోకం సత్యభామలై మార్చగలరు. ఆ ముహూర్తంవైపే ఇక అడుగులు పడబోవటమే తరువాయి ఘట్టం కావాలని ఆశిద్దాం!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### నిందితులు



"అత్యాచార నిందితులను బహిరంగంగా కొట్టి చంపాలని జయా బచ్చన్ డిమాండ్ చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ అధికారంలో ఉండగా ముజఫర్ నగర్‌లో ముస్లిం మహిళలపై హిందువులు అత్యాచారాలకు పాల్పడినప్పుడు ఆమె ఒక్క మాటైనా మాట్లాడారా? 2002లో గుజరాత్‌లో ముస్లింలపై హిందూ మూకలు అత్యాచారాలకు పాల్పడినప్పుడు బీజేపీ ప్రభుత్వం మౌనం వహించింది. అంతేకాదు, అసిఫాపై అత్యాచారానికి పాల్పడినవారిని ఆ పార్టీ బహిరంగంగా సమర్థించింది"

– ఇరేనా అక్బర్, కళాకారిణి

### పోర్న్



"2008లో ఆపరేషన్ కమలం ద్వారా కర్ణాటకలో భారతీయ జనతా పార్టీ పగ్గాలు చేపట్టగా, ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో పోర్న్ వీడియోలు చూస్తూ దొరికిపోయారు. 2019లో మళ్లీ బీజేపీ అధికారంలోకి రాగా, ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమ సొంత పోర్న్ వీడియోలు విడుదల చేస్తున్నారు"

– ప్రతాప్, జనతాదళ్–ఎస్ నేత

### ఫండ్



"పన్నుల ద్వారా ప్రజలు చెల్లించిన సొమ్మును ప్రధాని మోదీ ప్రభుత్వం తమ సొంత పార్టీకి వచ్చిన ఫండ్‌గా భావిస్తోంది. రాష్ట్ర స్థాయి నాయకత్వానికి ఆ ఫండ్స్‌పై అదుపు ఉందని భావించినప్పుడు మాత్రమే కేంద్ర నాయకత్వం ఆ మొత్తాన్ని ఖర్చు చేస్తోంది. అందుకే వరదల నివారణకు కేరళ ఏ సహాయం పొందలేకపోవడంలో ఆశ్చర్యం లేదు"

– రవి నాయర్, జర్నలిస్ట్

### పేరు



"నిర్మాలా సీతారామన్ బదులు నిర్బలా సీతారామన్ పేరు ఆర్థిక మంత్రి బాగా నప్పుతుందన్న కాంగ్రెస్ ఎంపీ అధిరంజన్ చౌదరి మరో మణిశంకర్ అయ్యర్‌లా తయారయ్యారు. పార్లమెంట్‌లో తన పార్టీని అభాసుపాలు చేయడానికి ఏదైనా చేసేట్టున్నారు. కశ్మీర్ భారత్ అంతర్గత వ్యవహారం కాదనడం, ప్రధాని మోదీని చొరబాటుదారుడనడం, ఒక మహిళా మంత్రిని తిక్క పేరుతో సంబోధించడం ఆయనకే చెల్లు"

– సధావి ఖోస్లా, రచయిత్రి

### మస్కా



"ఐటీ మంత్రిగా ఉండగా మహిళల భద్రత కోసం కేంద్రం ఇచ్చిన 58 కోట్లను చిట్టి నాయుడు సింగపూరుకు మళ్లించేశాడు. ఆటోల్లో ప్రయాణించే మహిళల భద్రత కోసం యాప్ తయారీకి ఖర్చు చేసినట్లు మస్కా కొట్టాడు. ఇప్పుడు మహిళల భద్రతపై బెంగ నటిస్తున్నాడు. 58 కోట్ల స్కామ్‌పై విచారణ జరుగుతోంది. ఓపికపట్టు చిట్టీ!"

– విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### భయం



"రాహుల్ బజాజ్‌పై మోదీ ప్రభుత్వంలోని మంత్రులు విరుచుకుపడటం చూస్తుంటే, ఆయన అన్నది నిజమే అనిపిస్తోంది. ప్రైవేట్ సెక్టార్ బాగా దెబ్బతింటోంది. కానీ, ఆ విషయం చెప్పడానికి చాలామంది వ్యాపారవేత్తలు భయపడుతున్నారు"

– తవ్లీన్ సింగ్, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

## ఎవరిని నిందిద్దాం..?

గోవులను తల్లులుగా పూజించే దేశంలో స్త్రీలపై ఏదో ఒకచోట అత్యాచారాలు జరుగుతుండటం బాధాకరమైన విషయం. గతంలో వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు వరంగల్లో ప్రణీత, స్వప్నికల మీద యాసిడ్ దాడి జరిగితే నిందితులను ఎన్‌కౌంటర్ చేసి అభినందనలు అందుకున్నారు. ఆ తర్వాత కూడా ఆగని అత్యాచార ఘటనలు ఆయేషా మీరా, ఢిల్లీలో నిర్భయ, ఆసిఫా, తర్వాత గీత, మొన్న ఆసిఫాబాద్, నిన్న వరంగల్, నేడు శంషాబాద్ దిశ వరకు వచ్చాయి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు నిందితులని శిక్షించాలని కోరడం సబబే కానీ పోలీసు వ్యవస్థని మాత్రమే దీనికి బాధ్యులుగా చేసి మనమంతా చేతులు దులుపు కోవడం సరైన పని కాదు. ప్రమాదంలో చిక్కుకుంటే ఎవరిని సంప్రదించాలన్న అవగాహనని పెంచుకోవాలి. సంఘటన జరిగిన తీరుని, సంఘటన పరిధిని విశ్లేషిస్తాం కానీ ఇలాంటి ఘటనలు జరగకుండా ఏంచేయాలో ఆలోచించం.

యువడాక్టర్ దిశను తల్లిదండ్రులు చాలా బాధ్యతగా పెంచారు. కానీ ఆమె చదువుకున్న విద్యాసంస్థలో, తల్లిదండ్రులలో, తన చుట్టూ ఉన్న సమాజమో ఆపత్సమయంలో ప్రదర్శించాల్సిన ధైర్యాన్ని, సమయస్ఫూర్తిని మాత్రం నేర్పించలేదు. తనలో తనకి తెలియని అభద్రతభావాన్ని కల్పించిన ఈ వ్యవస్థే ఆ దుర్ఘటనకు బాధ్యత వహించాలి. మన విద్యావ్యవస్థ పిల్లలని యంత్రాలుగా మారుస్తోంది కానీ యంత్రాలని తయారుచేసేలా వారిని తీర్చిదిద్దటం లేదు. కుటుంబ, సమాజ మూలాల్లో మార్పు చేయకుండా భర్తగా, పురుషుడిగా స్త్రీని అన్ని కోణాల్లో, అన్ని దినాలలో అణచివేస్తూ, పాశవికంగా సుఖాలని అనుభవిస్తూనే మన బిడ్డల మీద అత్యాచారం జరగ్గానే ఏడ్వడం చూస్తే అసలు దోషులమైన మనమే కన్నీరు కార్చినట్లుంది. బాధితుల పక్షాన నిలబడాలి, నిందితులకు శిక్ష వేయడం కోర్టుల వంతు. అంతకు మించి స్త్రీ పురుషుల మధ్య లింగ వివక్ష లేని విధంగా పిల్లలని తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిదీ.

– నాగేంద్ర బొలిశెట్టి, మంచిర్యాల । 86868 48647

# రైతును 'రెవెన్యూ'తో కలపాలి

సందర్భం



చాడ వెంకటరెడ్డి

ఇటీవల అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దారు విజయారెడ్డి సజీవదహనం ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనకు కారణమైన భూములు, దాని వెనుక ఉన్న రాజకీయ నాయకుల వంటి అంశాలు పక్కకు పోయి రెవెన్యూ శాఖపై ప్రజల ఆగ్రహానికి దారి తీయడం కొంత ఇబ్బంది కలిగించే అంశం. ఈ వివాదాలన్నిటికీ నిజాం కాలం నాటి సర్వేనే ఇప్పటికీ అమల్లోకి ఉండడం, చట్టాలలో లొసుగులు కారణం. 1936–42 వరకు తెలంగాణ వ్యాప్తంగా భూ సర్వే జరిగింది. అప్పుడే రికార్డులు అమలు అయినాయి. ఎక్కువ భాగం భూములన్నీ భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతమైనందున, సన్న, చిన్నకారు రైతులకు నామ మాత్రంగా భూములుండటంతో భూ వివాదాలు చోటు చేసుకోలేదు.

తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో ''దున్నే వాడికే భూమి'' అనే నినాదం తెరపైకి రావడంతో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు, కౌలు భూములు పేదలకు ధారాదత్తం అయినాయి. అయితే చాలా చోట్ల సర్వే నంబర్ల హద్దు తొలగించడంతో భూ వివాదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఫలితంగా రెవెన్యూ చట్టానికి కొన్ని సవరణలు తెచ్చారు. అందులో అసైన్‌మెంట్ చట్టం, కౌలుదారుల హక్కుల చట్టం, ఇనాం భూముల చట్టం, దేవాదాయ, వక్ఫ్ భూములలాంటివి ఎన్నో. అంతే కాకుండా రికార్డులను సరి చేయడానికి ''రికార్డ్స్ ఆఫ్ రైట్'' ద్వారా పాసు పుస్తకాలివ్వడంలాంటివి జరిగాయి.

పహాణిలో విధిగా అనుభవదారు కాలం పెట్టి, ప్రతి సంవత్సరం పంట వివరాలు రాస్తూ, గ్రామసభల ద్వారా తెలియపరచాలి. అప్పుడు రైతు భూమి వివరాలు, రెవెన్యూ శాఖకు సంబంధం ఏర్పడుతుంది.

ప్రభుత్వం తక్షణమే రెవెన్యూ చట్టాల మార్పునకు నడుం బిగించాలి. ప్రజలు కేంద్రంగా ఉండే విధంగా రెవెన్యూ చట్టాలు మార్చాలి. అందుకు కొన్ని సూచనలు

1.గ్రామస్థాయిలో శాస్త్రీయ పద్ధతులలో సమగ్ర భూసర్వే ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలి. అందుకు తగిన రీతిలో ప్రభుత్వం రూపొందించే రెవెన్యూ బిల్లుపై విస్తృతస్థాయి చర్చకు అవకాశం కల్పించాలి.

2.తక్షణమే శాస్త్రీయ పద్ధతిలో భూ సర్వే చేపట్టాలి. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం, సాటిలైట్ ఇమేజినరీ టెక్నాలజీ, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ వంటి టెక్నాలజీని వినియోగించాలి. ప్రతి సర్వే నెంబర్ హద్దులను నిర్ణయించి, హద్దురాళ్ళను పాతించి, శాశ్వతంగా వివాదాలను పరిష్కరించాలి.

3.రెవెన్యూ పరిపాలన గ్రామస్థాయి నుండి వేళ్ళూనటానికి, సమస్యలు పరిష్కారం కావడానికి గ్రామస్థాయిలో విధిగా రెవెన్యూ అధికారిని నియమించాలి.

4.వారసత్వం, కుటుంబ భూ పంపకం, క్రయవిక్రయాలు, గిఫ్టు డీడ్, కోర్టు డిక్రి, అసైన్‌మెంట్ ద్వారా పొందే భూములకు భూమిపై హక్కు కల్పించే క్రమాన్ని పూర్తి చేయడానికి సంబంధిత రెవెన్యూ అధికారికి నిర్దిష్టకాల పరిమితి విధించాలి.

5.పెండింగ్‌లో వున్న సాదాబైనామాల క్రయవిక్రయాల దరఖాస్తులను వీలైనంత త్వరగా క్రమబద్ధీకరణ చేయడానికి పూనుకోవాలి.

6.రికార్డు ఆఫ్ రైటస్ (ఆర్.వో.ఆర్) చట్టంలో వున్న లొసుగులను తొలగించాలి.

7.పట్టాదారు పాసుపుస్తకాలలో అవకతవకలను సరిదిద్దాలి.

8.అటవీ శాఖ, రెవెన్యూశాఖల స్వాధీనంలోని భూముల హద్దులను తక్షణమే సరిచేయాలి.

9.పోడు భూముల సమస్యను పరిష్కరించాలి. అటవీ హక్కుల చట్టం కింద గిరిజనులకు పట్టాలివ్వాలి.

10.కోనేరు రంగారావు కమిటీ చేసిన 104 సిఫారసులను దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ చట్టాలను సవరించడం సబబుగా ఉంటుంది.

11.రికార్డులను తారుమారు చేసినా, తప్పులతో నమోదు చేసినా కారకులైన సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

12.రెవెన్యూ శాఖతో రైతుల సంబంధాల పునరుద్ధరణ కొరకు తగు కార్యాచరణ ఉండాలి.

13.హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో భూములను హెచ్‌ఎండిఏ తదితర సంస్థలు వేలం వేసే భూముల్లో ప్రభుత్వమే అపార్ట్‌మెంట్‌లు కట్టించి అందుబాటు ధరలో కేటాయించాలి.

వ్యాసకర్త సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
మొబైల్ : 94909 52301

# అడుసు తొక్కనేల?

'అయ్యవారేం చేస్తున్నారంటే చేసిన తప్పులు దిద్దుకుంటున్నారు. మరి అమ్మగారేం చేస్తున్నారంటే ఒలకబోసి ఎత్తుకుంటున్నారు' అని ఒక సామెత చెప్పేది మా మేనత్తగారొకావిడ. ఎవరైనా ఏదైనా చిన్న తప్పు చేస్తే చాలు దాన్ని సరిదిద్దుకొనే దాకా ఊరుకొనేది కాదు. ఒక్క కాగితం ముక్క కింద పడెయ్యటానికి వీలులేదు. మా చిన్నతనంలో పిల్లలకి వేయించిన వేరుశనగ కాయలు ఇచ్చే వారు వేసవికాలం మధ్యాహ్నం తినటానికి. పప్పులు ఇస్తే తినటం త్వరగా అయిపోయి మళ్ళీ అల్లరికి వెడతాం కదా. ఒలుచుకొని తింటూ ఉంటే కాలక్షేపం అవుతుంది. అప్పుడు తొక్కలు జాగ్రత్తగానే ఒక బుట్టలో వేసినా, పొట్టు మాత్రం ఎగిరి అటూ, ఇటు పడేది. దాన్ని ఎత్తేదాకా ఊరుకునే వారు కాదు. అప్పుడు 'జాగ్రత్తగా తింటే సరిపోయేది కదా, ఈ టైం కూడా ఆడుకునేవారు' అని ఈ సామెత చెప్పేది.



జ్యోతిర్మయం

రానురాను ప్రతి విషయంలోనూ అది ఎంత సత్యమో అర్థమౌతూ వచ్చింది. అన్న మాట నిలబెట్టుకోడానికి నేను నానా తిప్పలు పడుతుంటే, మాట మార్చి దాన్ని సమర్థించు కునే వాళ్ళని చూస్తే ఇద్దరిదీ ఒకటే పరిస్థితి కదా– తెలిసి, తెలిసి బురదలో కాలు వేశాం అనిపిస్తుంది. స్వభావాలని అనుసరించి దాన్ని కడుక్కునే ప్రయత్నం చేస్తున్నాము అని. దాని గుర్తులు, మరకలు, వాసన లేకుండా కడుక్కునే ప్రయత్నం నేను చేస్తున్నాను. అవతలి వాళ్ళు ముందుగా కాగితంతోనో, బట్టతోనో తుడుచుకుని ముందుకు పోతున్నారు.

ఎన్నో సమయాల్లో రాబోయే జన్మలని మనమే నిర్ణయించుకొని, నిర్ధారించుకుంటూ ఉంటాం. 'మళ్ళీ జన్మంటూ ఉంటే'.. 'పై జన్మలోనైనా'.. 'జన్మ జన్మల్లోనూ' అని రాబోయే జన్మ ఎట్లా ఉండాలో నిర్దేశించుకుంటూ ఉంటాం. 'ఎన్ని జన్మ లెత్తినా నీ ఋణం తీర్చుకోలేను' అంటే జన్మ పరంపరలని సిద్ధం చేసుకున్నట్టే. అంటే బురద పూసుకునే ఉద్దేశం ప్రకటిస్తున్నట్టే కదా. మరెట్లా? ఈ మాటలు పైకి అనటమే కాదు మనసులో కూడా తలుచుకోకూడదు. ఉన్నది చాలదూ? మరొక దాని గురించిన ఆలోచన ఎందుకు? దీన్నే అంటారు అడుసుతొక్కి కాళ్ళు కడుక్కోటానికి కష్టపడటం అని.

– డాక్టర్ ఎస్. అనంతలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 3-12-2019


సిలిగురి

# దిశ దిశలా నిరసన

**అ**న్నిచోట్లా నినాదాలు. దిక్కులు పిక్కటిల్లే ప్రతిధ్వనులు. 'దిశ' ఘటనకు దేశవ్యాప్త ప్రతిస్పందనలు ఇవి. విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, పౌర సంఘాలు, ప్రజలు... ఎక్కడికక్కడ స్వచ్ఛందంగా కూడి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్నారు. దోషులను శిక్షించాలని కోరుతున్నారు. తమ పిల్లలకు భద్రత ఇవ్వండి అని నిలదీస్తున్నారు. 'దిశ' ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేస్తున్నారు.

కాని దిశ ఆత్మకు శాంతి చేకూరాలంటే నిజంగా జరగవలసిన పని ఏమిటి? వీధివీధినా, వాడవాడనా స్త్రీలపట్ల గౌరవం కలిగించే చైతన్య కార్యక్రమాలను విరివిగా నిర్వహించడం. పాఠశాలల్లో బాల్యం నుంచే విద్యార్థులకు జెండర్ అవగాహన కలిగించడం. అబ్బాయిలకు ఆడపిల్లలను సమస్థాయిలో చూసే సంస్కారం కలిగించడం. వారి ప్రవర్తనా దోషాలను మొగ్గలోనే తుంచేయడం. అందరం వ్యవహార శైలిలో, మాటలో, తిట్లలో స్త్రీలను కించపరిచే ధోరణిని పరిహరించడం. ఇళ్లల్లో భర్తలు భార్యలను గౌరవించడం. పిల్లల ముందు పలుచన చేయకుండా ఉండటం. ఆడపిల్లలను మగపిల్లల కంటే తక్కువగా చూడకుండా ఉండటం. స్త్రీలను ఒక జోక్‌గా చేసి మాట్లాడకపోవడం. అశ్లీలతను మాధ్యమాలలో ప్రోత్సహించకపోవడం. బహిరంగ ప్రదేశాలలో స్త్రీలకు ప్రతి పౌరుడు ఒక కాపలాదారుగా మారగలగడం. వికృత ఆలోచనలు వెంటాడుతున్నవారు తమను తాము మార్చుకోవడానికి కౌన్సెలింగ్ సెంటర్లు తెరవడం. మానసిక జాడ్యాలను చెక్ చేసుకొనేందుకు ఉచిత మెంటల్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం. వాటికి వెళ్లేలా ప్రోత్సహించడం. స్త్రీల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే ఎటువంటి శిక్షలు పడతాయో విరివిగా ప్రచారం చేయడం. అన్నింటికి మించి ప్రభుత్వాలు ఈ విషయంలో గట్టిగా, చిత్తశుద్ధిగా పని చేయడం, చర్యలు తీసుకోవడం.

అప్పుడే 'దిశ' ఆత్మకు శాంతి. అప్పటి వరకూ ఈ ప్రదర్శనలు కొనసాగుతాయి. ఈ నిరసన ప్రజ్వరిల్లుతూనే ఉంటుంది.

అమృత్‌సర్




'నా కూతురు ఈ సమాజంలో భద్రంగా ఉందా?'
'మన పిల్లలను మనం కాపాడుకోగలమా?'
'సినిమాల్లో బూతును నిరోధించండి'
'ప్రతి మూడు నిమిషాలకు ఒక అత్యాచారం. ఇదా మన దేశం'
'విచారణలో కాలహరణం... న్యాయహరణమే'
'బాధితురాలి పేరు బయటకు చెప్పకండి'
'అంగీకారం లేని శృంగారం వద్దు'
'ఇంకా ఎంతమంది నిర్భయలు బలి కావాలి?'
'ఆడపిల్లలు ఆటవస్తువులు కారు'
'నీకు జన్మనిచ్చిన స్త్రీనే అగౌరపరుస్తావా?'
'మా దుస్తులు మీకు ఆహ్వానం కాదు'
'రేపిస్టులను ఉరి తీయండి'
'మేము రిపబ్లిక్‌లో ఉన్నాం. రేప్-పబ్లిక్‌లో కాదు'
'అందరి లక్ష్యం ఒక్కటే- అత్యాచార రహిత భారతదేశం'

**ఇవీ నేటి స్లోగన్లు... ప్లకార్డులపై కనిపిస్తున్న నినాదాలు**

ఢిల్లీ




ముంబై




బెంగళూరు




చెట్టు నీడ

## ఆర్ద్రహృదయం



**ఒ**కసారి ఒకవ్యక్తి ఒక ప్రదేశంనుండి ఇంకొక ప్రదేశానికి వెళుతున్నప్పుడు దారి మధ్యలో కొందరు దొంగలు ఆ వ్యక్తిని కొట్టి, గాయపరిచి అతడి వద్ద ఉన్న విలువైన వస్తువులను, వస్త్రాలనూ దోచుకుని ఆ వ్యక్తిని అక్కడే పడేసి వెళ్లిపోయారు, ఆ వ్యక్తికి స్పృహ లేదు... అయితే కాసేపటికి ఆ మార్గం గుండా ఒక యాజకుడు (దేవుని పని చేసేవాడు) వెళుతూ ఆ దొంగలు కొట్టి పడేసిన ఆ వ్యక్తిని చూసి పక్కనుండి తప్పుకుని వెళ్లి పోయాడు, అలాగే ఇంకో వ్యక్తి కూడా అలాగే తప్పుకుని వెళ్లాడే తప్ప అతనికి ఏ సహాయమూ చేయలేదు, ఇలా రెండోసారి వెళ్ళిన వ్యక్తి కూడా భక్తుడే, అప్పుడు అక్కడ నుండి ఒక మనిషి ఆ దారి గుండా వెళుతూ ఆ పడి ఉన్న వ్యక్తిని చూసి అతడి వద్దకు వెళ్లి అతని మీద జాలిపడి తనవద్ద ఉన్న నూనెతో అతడి గాయాలను కట్టి, అతడిని దగ్గర్లో ఉన్న ఒక పూటకూళ్ల ఇంటికి తీసుకెళ్లి అతడిని అక్కడ ఉంచాడు, అంతే కాకుండా మళ్లీ తిరిగి తెల్లవారు ఝామున ఆ పూటకూళ్లవాని వద్దకు వచ్చి అతనికి కొంత ధనం ఇచ్చి ఆ దొంగలు కొట్టి పడవేసిన వ్యక్తిని జాగ్రత్తగా చూసుకొనమని, అతడికి ఇంకా ఏదైనా వైద్య సహాయం అవసరం అయితే చే యించమని, ఆ ధనాన్ని తాను ఇస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఆ సహాయం చేసిని వ్యక్తికీ ఆ దొంగలు కొట్టి పడవేసిన వ్యక్తికీ ఎలాంటి సంబంధం లేదు, అయితే ముందు ఆ మార్గం గుండా వెళ్లిన ఇద్దరి వ్యక్తుల దృష్టిలో ఈ సహాయం చేసిన వ్యక్తి చెడ్డవాడుగా ఉండేవాడు...ఇప్పుడు ఆలోచించండి, మొదలు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు లోకం దృష్టిలో చాలా గొప్పవారిగా, భక్తులుగా చెలామణి అయ్యేవారు, దేవుని వద్ద పూజలు చేస్తూ అందరికీ కనిపించేట్టు ప్రార్థనలు చేస్తూ భక్తుల ముద్ర వేసుకున్నవారు. అయితే ఆ సహాయం చేసిన వ్యక్తి లోకం దృష్టిలో చాలా చెడ్డవాడు.

నిన్ను వలె నీ పొరుగువాడిని ప్రేమించు (మత్తయి 22:39), అని క్రీస్తు చెప్పిన మాట పరమార్థం ఇదే కదా... ఒక వ్యక్తి సహాయం కోసం చూస్తుంటే అతనికి సహాయ పడకుండా త్వరగా వెళ్లి ప్రార్థన చేయాలనో లేదా సమయానికి గుడికి వెళ్లకపోతే దేవునికి కోపం వస్తుందనో అనుకునే భక్తులకు ఈ ఉపమానం గొప్ప సత్యాన్ని నేర్పిస్తుంది. దేవునికి ఇష్టమైనట్టు బతకడమే నిజమైన భక్తి అని ఈ ఉపమానం ద్వారా మనకు తెలుస్తుంది. దేవుని పని చేసేవాడు ముందుగా దేవుని హృదయాన్ని తెలుసుకోవాలి, భక్తుడు దేవునికి నచ్చిన దానిని చేయాలి.

**– బెల్లంకొండ రవికాంత్**

బ్యూటిప్స్



### ముడతల నివారణకు

**టే**బుల్ స్పూన్ కందిపప్పు నానబెట్టి, మెత్తగా రుబ్బాలి. దీంట్లో టీ స్పూన్ టొమాటో గుజ్జు, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే చర్మంపై ముడతలు తగ్గి, యవ్వనకాంతితో మెరుస్తుంది.

### నల్లటి వలయాలకు

**క**ళ్లకింద నల్లని వలయాలు తగ్గాలంటే.. ఆముదం, ఆలివ్ నూనెలను టీ స్పూన్ చొప్పున తీసుకొని కలపాలి. చిన్న కాటన్ ఉండను తీసుకొని, ఈ నూనెలో అద్ది కంటిచుట్టూ, కనురెప్పల దగ్గర తుడవాలి. రోజూ రాత్రి పడుకునేముందు ఈ విధంగా చేస్తూ, విశ్రాంతి తీసుకుంటే కళ్ల కింద నలుపు తగ్గుతుంది.

భలే బడి

## అమ్మమ్మ స్కూల్‌కెళ్తోంది

**అమ్మమ్మ స్కూల్‌కెళ్తోంది.. నానమ్మ అఆలు దిద్దుతోంది.**
**అవ్వ ఏబీసీడీలు రాస్తోంది.. అమ్మ కూడా క్లాస్‌లో కూర్చుంటోంది.**
**స్త్రీ విద్య సమాజానికి వెలుతురు.. స్త్రీ జ్ఞానం లోకానికి వెలుతురు.**
**ఎక్కడ స్త్రీలు విద్యావంతులవుతారో అక్కడ వికాసం చోటుచేసుకుంటుంది.**
**స్త్రీ విద్యను ప్రోత్సహించే ఇలాంటి బడి ప్రతి ఊళ్లో ఉంటే ఎంత బాగుంటుంది!**


క్లాస్‌రూమ్‌లో వయోజన స్త్రీలు

**డ్వా**క్రా గ్రూప్‌లో లోన్ తీసుకుంది సుమతి. సంతకం పెట్టడానికి ముందుకు రావట్లేదు. ''ఏంటమ్మా డబ్బు తీసుకుంటావ్‌గానీ సంతకం పెట్టవా?'' పేపర్‌ను ఆమె ముందు పెడ్తూ విసుక్కున్నాడు బ్యాంక్ ఏజెంట్. ''అయ్యో .. ఆమెకు చదువురాదు సర్.. వేలిముద్ర వేస్తుంది'' అనునయిస్తున్నట్టు చెప్పింది ఆ డ్వాక్రా గ్రూప్ లీడర్. ''ఆ ముక్క ముందే చెప్తే పోయేది కదా.. టేమ్‌వేస్ట్ కాకపోతే'' అంటూ స్టాంప్‌ప్యాడ్ సుమతి ముందుకు తోశాడు. అవమానంతో ఆమె మొహం ఎర్రబడింది. సిగ్గుతో తలవంచుకొనే వేలిముద్ర వేసింది సుమతి.

•••

''రాజూ.. నీ క్లాస్‌మెంట్ నరేందర్ ఉండేవాడు చూడు.. వాళ్లమ్మ కనిపించిందిరా చాన్నాళ్ల తర్వాత'' ఉత్సాహంగా చెప్పింది కొడుకుతో అమృత.

''క్లాస్‌మెంట్ కాదమ్మా.. క్లాస్‌మేట్'' సరిదిద్దాడు కొడుకు. చిన్నబుచ్చుకున్న అమ్మ ''అదేలే. స్వారీ'' అంది తప్పు పలికినందుకు.

కిసుక్కున నవ్వాడు రాజు. ''మళ్లీ ఏమైంది స్వారీ చెప్పాగా'' కొపంగా అడిగింది అమ్మ. ''స్వారీ కాదమ్మా.. సారీ'' సరిదిద్దాడు అబ్బాయి.

కొడుకు దగర అమ్మ ఇన్‌సల్ట్ అయినట్టు భావించింది అమ్మ.

•••

అరగంట నుంచి టేబుల్ సొరుగులోని కాయితాలన్నిటినీ కిందపడేసి వాటిల్లోంచి ఏదో వెదుకుతున్న కోడలిని అడిగింది అత్తగారు ''దేని కోసం వెదుకుతున్నావమ్మా?'' అంటూ!

''అబ్బా.. మీకేం తెలుసని చెప్పాలి?'' విసుక్కుంది కోడలు. చివుక్కుమంది అత్తగారి మనసు.

వీళ్లే కాదు చాలా ఇళ్లల్లో చాలా మంది పెద్దవాళ్లకు ఈ భంగపాటు పరిపాటే. ''నీకేం తెలీదులే.. నువ్వూరుకో'' అనే మాటలూ సర్వసాధారణమే!

ఇలాంటి మాటలు, అవమానాలు వినదల్చుకోలేదు మహారాష్ట్ర, థాణె జిల్లా, ఫంగాణె గ్రామంలోని అమ్మమ్మలు, నానమ్మలు. నిరక్షరాస్యులుగా, అంగుఠా ఛాప్‌లుగా ఉండదల్చుకోలేదు. వాళ్ల కోసమే ప్రారంభమైన బడికి వెళ్లడం మొదలు పెట్టారు.

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున..**

ఆ బడిపేరు ''ఆజిబైచి శాల''. దేశంలోనే మొట్టమొదటి వయోజన మహిళా పాఠశాల. యాభై ఏళ్లు నిండిన స్త్రీలను అక్షరాస్యులను చేయాలనే ఉద్దేశంతో రిటైర్డ్ జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు యోగేందర్ బంగర్ దీన్ని స్థాపించాడు. స్థానికంగా ఉన్న మోతీరామ్ దలాల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారం, భాగస్వామ్యంతో 2016, మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున స్టార్ట్ అయిందీ స్కూల్. నేటికి ఆ బడిలో మొత్తం 35 మంది వయోజన విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఈ బడికి సాధారణ స్కూళ్లకున్నట్లే కరిక్యులమ్ ఉంది. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బడివేళలు. ప్రార్థనతో బడి మొదలవుతుంది. పాఠ్యపుస్తకాల్లోని పాఠాలు కాక గేమ్స్, గార్డెనింగ్, పెయింటింగ్ లాంటివీ పాఠ్యాంశాల్లో భాగాలు. ఇవికాక కాలేజ్ పిల్లలు, ఇతర స్కూల్‌పిల్లలు వచ్చి వీళ్లకు కంప్యూటర్స్ వంటివీ నేర్పించి వెళ్తూంటారట. ఈ పెద్దవాళ్లూ ఆ పిల్లలకు తమ జీవన పాఠాలు, అనుభవాల గురించి చెప్తూంటారట. వారానికి ఒకసారో.. పదిహేను రోజులకు ఒకసారో.. లేదంటే స్కూళ్లు, కాలేజీలకు సెలవులున్నప్పుడో.. జాతీయ పండగలప్పుడో ఇలాంటి అనుభవ పాఠాలు, వ్యూస్ ఎక్స్ఛేంజ్ సెషన్స్ ఉంటాయట. ''దీనివల్ల ఈ జనరేషన్ పోకడలను పెద్దవాళ్లు.. వాళ్ల ఎక్స్‌పీరియెన్స్‌ను చిన్నవాళ్లు తెలుసుకునే వీలుంటోంది. ఈ సెషన్స్‌తో పెద్దవాళ్ల కన్నా చిన్నవాళ్లకే ఎక్కువ ఉపయోగంగా ఉంది. పెద్దవాళ్లు తాము చదువుకోగలుగుతున్నందుకు కాన్ఫిడెంట్‌గా కనపడుతున్నారు. కాని పిల్లలు వీళ్లతో కలుస్తూ మాట్లాడుతూ.. వాళ్ల కష్టసుఖాలను తెలుసుకుంటూండడం వల్ల వాళ్లలో ఒకరకమైన ధైర్యం, మానసిక స్థయిర్యం పెరుగుతోంది. చాలామంది అమ్మాయిల్లో పిరికితనం, కంగారు పోయి.. స్థిరంగా ఆలోచించడం మొదలైందట. చిన్న విషయాలకే ఆందోళనపడ్డమూ తగ్గిందట'' అంటారు ఈ స్కూల్ వ్యవస్థాపకులు యోగేంద్ర బంగర్.

అరవై ఏళ్ల నుంచి తొంభైఏళ్ల వయస్సున్న అమ్మమ్మలు, నానమ్మలు గులాబీరంగు చీర యూనిఫామ్, బ్యాగ్‌తో చాలా శ్రద్ధగా ఈ బడికి వెళ్తూంటారు. ''సంతకం పెట్టడం వస్తే చాలు అనుకున్న మేము పుస్తకాలు చదవడం, ఫోన్ చూసుకోవడం, నంబర్లు ఫీడ్ చేసుకోవడం.. వంటివీ నేర్చుకోగలిగాం. కంప్యూటర్ గురించీ తెలుసుకున్నాం'' అంటారు సంతోషంగా.


బ్యాగులతో సూల్‌కెళ్తూ...



epaper.sakshi.com

# బర్త్‌డేకి మామాఅల్లుళ్లు


వెంకటేశ్
నాగచైతన్య

వెంకటేశ్, నాగచైతన్యల మల్టీస్టారర్ మూవీ 'వెంకీ మామ' విడుదల తేదీపై ఓ స్పష్టత వచ్చేసింది. మామా అల్లుళ్లను స్క్రీన్ మీద ఎప్పుడెప్పుడు చూడాలా? అని ఎదురు చూస్తున్న ఫ్యాన్స్‌కి రిలీజ్ డేట్ కన్‌ఫర్మేషన్ ఇచ్చేసింది చిత్రబృందం. కేయస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో వెంకటేశ్, నాగచైతన్య నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'వెంకీ మామ'. పాయల్ రాజ్‌పుత్, రాశీ ఖన్నా కథానాయికలు. సురేశ్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 13న రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. డిసెంబర్ 13 వెంకటేశ్ బర్త్‌డే. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను దర్శకుడు బాబీ, హీరో రానా ఓ సరదా వీడియో రూపంలో ప్రకటించారు. ఈ చిత్రానికి సంగీతం: యస్.యస్. తమన్, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల.

# బాబూ... నీ లుక్కు మైండ్ బ్లాకు

'ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాకైపోద్దో ఆడే పండుగాడు' అంటూ 'పోకిరి' (2006) సినిమాలో మహేశ్‌బాబు పలికిన మైండ్ బ్లాక్ డైలాగ్ ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. అప్పుడు డైలాగ్. ఇప్పుడు 'మైండ్ బ్లాక్' సాంగ్ వచ్చింది. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'సరిలేరు నీకెవ్వరు'. ఇందులో రష్మికా మందన్నా కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా కోసం శ్రీమణి రాసిన 'మైండ్ బ్లాక్.. మైండ్ బ్లాక్.. మైండ్ బ్లాక్.. బాబూ... నీ మాస్ లుక్కు మైండ్ బ్లాకు' అనే పాటను సోమవారం విడుదల చేశారు. బ్లేజ్, రెనినా రెడ్డి పాడారు. ఈ పాటలో మహేశ్ 'నువ్వు కొట్టరా.., నువ్వు ఉండరా, నువ్వు దంచెహె' అని కొన్ని డైలాగులు చెప్పడం స్పెషల్ ఎట్రాక్షన్. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు స్వరకర్త. 'దిల్' రాజు, రామబ్రహ్మం సుంకర, మహేశ్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జనవరి 11న విడుదల కానుంది.


మహేశ్‌బాబు


చిరంజీవి

# మళ్లీ ట్యూన్ అయ్యారు

చిరంజీవి సినిమా అంటే అభిమానులకు ఒకటో రెండో మాస్ పాటలు ఉండాల్సిందే. అయితే ఇటీవల విడుదలైన 'సైరా' కథలో ఆ స్కోప్ లేదు. అందుకే తన తాజా చిత్రంలో ఆ కొరతను తీర్చనున్నారు చిరంజీవి. కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయని సమాచారం. చిరంజీవి నటించిన 'చూడాలని ఉంది'లో 'రామ్మా చిలకమ్మా..', 'ఇంద్ర'లో 'దాయి దాయి దామ్మా..', 'జై చిరంజీవా'లో 'జై జై గణేశా.. జై కొడతా గణేశా..' వంటి సూపర్ హిట్ పాటలను ఇచ్చిన మణిశర్మ తాజా చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ సంగీత చర్చలు విదేశాల్లో జరుగుతున్నాయిని టాక్. చిరంజీవి–మణిశర్మ కాంబినేషన్‌లో మరో హిట్ ఆల్బమ్ వస్తుందని ఊహించవచ్చు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి నిర్మిస్తారు. ఇటీవల లాంఛనంగా ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ఆరంభంలో మొదలవుతుందట.


తమన్నా

# నన్ను చాలెంజ్ చేసిన స్క్రిప్ట్ నిశ్శబ్దం

- కోన వెంకట్


వివేక్ కూచిభొట్ల, వందన, విశ్వప్రసాద్, హేమంత్ మధుకర్, కోన వెంకట్, సుబ్బరాజు

''కథలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి అంటారు. 'నిశ్శబ్దం' కథ హేమంత్ రూపంలో నా దగ్గరకు వచ్చింది. కథలు మనల్ని కదిలిస్తే సినిమాలు అవుతాయి. అందరూ అనుకుంటున్నట్టు ఇది మూకీ సినిమా కాదు. సంభాషణలు ఉంటాయి'' అన్నారు కోన వెంకట్. అనుష్క, మాధవన్, అంజలి, షాలినీ పాండే, మైఖేల్ మ్యాడిసన్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'నిశ్శబ్దం'. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 31న విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కోన వెంకట్ మాట్లాడుతూ – ''ఈ సినిమా ప్రారంభయ్యే ముందు అనుకోని సంఘటనలు జరిగాయి. ముందు అనుష్క కాకుండా వేరే హీరోయిన్ అనుకున్నాం. సినిమా షూటింగ్ ఆలస్యం కావడంతో ఆమె ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత అనుష్క ఫ్లైట్‌లో కలసినప్పుడు ఈ కథ విని సినిమా చేశారు. హేమంత్, నేను ఒక యజ్ఞంలా ఈ సినిమా చేశాం. సినిమాలో అందరూ పాత్రలే. హీరో, హీరోయిన్లు ఉండరు. తెలుగు, తమిళ భాషల్లో చిత్రీకరించాం. మలయాళ, హిందీ భాషల్లో డబ్బింగ్ చేసి రిలీజ్ చేస్తాం. రచయితగా నన్ను చాలెంజ్ చేసిన స్క్రిప్ట్ 'నిశ్శబ్దం'. అనుష్క పాత్ర మాట్లాడలేదు కాబట్టి 'నిశ్శబ్దం' అని టైటిల్ పెట్టాం'' అన్నారు. ''హేమంత్ నాకు 15 ఏళ్లుగా స్నేహితుడు. ఈ కథను నేను కూడా ఫ్లైట్‌లోనే విన్నాను. ఇందులో చాలా డిఫరెంట్ రోల్ చేశాను'' అన్నారు సుబ్బరాజు. ''మంచి సినిమా. ఈ సినిమాను అందరూ ఆదరిస్తారని అనుకుంటున్నాను'' అన్నారు వివేక్ కూచిభొట్ల. ''టెక్నాలజీ నా వృత్తి అయినా సినిమాలంటే ప్యాషన్. హాలీవుడ్ రేంజ్‌లో సినిమా చేయాలకునేవాణ్ణి. ఈ సినిమా హాలీవుడ్ స్టయిల్లో ఉంటుంది'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''టెక్నికల్‌గా ఇది కొత్త చిత్రం. ట్రెండ్ సెట్టింగ్ మూవీ అవుతుందనుకుంటున్నాను. విశ్వప్రసాద్‌గారి లాంటి నిర్మాత దొరకడం అదృష్టం'' అన్నారు హేమంత్.

# వెండితెరకు ద్యుతీ జీవితం


ద్యుతీ చంద్

బాక్సాఫీస్ వద్ద స్పోర్ట్స్ పర్సనాలిటీస్ బయోపిక్స్‌కు మంచి వసూళ్లు ఉంటాయి. 'భాగ్ మిల్కా భాగ్ (2013), మేరీకోమ్ (2014), దంగల్ (2016)' వంటి చిత్రాల రికార్డు కలెక్షన్లే అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ బయోపిక్ 'సైనా' పేరుతో తెరకెక్కుతోంది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా బయోపిక్స్‌పై ప్రకటనలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అథ్లెట్ ద్యుతీ చంద్ బయోపిక్ తెరకెక్కనుంది. ఈ చిత్రానికి జాతీయ అవార్డుగ్రహీత హిమాన్షు ఖతువా దర్శకత్వం వహిస్తారు. ''ఎన్నో పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు నా బయోపిక్‌ను నిర్మించడానికి సంప్రదింపులు జరిపాయి. కానీ, నేను ఎవరికీ హక్కులు ఇవ్వలేదు. హిమాన్షు గారి ప్రతిభ గురించి నాకు తెలుసు. నా కథకు న్యాయం చేయగలరనే నమ్మకం ఉంది. ఈ బయోపిక్‌ను కేవలం ఒక ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్‌గానే కాదు.. చూసినవారు కూడా స్ఫూర్తి పొందేలా ఉండాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు ద్యుతీ చంద్. ''ఫస్ట్ డ్రాఫ్ట్ స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ద్యుతి చిన్నతనం నుంచి ఆమె జీవితంలోని ఎత్తుపల్లాలను కూడా సినిమాలో చూపిస్తాం. ద్యుతీగా ఎవరు నటించబోతున్నారనే విషయంపై త్వరలో చెబుతాం'' అని పేర్కొన్నారు హిమాన్షు.

# తండ్రిని కాపాడే కూతురు

అనుకోకుండా ఓ క్రైమ్‌లో ఇరుక్కున్న తండ్రిని కాపాడటానికి కూతురిగా తన వంతు ప్రయత్నం చేస్తున్నారు తమన్నా. మరి ఈ క్రైమ్‌ని ఛేదించి, తన తండ్రిని నిర్దోషిగా ఎలా నిరూపిస్తారని తెలియడానికి కొంచెం టైమ్ ఉంది. తమన్నా తొలి 'వెబ్ సిరీస్' 'ది నవంబర్స్ స్టోరీ' కథ ఇది. ఇదొక క్రైమ్ థ్రిల్లర్. తమిళంలో రూపొందుతున్న ఈ సిరీస్‌కు రామ్ సుబ్రమణియన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో తండ్రిని కాపాడే కూతురి పాత్రలో నటిస్తున్నారు తమన్నా. ఈ సిరీస్ ఫస్ట్ షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. ''తొలి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. తదుపరి షెడ్యూల్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు తమన్నా. ఈ వెబ్ సిరీస్‌ను ఆనంద వికడన్ సంస్థ నిర్మిస్తోంది. హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్న ఈ సిరీస్ తెలుగు, హిందీ భాషల్లోనూ అందుబాటులోకి రానుంది.

# మా ప్రేమ పుట్టింది ముంబైలో


తరుణ్ రాజ్ అరోరా

''నేను మోడలింగ్ నుంచి వచ్చాను. అందుకే ప్రతి సినిమాలో స్టయిలిష్‌గా కనిపిస్తాను. అది నా నటనలోనూ కనిపించేలా చూసుకోవడం నా బాధ్యత'' అన్నారు నటుడు తరుణ్ రాజ్ అరోరా. నిఖిల్, లావణ్యా త్రిపాఠి జంటగా టి.సంతోష్ తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సురవరం'. 'ఠాగూర్' మధు సమర్పణలో రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించిన ఈ చిత్రం గత శుక్రవారం విడుదలైంది. ఈ సినిమాలో విలన్‌గా నటించిన తరుణ్ రాజ్ అరోరా మాట్లాడుతూ – ''అస్సామ్‌లో పుట్టాను. చెన్నైలో చదువుకున్నాను. బెంగళూర్‌లో మోడలింగ్ చేశా. సౌత్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. హిందీలో ఎక్కువ సినిమాలు చేసినా నన్ను సౌత్ యాక్టర్‌గా గుర్తిస్తున్నారు. 'అర్జున్ సురవరం' ఒరిజినల్ చిత్రం 'కణిదన్'లో నేనే నటించాను. తెలుగు వెర్షన్‌లో సెంటిమెంట్ యాడ్ చేశారు. చూసినవాళ్లందరూ సినిమా బావుంది అంటున్నారు. భావం, భావోద్వేగాలు ఎక్కడైనా ఒక్కటే. నటనకి భాషతో సంబంధం లేదు. ప్రస్తుతం హిందీలో 'లక్ష్మి బాంబ్, మలయాళంలో 'మామాంగం', తమిళంలో 'దగాల్తీ' సినిమాలు చేస్తున్నాను. నా భార్య అంజలా జవేరి నేను చేసిన సినిమాలను బాగా ఎంజాయ్ చేస్తుంది. మేమిద్దరం ముంబైలో ప్రేమలో పడ్డాం. ముందు నేనే తనకి ప్రపోజ్ చేశాను. కావాలనే పిల్లలు వద్దనుకున్నాం. మేం ఒకరినొకరం పిల్లలుగా చూసుకుంటాం'' అన్నారు.

# రిస్క్ ఎందుకన్నా అన్నాను

- అనిల్ రావిపూడి


శ్రీనివాస్ రెడ్డి, అనిల్ రావిపూడి

''నాకున్న క్లోజ్ ఫ్రెండ్స్‌లో శ్రీనివాస్‌రెడ్డి ఒకరు. అందుకనే నా సినిమాల్లో తనుంటాడు. 'సరిలేరు నీకెవ్వరు'లో మాత్రం మిస్సయ్యాడు. మా సినిమాల షూటింగ్స్‌లో తను ఆర్టిస్ట్‌గాకంటే అసిస్టెంట్ డైరెక్టర్‌గా కష్టపడుతుంటాడు'' అన్నారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. నటుడు వై. శ్రీనివాస్‌రెడ్డి దర్శక నిర్మాతగా ఫ్లయింగ్ కలర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందించిన చిత్రం 'భాగ్యనగర వీధుల్లో గమ్మత్తు'. శ్రీనివాస్‌రెడ్డి, సత్య, 'షకలక' శంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో బ్యానర్ లోగోను అనిల్ రావిపూడి, టైటిల్ యానిమేషన్‌ను సంగీత దర్శకుడు యస్.యస్. తమన్ విడుదల చేశారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు ప్రొడక్షన్ కూడా చేస్తున్నానని శ్రీనివాస్‌రెడ్డి చెప్పగానే 'ఎందుకన్నా.. రిస్క్ ఏమో!' అన్నాను. తను ప్లానింగ్‌తో సినిమాను పూర్తి చేశాడు.. సినిమా చాలా బాగుంది'' అన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ– ''ఈ సినిమాకు వేరే డైరెక్టర్‌ను పెట్టినా ఆయన వెనక నేను నిలబడాల్సి వచ్చేది. అందుకే నేనే డైరెక్ట్ చేశాను. దర్శకుడు కావాలనే కోరిక అలా తీరింది. సినిమా చూసిన 'దిల్' రాజుగారు, శిరీష్‌గారు, సాయిగారు.. ఇంకొంతమంది చిన్న కరెక్షన్స్ చెప్పారు. అవెంతో ఉపయోగపడ్డాయి'' అన్నారు. ''ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అన్నారు తమన్. నిర్మాత పద్మనాభ రెడ్డి, నటులు 'సత్యం' రాజేష్, 'షకలక' శంకర్, సంగీత దర్శకుడు సాకేత్ తదితరులు మాట్లాడారు.

# అనుబంధాలు.. వెటకారాలు


రవి కిరణ్

''నాది తూర్పుగోదావరి జిల్లా భద్రవరం. నేను ఎవరి దగ్గరా దర్శకత్వశాఖలో చేయలేదు. ఇంటర్నెట్ నుంచి సమాచారం సేకరిస్తూ, షార్ట్ ఫిల్మ్స్ చూస్తూ సినిమాని తెరకెక్కించడం ఎలాగో నేర్చుకున్నా'' అని డైరెక్టర్ రవికిరణ్ అన్నారు. కిరణ్ అబ్బవరమ్, రహస్యగోరక్ హీరోహీరోయిన్లుగా డి. మనోవికాస్ నిర్మించిన చిత్రం 'రాజావారు రాణిగారు'. ఈ సినిమా సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా నవంబర్ 29న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు రవి కిరణ్ మాట్లాడుతూ– ''ఊరి నుంచి హైదరాబాద్ వచ్చాక సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. కథ కంటే కథనం బాగుండాలి. చిన్న అంశాల చుట్టూ సన్నివేశాలు అల్లుకుని ప్రేక్షకులను మెప్పించడం నాకు ఇష్టం. నేను పల్లెటూరు నుంచి వచ్చాను కాబట్టి అక్కడి అనుబంధాలు, రాజకీయాలు, వెటకారాలు తెలుసు. అందుకే ఈ నేపథ్యంలో కథ అల్లుకున్నా. మా సినిమా చూసినవారిలో కొందరు 'తొలిప్రేమ' చిత్రంలా ఉందనడం ఆనందంగా ఉంది. నా తర్వాతి చిత్రం కోసం రాజకీయ నేపథ్యంలో ఓ కథ సిద్ధం చేసుకుంటున్నా'' అన్నారు.

# జాన్‌కి అతిథి


కాజల్ అగర్వాల్

'జాన్'కి అతిథి కాబోతున్నారట కాజల్ అగర్వాల్. ప్రభాస్ హీరోగా ఎస్. రాధాకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాన్' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. గోపీకృష్ణా మూవీస్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై కృష్ణంరాజు, వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. 1970 పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ అతిథి పాత్రలో నటించబోతున్నారని తాజా సమాచారం. ఇంతకుముందు 'మిస్టర్ పర్‌ఫెక్ట్' (2011) సినిమాలో ప్రభాస్, కాజల్ హీరోహీరోయిన్లుగా నటించిన సంగతి తెలిసిందే.

**తొలిసారి పోలీస్ పాత్రలో...?** కెరీర్‌లో యాభై సినిమాల మైలురాయిని చేరుకున్న కాజల్ అగర్వాల్ ఇప్పటివరకు తెలుగులో పోలీస్ పాత్ర చేయలేదు. అయితే త్వరలో కాజల్ పోలీసాఫీసర్‌గా చార్జ్ తీసుకోవడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. ఓ కొరియన్ మూవీ తెలుగు రీమేక్‌లో ఆమె పోలీసాఫీసర్‌గా నటించబోతున్నారట. ఈ సినిమాకు హీరో రానా నిర్మాతగా వ్యవహరించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. 2017లో వచ్చిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రంలో రానా, కాజల్ జంటగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

# స్కామ్ ఆధారంగా...

చెంగ్, మైరా అమితి జంటగా విఘ్నేష్ కలగర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓన్లీ నేను'. శ్రీనివాస్ శరకడం నిర్మిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. అతిథిగా విచ్చేసిన దర్శకుడు, నటుడు కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''ఓన్లీ నేను' ట్రైలర్ బావుంది. మ్యూజిక్, సినిమాటోగ్రఫీ హైలైట్. శ్రీనివాస్‌గారు ఈ నెల 15న చేపట్టబోతున్న 'ఇండియన్ ఫ్యాషన్ అండ్ ఫిల్మ్ ఫెస్టివల్' కొత్త డైరెక్టర్స్, కొత్త నిర్మాతలకు మంచి వేదిక అవుతుంది'' అన్నారు. ''ఔత్సాహికులు తమ ప్రతిభని నిరూపించుకోవడానికి ఇండియన్ ఫ్యాషన్ అండ్ ఫిల్మ్ ఫెస్టివల్' కార్యక్రమం ఓ మంచి ప్లాట్‌ఫామ్'' అన్నారు తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ మామిడి హరికృష్ణ. ''ఇండియన్ ఫ్యాషన్ అండ్ ఫిల్మ్ ఫెస్టివల్'లో ఔత్సాహిక దర్శకుల టీజర్స్, కాన్సెప్ట్‌లను ప్రదర్శిస్తాం. ఆడిషన్స్ ద్వారా నటీనటులు యాక్టింగ్ స్కిల్స్ చూపించుకోవచ్చు'' అన్నారు శ్రీనివాస్ శరకడం. ''ఒక స్కామ్ ఆధారంగా ఈ సినిమా చేస్తున్నాం. షూటింగ్ చివరి దశలో ఉంది. వేసవిలో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు విఘ్నేష్.


మైరా అమితి



సాక్షి సాగుబడి

నల్లగొండ
మంగళవారం 3-12-2019


భూములు కోతకు
గురికాకుండా ఆపుదాం
మన భవిష్యత్తును కాపాడుకుందాం!
– ఆహార, వ్యవసాయ సంస్థ, ఐ.రా.స.

జ్యేష్ఠ కార్తె : డిసెంబర్ 3 నుంచి




ఆస్ట్రేలియా సాయిల్ మైక్రోబయాలజిస్ట్ వాల్టర్ యన



• అనంతపురం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్న ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్ పంటలను పరిశీలిస్తున్న వాల్టర్ యన, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు టి. విజయకుమార్ తదితరులు

# ప్రకృతి సేద్యంతోనే భూతాపానికి చెక్!

**వాల్టర్ యన.. ఈయన ఆస్ట్రేలియాకు చెందిన సుప్రసిద్ధ సాయిల్ మైక్రోబయాలజిస్టు, వాతావరణ శాస్త్రవేత్త. హెల్దీ సాయిల్స్ ఆస్ట్రేలియా సంస్థ వ్యవస్థాపకులుగా రైతులతో మమేకమై పనిచేస్తుంటారు. భూతాపోన్నతికి, కరువు కాటకాలకు ఎటువంటి ఆచ్ఛాదనా లేని భూమి ఎండ వేడిమిని వాతావరణంలోకి తిరగ్గొట్టడం (రీ రేడియేషన్) వల్ల సహజ నీటి చక్రం (నేచురల్ వాటర్ సైకిల్) చెదిరిపోవడమే మూల కారణమన్నది ఆయన విశ్లేషణ. ఏడాది పొడవునా బహుళ పంటలతో భూమిని కప్పి ఉంచేలా(గ్రీన్ కవర్) ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అనుసరిస్తే వాతావరణంలోని కర్బనాన్ని జీవద్రవ్యం ద్వారా భూమిలో స్థిరీకరించడం (సాయిల్ కార్బన్ స్పాంజ్) సాధ్యమవుతుందని, తద్వారా భూమిని చల్లబరిచి సహజ నీటి చక్రాన్ని పునరుద్ధరించుకోవచ్చని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు. తీవ్ర కరువున్న ప్రాంతాల్లో సైతం క్రమంగా పదేళ్లలో కరువును శాశ్వతంగా పారదోలవచ్చని, భూతాపోన్నతిని ఉపశమింపజేయవచ్చని అంటున్నారాయన. మన దేశానికి మొదటి సారి వచ్చిన ఆయన ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఇటీవల సందర్శించారు. అనంతపురం వంటి తీవ్ర కరువు జిల్లాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో రుతుపవనాల రాకకు ముందే విత్తనం వేసే (ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్) వినూత్న పద్ధతి రైతులకు ఉపయోగపడటంతోపాటు భూతాపాన్ని అరికట్టేందుకు ఉపయోగపడుతుందని అంటున్న వాల్టర్‌తో 'సాగుబడి' ముఖాముఖి..**

STOP SOIL EROSION SAVE OUR FUTURE World Soil Day 5 DECEMBER 2019

• **భూతాపోన్నతితో నెలకొన్న వాతావరణ ఎమర్జెన్సీ పరిస్థితులను ప్రపంచం అంతటా ఇవ్వాళ మనం చూస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం(ప్రపంచవ్యాప్తంగా దీన్నే రీజనరేటివ్ అగ్రికల్చర్ అని అంటున్నారు) ద్వారా మాత్రమే పరిస్థితిని చక్కదిద్దగలమని గత కొన్నేళ్లుగా మీరు చెబుతున్నారు కదా.. అదెలా..?**

భూతాపం, కరువులకు ప్రధాన కారణం విచక్షణా రహితంగా అడవులను నరికివేస్తూ నేలను ఎండబారిన పడెయ్యడం, పారిశ్రామిక వ్యవసాయ పద్ధతుల్లో గత వందేళ్లుగా ఏక పంటలను సాగు చేయడం వల్ల ప్రతి హెక్టారు భూమిలో నుంచి ఏటా 5–10 టన్నుల కర్బనాన్ని చేజేతులా గాల్లో కలిపేస్తున్నాం. భూముల్లో 5%గా ఉండాల్సిన సేంద్రియ కర్బనం.. అత్యంత కనిష్ట స్థాయి 0.3%కి దిగజారింది. అందువల్ల మన భూములు నీటిని నిలుపుకోలేక ఉత్పాదకతను కోల్పోయాయి. అంతేకాదు, యావత్ వాతావరణాన్ని చల్లబరిచే ప్రాణశక్తిని సైతం కోల్పోయాయి. అందువల్ల 'సహజ నీటిచక్రం' దెబ్బతిన్నది. కరువు కాటకాలు, అకాల వర్షాలు, భూతాపం అపరిమితంగా పెరిగిపోవడం.. ఇవన్నీ 'సహజ నీటి చక్రం' దెబ్బతినటం వల్ల కలుగుతున్న దుష్పరిణామాలే.

• **దెబ్బతిన్న నీటిచక్రాన్ని పునరుద్ధరించడం ప్రకృతి వ్యవసాయం వల్ల సాధ్యమవుతుందా?**

సాధ్యమే. భూతాపాన్ని నిజంగా తగ్గించాలంటే.. మనం మొదట చేయాల్సింది రసాయనాలతో పారిశ్రామిక వ్యవసాయం చేయటం మాని, భూములను సజీవవంతం చేసే పకృతి వ్యవసాయం చేపట్టాలి. భూమి అంతటికీ దట్టమైన ఆకుపచ్చని ఆచ్ఛాదన కల్పించాలి. భూములు ఎండ బారిన పడకుండా ఒకటికి నాలుగు పంటలతో, తోటలు చెట్లతో 365 రోజుల పాటు కప్పి ఉంచేలా గ్రీన్‌కవర్ పెంచగలిగితే భూతాపాన్ని తగ్గించెయ్యవచ్చు. వాతావరణంలో అతిగా పోగుపడిన కర్బనాన్ని తిరిగి భూమిలోకి జీవ ద్రవ్యం రూపంలో స్థిరీకరించవచ్చు (ఈ ప్రక్రియనే 'సాయిల్ కార్బన్ స్పాంజ్' అంటున్నారు). సేంద్రియ కర్బనం పుష్కలంగా ఉండి స్పాంజ్ మాదిరిగా నీటిని పట్టి ఉంచే సజీవ భూముల సాయంతో మాత్రమే 365 రోజులు గ్రీన్ కవర్ పెంచగలుగుతాం. అప్పుడే గతి తప్పిన నీటి చక్రాన్ని పునరుద్ధరించుకోగలం. భూతాపాన్ని అరికట్టడం వీలవుతుంది. పారిశ్రామిక వ్యవసాయాన్ని వదిలెయ్యకుండా, భూములను తిరిగి సజీవవంతంగా చేసుకునే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చేపట్టకుండా భూతాపాన్ని అరికట్టడం అసాధ్యం. పదిహేనేళ్లుగా నేను ఇదే చెబుతున్నాను. అయితే, భారత దేశంలో మీరు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఇందుకు దోహదపడతాయి.

• **ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం జరుగుతున్న భూములను స్వయంగా పరిశీలించారు కదా. మీకెలా అనిపించింది?**

ప్రకృతి వ్యవసాయ పద్ధతి భూములకు, రైతులకు, వాతావరణానికి నిస్సందేహంగా ఎంతో మేలు చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో నాకు ఆశ్చర్యం కలిగించిందేమిటంటే.. అనంతపురం వంటి తీవ్ర కరువు ప్రాంతాల్లో కూడా రుతుపవనాల రాకకు ముందే విత్తనాలు వేయడం(ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్) చాలా అద్భుత ఫలితాలనిచ్చే ప్రయోగం. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏడాది పొడవునా పంటలతో నిండి ఉండేలా భూములకు సజీవ ఆచ్ఛాదన కల్పించడానికి ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పొలాలు చూసి నేనెంతో ముగ్ధుడినయ్యాను. చాలా దేశాలు తిరిగాను. ఇలాంటి మెరుగైన సాగు పద్ధతి క్షేత్రస్థాయిలో అమలులో ఉండటం మరెక్కడా చూడలేదు. ఇది ప్రపంచానికే అనుసరణీయమైన గొప్ప ఉదాహరణగా నిలుస్తుందనటంలో సందేహం లేదు. అయితే, సీజనల్ పంటల సాగుతోపాటు.. పండ్ల తోటలు వేయటం, ఇతర ప్రయోజనకరమైన జాతుల చెట్లు పెంచుతూ వాటి మధ్యలో రకరకాల పంటలను ఏడాది పొడవునా సాగు చేయడం(ఆగ్రో ఫారెస్ట్రీ) ద్వారా భూమిని సాధ్యమైనంత వరకు కప్పి ఉంచేలా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత పరిపుష్టం చేయాల్సి ఉంటుంది. ఇందులో ప్రభుత్వంతోపాటు చిన్న, సన్నకారు రైతులు కీలకపాత్ర పోషించాలి.

• **రుతుపవనాల రాకకు ముందే పొడి వాతావరణంలో విత్తనాలు వేసే ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఏ విధంగా విశిష్టమైనదో శాస్త్రీయంగా వివరిస్తారా?**

ఎకరానికి 400 కిలోల ఘనజీవామృతం వేయడంతోపాటు ఒకటికి పది రకాల ఏక దళ, ద్విదళ పంటల విత్తనాలను బీజామృతంతో శుద్ధిచేసి వర్షం రాకకు ముందే విత్తుతున్నారు. గడ్డీ గాదాన్ని, పొట్టు వంటి పంట వ్యర్థాలను నేలపై ఆచ్ఛాదనగా వేస్తున్నారు. ద్రవజీవామృతం పిచికారీ చేస్తున్నారు. వర్షం రావడానికి ముందుగానే విత్తినప్పటికీ.. అంతటి పొడి వాతావరణంలోనూ దొరికిన కొద్దిపాటి తేమతోనే ఈ విత్తనాలు మొలకెత్తి, మిశ్రమ పంటలు పచ్చగా పెరుగుతున్నాయి. వర్షానికి ముందే అతికొద్ది పరిమాణంలోనైనా మూడు రకాలుగా నీరు సమకూరటం వల్లనే ఈ విత్తనాలు మొలిచి పెరుగుతున్నాయి. వర్షం పడిన తర్వాత



• గుంటూరు జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో సాగవుతున్న పత్తి పంటను పరిశీలిస్తున్న వాల్టర్ యన

మరింత పుంజుకొని భూమికి గ్రీన్ కవర్‌గా మారుతున్నాయి. వానకు ముందే వేసిన విత్తనం మొలవడానికి దోహదపడుతున్న నీటి వనరులు ఇవి.. ఘనజీవామృతం, జీవామృతంలోని పిండిపదార్థాన్ని సూక్ష్మజీవులు విచ్ఛిన్నం చేసినప్పుడు నీరు విడుదలవుతుంది. ప్రతి గ్రాము పిండి పదార్థానికి 6 గ్రాముల చొప్పున నీరు విడుదలవుతుంది.

రెండోరకం నీటి వనరు.. ఎండాకాలంలో



రైతులతో ముచ్చటిస్తున్న వాల్టర్ యన తదితరులు

కూడా మట్టి కణాల చుట్టూ సూక్ష్మ స్థాయిలో నీటి జాడ(వాటర్ ఫిల్మ్) ఉంటుంది. కానీ, ఈ నీటిని మొక్కల పీచు వేర్లు కూడా పీల్చుకోలేవు. అయితే, ఘనజీవామృతం, ద్రవజీవామృతం ద్వారా వేర్ల దగ్గర పెరిగిన మైకోరైజా శిలీంధ్రపు పోగులు (ఒక మీటరు ఘనపు మీటరు సజీవవంతమైన మట్టిలో 25 వేల కిలో మీటర్ల పొడవు వరకు శిలీంధ్రపు పోగులు విస్తరిస్తాయి) ఈ నీటిని పీల్చుకొని వేర్లకు అందిస్తాయి. పొడి వాతావరణంలో విత్తనం మొలకెత్తడానికి తేమ ఇలా లభిస్తుంది.

మూడో రకం.. మొలక వచ్చిన తర్వాత ఆ ఆకులు వాతావరణంలో నుంచి నీటి తేమను రాత్రి పూట పీల్చుకొని పెరుగుతాయి. ఎండాకాలం బొత్తిగా నీరే లేదు అనుకున్న ప్రాంతాల్లో కూడా ఇలా నీటి వనరులు ప్రకృతిలోనే నిగూఢంగా దాగున్నాయి. ఉపాయంతో ఆ వనరులను అందిపుచ్చుకోవడానికి ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్ వంటి వినూత్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఉపయోగపడుతున్నాయి. పంటకు– పంటకు మధ్యలో నవధాన్యాలను పచ్చిరొట్ట పంటలుగా సాగు చేసి, భూమిలో కలియదున్ని (ఇలా భూమిలోకి చేరిన సేంద్రియ కర్బనం ఒక గ్రాముకు 8 గ్రాముల నీటిని పట్టి ఉంచగలుగుతుంది).. కొద్ది రోజుల్లోనే మళ్లీ పంటలు వేసుకుంటూ ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచుతున్న రైతులను కూడా ఇక్కడ కలుసుకున్నాను. ఆశ్చర్యం, ఆనందం కలిగాయి.

• **అనంతపురం జిల్లాలో కూడా ఇలా జరిగిందా? ఇందులో శాస్త్రీయత ఎంత?**

అవును. ఇదంతా శాస్త్రీయంగానే జరిగింది. గత మే నెలలో వానకు ముందే విత్తిన పంటలు మొలిచాయి. జూలై, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 100 ఎం.ఎం. వర్షం పడింది. పంటలు మాత్రం హెక్టారుకు 12 నుంచి 15 టన్నుల బరువు మేరకు పెరిగాయి. 15 టన్నుల బరువున మొక్కలు (బయోమాస్) పెరగాలంటే 15 వేల టన్నుల నీరు అవసరం. ఒక గ్రాము బయోమాస్ పెరగాలంటే ఒక లీటరు నీరు అవసరం. 100 మిల్లీ మీటర్ల వర్షం హెక్టారు పొలంలో కురిస్తే, వెయ్యి మెట్రిక్ టన్నుల నీరు లభించినట్లు లెక్క. అనంతపురంలో కురిసిన 100 ఎం.ఎం. వర్షంతో లభించిన వెయ్యి మెట్రిక్ టన్నులు పోను.. 12 టన్నుల పంటల బయోమాస్ పెరగడానికి దోహదపడిన మిగతా 11 వేల టన్నుల నీరు ఎక్కడి నుంచి వచ్చింది? గాలిలో నుంచే!

• **365 రోజులూ భూమిని పంటలు, చెట్ల పచ్చదనంతో కప్పి ఉంచినప్పుడు రైతుకు ఎన్నాళ్లలో ప్రయోజనం కనిపిస్తుంది?**

ప్రకృతి వ్యవసాయ సూత్రాలన్నీ పాటించే పొలంలో రైతుకు మొదటి సంవత్సరం నుంచే దీని సత్ఫలితాలు కనిపిస్తాయి. భూమి సజీవవంతం అవుతుంది. మట్టి భౌతిక జీవ రసాయనిక స్థితిగతుల్లో, దిగుబడిలో మొదటి మూడేళ్లు చాలా ప్రస్ఫుటంగా మార్పు కనిపిస్తుంది.

• **భూతాపం తగ్గి, కరువు పూర్తిగా పోవడానికి ఒక ప్రాంతంలో కనీసం ఎంత విస్తీర్ణంలో గ్రీన్ కవర్ కల్పించాల్సి ఉంటుంది?**

కనీసం 2 వేల హెక్టార్ల విస్తీర్ణంలో గ్రీన్ కవర్ పెంచితే ఉష్ణోగ్రతలో క్రమంగా తేడా తెలుస్తుంది.10 ఏళ్ల కాలంలో 90% మేరకు నీటి చక్రం పునరుద్ధరణ సాధ్యమవుతుంది. నేను నివసించే కాన్‌బెర్రా(ఆస్ట్రేలియా రాజధాని)లో వెయ్యి హెక్టార్లలో గ్రీన్ కవర్ ఉండటం వల్ల ఇతర ప్రాంతాలతో పోల్చితే అక్కడ 12 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత తేడా వచ్చింది.

ఆసియాలో గత 20 ఏళ్లలో రుతుపవనాల విశ్వసనీయత 30 శాతం తగ్గిపోయింది. భూములను పచ్చదనంతో నింపితే వాతావరణంలో రీరేడియేషన్ తగ్గి కూలింగ్ ఎఫెక్ట్ ఏర్పడుతుంది. మేఘాలు వర్షించడానికి పరిస్థితులు అనుకూలిస్తాయి. ఎక్కువగా మొక్కలు నాటడంతోపాటు.. భూములను 365 రోజులూ పంటల పచ్చదనంతో కప్పి ఉంచేలా వ్యవసాయ పద్ధతిని మార్చుకుంటే తప్ప భూతాపాన్ని తగ్గించడం, కరువును శాశ్వతంగా పారదోలడం అసాధ్యం.

(Walter jehne వీడియో ప్రసంగాల కోసం యూట్యూబ్‌లో వెతకండి)

ఇంటర్వ్యూ: **పంతంగి రాంబాబు,**
సాగుబడి డెస్క్

నీరు, గాలి, దుక్కిచేయడం వల్ల అత్యంత సారవంతమైన నేల పైపొరలోని మట్టి కొట్టుకుపోతుండటం (దీన్నే భూక్షయం అంటారు) మానవాళి మనుగడకే గొడ్డలి పెట్టుగా మారింది.




• పాలకులు, రైతులు, శాస్త్రవేత్తలు, ప్రజలు యుద్ధప్రాతిపదికన భూపరిరక్షణ చర్యలను చేపట్టాలి. లేకపోతే 2050 నాటికి 15 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సాగు భూములు నిరర్థకంగా మారతాయి. భారత దేశంలోని యావత్ సాగు భూమి సాగుకు యోగ్యం కాకుండా పోవడంతో ఈ పంట నష్టం సమానం.

• ప్రతి 5 సెకన్లలో ఫుట్‌బాల్ కోర్టు విస్తీర్ణంలో మట్టి కొట్టుకుపోతోంది.

• మట్టి 2–3 సెంటీమీటర్ల ఎత్తున ఏర్పడానికి వెయ్యి సంవత్సరాలు పడుతుంది. మనుషులు ముందుచూపు లేకుండా చేస్తున్న పనుల వల్ల మానవాళి మనుగడకే మూలాధారమైన నేలలు హరించుకుపోతున్నాయి.

## 7న ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మామిడి సాగుపై శిక్షణ

మామిడి సాగులో వివిధ దశల్లో ప్రకృతి వ్యవసాయదారులు పాటించాల్సిన మెలకువలపై గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7(శనివారం)న ఉ. 9 గం. నుంచి సా. 4 గం. వరకు కృష్ణాజిల్లా నూజివీడులోని ఛత్రపతి సదన్‌లో సదస్సు జరుగుతుంది. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. రాజేష్ – 91779 88422

### 9న నాచుగుంట గోశాలలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ

ప.గో. జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంటలోని గోపాలకృష్ణ గోశాలలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఈ నెల 9 (సోమవారం) ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు రైతులకు శిక్షణ ఇస్తారు. కొత్త పద్ధతులను అవలంబించే రైతులు అనుభవాలను పంచుకుంటారు. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. జగదీష్ – 78934 56163.

## 8న 'చిరు'తిళ్ల తయారీపై ఉచిత శిక్షణ

గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 8(ఆదివారం) ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు జొన్నలు, అరికలు, కొర్రలతో మురుకులు/జంతికలు, బూందీ, నువ్వు లడ్డూలు, వేరుశనగ చిక్కీ తదితర చిరుతిళ్ల తయారీపై ఉచిత శిక్షణ ఇస్తారు. ముందుగా పేర్ల నమోదుకు 97053 83666, 0863 – 2286255.

• డెయిరీ డైరీ-18

## శీతాకాలంలో పశువులకు నిల్వ నీళ్లివ్వద్దు



వేసవిలోలాగానే, శీతాకాలంలో కూడా పశువులు కొంత ఇబ్బందికర వాతావరణాన్ని ఎదుర్కొంటాయి. సాధారణంగా పశువులు తమ శరీర ఉష్ణోగ్రతను 101 డిగ్రీల ఫారెన్ హీట్‌గా సరిచేసుకుంటూ జీర్ణప్రక్రియను కొనసాగిస్తూ ఉంటాయి. మెటబాలిజమ్ ద్వారా ఉత్పత్తి అయ్యే వేడిని వేసవిలో చెమటద్వారా, శీతాకాలంలో మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. ఈ వేడిని బయటకు పంపే ప్రక్రియ పశువు పరిసర వాతావరణాన్ని బట్టి ఉంటుంది. వేసవిలో ఎక్కువ వేడి శరీరంలో ఉన్న పక్షంలో వడదెబ్బ తగలడం, అలానే శరీరంలో శీతాకాలంలో సరియైన వేడి శరీరంలో లేనప్పుడు పశువు శీతలపు వత్తిడిని చవిచూస్తుంది. దీనినే 'కోల్డ్ స్ట్రెస్' అంటారు. దీని నివారణకు కొన్ని సూచనలు:

1. బాగా చల్లగా ఉన్న నీటిని పశువులకు అందించరాదు. దీనికి నివారణగా నిల్వ ఉన్న వాటిని కాకుండా, తాజా బోర్‌వెల్ నుంచి వచ్చిన నీటిని పశువులకు అందించాలి. నిల్వ ఉన్న నీరు ఎక్కువ చల్లగా ఉంటుంది.
2. బయట వాతావరణం చల్లగా ఉంటే, ఎక్కువ వేడి శరీరం నుంచి బయటకు పశువు వదులుకోవాల్సి వస్తుంది. అందుచేత ఎక్కువగా వేడిని ఉత్పత్తి చేసే మేపు పదార్థాలను పశువులకు అందించాలి. ఎండుమేత వంటి వాటిని పశువుకు ఎక్కువగా అందించాలి. దాణా పదార్థాలకంటే ఇవి మేలు.
3. పశువుల షెడ్లకు ఉన్న అన్ని ద్వారాలు మూయకూడదు. గాలి, వెలుతురు తగ్గిపోయి, షెడ్లలో తేమ వాతావరణం ఏర్పడుతుంది.
4. చల్లగాలుల నుంచి పశువులను కాపాడాలి. షెడ్లలో సూర్యరశ్మి పడేటట్లు చూడాలి.
5. వీలయితే పశువులకు వరిగడ్డితో వెచ్చదనం కోసం ఒక బెడ్డును ఏర్పాటు చేయాలి. వీటిని పొడిగా ఉంచడం అవసరం.
6. సాధ్యమయినంత వరకు పశువులకు గోరువెచ్చటి నీటిని అందించగలిగితే మంచిది. శీతాకాలంలో నీటిని పశువు తక్కువగా తాగినట్లయితే, మేత ద్వారా లభ్యమయ్యే ఘన పదార్థాన్ని తక్కువగా మేయడం, తద్వారా పాల దిగుబడి తగ్గిపోవడం జరుగుతుంది.
7. వయస్సు మళ్లిన పశువులు, దూడలు, వ్యాధి బారిన పడిన పశువులు ఎక్కువగా ఈ కోల్డ్ స్ట్రెస్ బారిన పడుతుంటాయి. వీటిని జాగ్రత్తగా గమనించవలసి ఉంటుంది.
8. పాలు తీసిన తర్వాత పశువుల చనులను శుభ్రంగా తుడిచి, ఆరబెట్టి మందలోకి వదలాలి. లేకపోతే 'ఫ్రాస్ట్ బైట్' అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా శీతాకాలంలో కొన్ని సూచనలు పాటించవలసిన అవసరముంది.

**– డా. ఎం.వి.ఎ.ఎన్. సూర్యనారాయణ**
(99485 90506), ప్రొఫెసర్–అధిపతి,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్,
కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, తిరుపతి




# ఒక ఇంటిపైన పచ్చధనం మూడు ఇళ్లలో ఆరోగ్య సిరులు!

**ఇద్దరు కుమారుల కుటుంబాలకూ సేంద్రియ ఇంటిపంటలు పండించి ఇస్తున్న తల్లి**



• ఇంటిపంటలను చూపుతున్న హరిప్రియ

కూరగాయలు, ఆకుకూరల సాగులో వాడే రసాయనిక ఎరువులు, పురుగుమందుల దుష్ప్రభావం ఆరోగ్యంపై ఎంత ఎక్కువగా ఉంటున్నదీ తెలిసివస్తున్నకొద్దీ ఆర్గానిక్ ఆహారంపై ఆకర్షితులవుతున్న నగరవాసుల సంఖ్య పెరుగుతోంది. తమ ఇళ్లపైన ఖాళీల్లో కుండీలు, మడులు పెట్టుకొని, తమ తీరిక సమయాన్ని ఆరోగ్యదాయకమైన సేంద్రియ ఇంటిపంటలు పండించుకోవడానికి గృహిణులు మొగ్గు చూపుతూ ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తున్నారు. గుంటూరు జెకేసీ కాలేజీరోడ్డులోని విజయపురి కాలనీకి చెందిన గృహిణి మున్నంగి హరిప్రియ ఈ కోవకు చెందిన వారే. శిక్షణ పొంది మరీ ఇంటిపంటలను విజయవంతంగా సాగు చేస్తూ మంచి దిగుబడులు పొందుతున్నారు. తాము తినటంతోపాటు ఇద్దరు కుమారుల కుటుంబాలకూ సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలను అందిస్తుండటం విశేషం.

మూడు మడులు, మూడు వరలతోపాటు అనేక ప్లాస్టిక్ తొట్లలో రకరకాల మొక్కలు నాటారు. సేంద్రియ కూరగాయల సాగు సంతృప్తినివ్వడంతో పాటు, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆమె ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నల్లమట్టిలో ఘనజీవామృతం, వర్మీ కంపోస్టు, ఇసుక, వేపపిండి, కొబ్బరి పొట్టు కలిపి మడులు, వరలు, ప్లాస్టిక్ తొట్లలో నింపి మొక్కలు విత్తినట్లు చెప్పారు. ఆవు పంచకం, పుల్ల మజ్జిగ, అల్లంవెల్లుల్లి ద్రావణం, బూడిద, పసుపు చల్లటం ద్వారా చీడపీడలను నివారిస్తున్నట్లు ఆమె వివరించారు.

సొర, బీర, కాకర, అలసంద, పొట్ల వంటి పాదులతోపాటు.. టమోట, వంగ, బెండ, మిర్చి, తోటకూర, మెంతికూర, పాలకూర, బచ్చలి కూర పండించుకుంటున్నారు. కిచెన్ గార్డెన్‌లో సీతాకోకచిలుకలు, తేనెటీగలు తిరుగాడుతూ పరపరాగ సంపర్కం బాగా జరిగి మంచి దిగుబడులు రావాలంటే పూల మొక్కలను కూడా పెంచుకోవాలి. ఈ దృష్టితోనే హరిప్రియ గులాబి, మందార, పారిజాతం, సెంటుమల్లి, బోగన్‌విలా, గన్నేరు, నందివర్ధనం, మల్లెలు, వంటి పూల మొక్కలను కూడా నాటారు.

కూరగాయలు కొనే అవసరం లేకుండానే హాయిగా ఆరోగ్యదాయకమైన కూరలు తినగలుగుతున్నామన్నారు. తమ ఇద్దరు కుమారుల కుటుంబాలకు కూడా కూరగాయలు పంపుతున్నామని, పూలు కూడా కొనకుండా సరిపోతున్నాయన్నారు సంబరంగా.

**– ఓబులరెడ్డి వెంకట్రామిరెడ్డి,**
సాక్షి, అమరావతి బ్యూరో, గుంటూరు
ఫొటోలు: **గజ్జల రామగోపాలరెడ్డి,**
స్టాఫ్ ఫొటోగ్రాఫర్

### రోజుకు 2 గంటల పనితో సంతోషం!



నాకు వ్యవసాయం అంటే మొదటి నుంచి మక్కువ. ప్రస్తుతంమార్కెట్‌లో అమ్ముతున్న కూరగాయల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడుతున్నారు. దీని ప్రభావం ఆరోగ్యంపై కనిపిస్తున్నది. సేంద్రియ ఇంటిపంటల సాగులో శిక్షణ పొందిన తరువాత రూఫ్‌పైనే రూ. 50 వేల ఖర్చుతో మడులు, వరలతో తోట తయారు చేసుకున్నాను. విత్తనాలు తెచ్చుకొని నారు పోసి మొక్కలు నాటుతున్నాను. పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో వీటిని పండిస్తున్నాను. వంటింటి వ్యర్థాలు, రాలిన ఆకులు, రెమ్మలతో నేనే వర్మీ కంపోస్టు తయారు చేసుకుంటున్నాను. గో పంచకం మా తమ్ముని దగ్గర నుంచి తెచ్చుకొంటున్నాను. తోటపనిలో రోజూ రెండు గంటలు పాదులు సరిచేసుకుంటూ, నీరు పెట్టుకుంటూ సంతోషంగా ఉన్నాను. తోట నాకు ఆరోగ్యంతోపాటు అనందాన్ని కూడా అందిస్తున్నది. నాకు తెలిసినంతలో ఇతరులకూ సలహాలు ఇస్తూ ఇంటిపంటల సాగును ప్రోత్సహిస్తున్నాను.

**– మున్నంగి హరిప్రియ**
(98493 46517), జెకేసీ కాలేజ్ రోడ్డు,
విజయపురి కాలనీ, గుంటూరు



epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్థయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
మంగళవారం
3-12-2019



**పదో తరగతి ప్రత్యేకం**

**పదోతరగతి.. ప్రతి విద్యార్థి జీవితంలో కీలక మలుపు! పదో తరగతిలో సాధించిన మార్కులు విద్యార్థి గమ్యాన్ని, గమనాన్ని నిర్దేశిస్తాయి. టెన్త్‌క్లాస్ పబ్లిక్ పరీక్షలకు ఇంకా దాదాపు 4 నెలల సమయం ఉంది. కానీ, టాప్ పర్సంటైల్ సాధించాలంటే... ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం చదవడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో... పదోతరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా ముఖ్య సబ్జెక్టులకు సంబంధించిన దీర్ఘకాలిక ప్రిపరేషన్ ప్రణాళిక...**

# పదోతరగతి పరీక్షలు.. 10/10 రావాలంటే!

పదోతరగతిలో ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు కీలకంగా నిలుస్తాయి. ప్రతి సబ్జెక్టు నుంచి రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1 నలభై మార్కులకు, పేపర్ 2 నలభై మార్కులకు ఉంటుంది. ప్రతి సబ్జెక్టులో అంతర్గత మూల్యాంకనకు 20 మార్కులు కేటాయించారు. వీటిని నోట్ బుక్ రైటింగ్, ప్రాజెక్టు వర్క్, ల్యాబ్ రికార్డు మెయింటెన్స్ తదితరాల ఆధారంగా ప్రకటిస్తారు.

## ఇంగ్లిష్

**పేపర్ 1:** మొత్తం మూడు సెక్షన్‌ల నుంచి 29 ప్రశ్నలు అడుగుతారు. సెక్షన్-ఎలో 15 మార్కులకు రీడింగ్ కాంప్రహెన్షన్స్ ఇస్తారు. తొమ్మిది ఒక మార్కు ప్రశ్నలు, 3 రెండు మార్కుల ప్రశ్నలు అడుగుతారు. సెక్షన్-బి.. 10 మార్కులకు వొకాబ్యులరీ, గ్రామర్‌లపై ఉంటుంది. 5 ఒక మార్కు ప్రశ్నలు, 10 అర మార్కు ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-సి.. 15 మార్కులకు క్రియేటివ్ రైటింగ్, డిస్‌కోర్స్‌పై ఉంటుంది. ఇందులో ఒక పది మార్కుల ప్రశ్న, ఒక ఐదు మార్కుల ప్రశ్న ఇస్తారు.

**పేపర్ 2:** ఈ పేపర్ ప్యాట్రన్ పేపర్ 1 తరహాలోనే మూడు సెక్షన్‌లుగా ఉంటుంది. కాకపోతే ఈ పేపర్‌లో అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్‌లు, ఎడిటింగ్, ఎర్రర్ కరెక్షన్‌లు, డిస్‌కోర్స్‌లు పూర్తిగా బయట(అన్ నోన్‌గా) నుంచి ఇస్తారు.

### ప్రిపరేషన్ టిప్స్

- పేపర్ 1 పాఠ్యపుస్తకం ఆధారంగా ఉంటుంది. కాబట్టి విద్యార్థి టెక్స్ట్ బుక్‌ను ఆసాంతం చదవాలి. తద్వారా రీడింగ్ కాంప్రహెన్షన్‌లో మంచి మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. రెండు పేపర్లలో రీడింగ్ కాంప్రహెన్షన్స్ ప్రశ్నలకు సమాధానాలు రాసేటప్పుడు విద్యార్థులు ముందుగా సదరు ప్యాసేజ్‌లను జాగ్రత్తగా చదవాలి. అనంతరం ప్రశ్నను చదివి.. తర్వాత తిరిగి ప్యాసేజ్‌ను చదువుతూ సమాధానాలు గుర్తించాలి. ఒకటి, రెండు ప్రశ్నలకు సమాధానాలు ప్యాసేజ్‌లోనే ఉంటాయి. మిగిలిన ప్రశ్నలకు సొంతంగా సమాధానం (ఓపెన్ ఎండెడ్‌గా) రాయాల్సి ఉంటుంది.




- రెండు పేపర్లలో సెక్షన్-బి గ్రామర్‌పై ఉంటుంది. ఇందులో టెన్సెస్, రిపోర్టెడ్ స్పీచెస్, ఆక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, వెర్బ్ ఫామ్స్, వర్డ్ ఆర్డర్, కోఆర్డినేషన్ రూల్, కాంకర్డ్ రూల్, క్వశ్చన్ ట్యాగ్... ఇలా దేనిపైనైనా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించగలిగినప్పుడే ఈ సెక్షన్‌లో మంచి మార్కులు సాధించగలరు.
- సెక్షన్ సిలో మేజర్ డిస్‌కోర్స్‌కు చాయిస్ ఉంటుంది. ప్రతి డిస్‌కోర్స్‌కు కనీసం ఒక మోడల్‌ను ప్రాక్టీస్ చేయాలి. ఇంటర్వ్యూ, స్పీచ్, బయోగ్రాఫికల్ స్కెచ్ తదితరాలకు ఒక్కో మోడల్ చొప్పున ప్రాక్టీస్ చేయాలి. పేపర్1లో మైనర్ డిస్‌కోర్స్‌కు సంబంధించి మెసేజ్, నోటీస్, డైరీలలో ఒకటి; పేపర్ 2లో పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్‌ల్లో నుంచి ఒకటి వస్తుంది. మైనర్ డిస్‌కోర్స్‌ను సింగిల్ పేజీలో రాస్తే సరిపోతుంది. మేజర్ డిస్‌కోర్స్‌ను ఐదు పేజీల్లో రాయాలి. వీటిని రాసేటప్పుడు ఆయా డిస్‌కోర్స్ ఫీచర్స్‌ను ఫాలో అవ్వాలి.

## గణితశాస్త్రం

ఇందులో పేపర్-1, 2 లల్లో రెండు పేపర్లలోనూ పార్ట్ ఎ, పార్ట్ బి ఉంటాయి. ప్రతి పేపర్ 40 మార్కులకు ఉంటుంది. పార్ట్ ఎలో 35 మార్కులకు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటే.. పార్ట్ బి.. 5 మార్కులకు మల్టిపుల్ చాయిస్ (బిట్ పేపర్) విధానంలో ఉంటుంది.

**పార్ట్ ఎ:** మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ 1లో ఏడు ఒక మార్కు ప్రశ్నలు ఇస్తారు, సెక్షన్ 2లో ఆరు రెండు మార్కుల ప్రశ్నలు ఇస్తారు. ఈ రెండు సెక్షన్స్‌లో ఎలాంటి చాయిస్ ఉండదు. కానీ సెక్షన్ 3లో అంతర్గత చాయిస్ ఉంటుంది. ఇందులో నాలుగు మార్కుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

**పార్ట్ బి (బిట్ పేపర్):** మొత్తం 10 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు అర మార్కు ఉంటుంది.

### పేపర్ 1

- మొదటి ఏడు చాప్టర్లు పేపర్ 1లో ఉంటాయి. వాస్తవ సంఖ్యలు పాఠ్యాంశంలో యూక్లిడ్ భాగహార న్యాయం, ప్రధాన కారణాంకాల లబ్ధం, కరణీయ సంఖ్యలు, సంవర్గమానాలు, ప్రధాన సంఖ్యలపై ప్రశ్నలు వస్తాయి. సమితులు పాఠ్యాంశంలో తక్కువ భావనలు ఉంటాయి. దీంతో ఈ చాప్టర్‌లో ఎక్కువ స్కోరు చేసేందుకు అవకాశం ఉంటుంది. సమితి రూపం, ఉపసమితి, శూన్యసమితి, సమితుల ఛేదనం, సమ్మేళనం, బేధం తదితరాలపై దృష్టిపెట్టాలి.




- బహుపదుల పాఠ్యాంశంలో బహుపదులు కనుగొనడం, బహుపది రేఖాచిత్రాలు, బహుపది శూన్యాలు, గుణకాల మధ్య సంబంధం, బహుపదుల భాగహారం తదితరాలపై దృష్టిపెట్టాలి. రెండు చలరాశులలో రేఖీయ సమీకరణాల జత పాఠ్యాంశంలో ఏదైనా సమస్యను ఇచ్చి రేఖీయ సమీకరణాల జతగా రాయమని అడుగుతారు. ఈ చాప్టర్‌లో మంచి మార్కులు సాధించాలంటే గుణకాలపై పట్టు సాధించడం తప్పనిసరి.
- వర్గసమీకరణాల పాఠ్యాంశంలో వర్గసమీకరణాల మూలాలు కనుగొనడంపై దృష్టిపెట్టాలి. శ్రేఢులు చాప్టర్‌లో ఇచ్చిన శ్రేఢిని గుర్తించడం, అంక, గుణ శ్రేఢులలో ఎన్ వ పదం కనుగొనడంపై దృష్టిపెట్టాలి. నిరూపక జ్యామితి పాఠ్యాంశంలో ఎక్కువ సూత్రాలు ఉంటాయి. కాబట్టి సూత్రాలను కంఠస్థం చేయాలి. ఇందులో రెండు బిందువుల మధ్య దూరం కనుగొనడంపై తప్పనిసరిగా ప్రశ్న వస్తుంది.

### పేపర్ 2

- ఈ పేపర్‌లో సరూప త్రిభుజాలు చాప్టర్‌లో నిర్వచనాలు, ఉదాహరణలు, సరూప త్రిభుజ ధర్మాలపై దృష్టిపెట్టాలి. వృత్తానికి స్పర్శరేఖలు-ఛేదన రేఖలు పాఠ్యాంశంలో వృత్తానికి బాహ్య బిందువు నుంచి గీచిన స్పర్శ రేఖ, అల్ప, అధిక వృత్త ఖండముల వైశాల్యాలు, సిద్ధాంతాలు కీలకం. త్రికోణమితి చాప్టర్‌లో త్రికోణమితి నిష్పత్తులు, వాటి మధ్య సంబంధం, త్రికోణమితీయ సర్వసమీకరణ నిరూపణలు-అనువర్తనాలు, పూరక కోణాల త్రికోణమితీయ నిష్పత్తులు తదితరాలు కీలకంగా నిలుస్తాయి. త్రికోణమితీయ అనువర్తనాల పాఠ్యాంశం నుంచి ఊర్ధ్వ, నిమ్న కోణాలు, ఎత్తులు-దూరాలకు సంబంధించిన సమస్యలు తదితరాలపై ప్రశ్నలు వస్తాయి.
- సంభావ్యత పాఠ్యాంశంలో సంభావ్యత భావన, నిర్వచనం, సులభమైన సమస్యలు-నిత్యజీవిత సంఘటనలతో అన్వయం, పూరక ఘటనలు తదితరాలు కీలకంగా ఉంటాయి. పాచికలకు సంబంధించిన ప్రశ్నలను బాగాప్రాక్టీస్ చేయాలి.
- క్షేత్రమితి పాఠ్యాంశంలో ఉపరితల వైశాల్యాలు, ఘనపరిమాణాలు, ఘనాకృతలకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. సంఖ్యాక శాస్త్రంలో మధ్యగతము, బాహుళకము, సగటు, ఓజివ్ వక్రాలను ఉపయోగించి విలువలు కనుగొనడంపై దృష్టిపెట్టాలి.

## జనరల్ సైన్స్

### భౌతిక రసాయన శాస్త్రం (పేపర్ 1)

భౌతిక రసాయన శాస్త్రంలో మొత్తం 12 చాప్టర్లు ఉన్నాయి.నిర్దేశించిన ఆరు రకాల విద్యాప్రమాణాల



ఆధారంగా ప్రిపరేషన్ సాగిస్తే.. జనరల్ సైన్స్‌లోని రెండు పేపర్లలోనూ మంచి మార్కులు పొందవచ్చు.

### విషయావగాహన

ఈ విద్యాప్రమాణం కింద ఇటీవల కాలంలో.. ఏమిటి? నిర్వచించండి? తరహా ప్రశ్నలు అడగట్లేదు. ఉదాహరణలు ఇవ్వండి, కారణాలు తెలపండి, పోలికలు, భేదాలను తెలపండి, భావనలను సొంత మాటల్లో రాయండి, లెక్కలు గణించండి తరహా ప్రశ్నలు అడుగుతున్నారు. వీటికి ఉదాహరణగా సమయోజనీయ పదార్థాలకు రెండు ఉదాహరణలు ఇవ్వండి? పుటాకార, కుంబాకార దర్పణాలకు మధ్య పోలికలు తెలపండి? బోర్ పరమాణు నమూనాకు పరిమితులు తెలపండి? తదితరాలను పేర్కొనవచ్చు.

### పరికల్పనలు చేయడం

ప్రస్తుతం ప్రశ్నించడంపై ఎలాంటి ప్రశ్నలు అడగట్లేదు. తార్కిక కారణం ఆధారంగా ప్రయోగానికి ముందు మనం చేసే ఊహనే పరికల్పన అంటారు. ఒక సహజ దృగ్విషయం, ఆవిష్కరణను పేర్కొని.. అది జరగకపోయుంటే మానవ జీవితం ఎలా ఉండేది అనే ప్రశ్న అడుగుతారు. దీంతోపాటు ప్రయోగ నిర్వహణలో మీరు చేసిన పరికల్పనలను తెలపమంటారు.

### ప్రయోగ నైపుణ్యాలు - క్షేత్ర పరిశీలనలు

ప్రయోగ ఉద్దేశం, ప్రయోగానికి కావాల్సిన పరికరాలు, ప్రయోగ పరికరాల అమరిక, ప్రయోగ నిర్వహణ విధానాల గురించి తెలుసుకోవాలి. ఈ విద్యాప్రమాణంలో అడిగే ప్రశ్నలకు మాదిరి ప్రశ్నలుగా అయర్‌స్టెడ్ ప్రయోగ ఉద్దేశాన్ని తెలపండి? ఓమ్ నియమాన్ని సరిచూసే ప్రయోగంలో పరికరాల అమరిక విధానాన్ని తెలపండి? తదితరాలను పేర్కొనవచ్చు.

### సమాచార నైపుణ్యాలు - ప్రాజెక్టు పనులు

పట్టికలు, గ్రాఫ్‌లు, ఫ్లోచార్టులు, పేరాగ్రాఫ్‌ల రూపంలో ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించి.. సదరు సమాచారం కింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. వీటికి ఉదాహరణగా.. ఇచ్చిన సమాచారం ప్రకారం ప్రయోగంలో వాడిన దర్పణం ఏది?, వస్తువును 90 సెంటీమీటర్ల దూరంలో ఉంచినప్పుడు ప్రతిబింబం ఎక్కడ ఏర్పడుతుంది? తదితరాలను పేర్కొనవచ్చు.

### బొమ్మల ద్వారా భావ ప్రసారం

బొమ్మలు గీసి భాగాలను గుర్తించడం, బొమ్మను పూర్తి చేయడం, బొమ్మలో జరుగుతున్న పరిస్థితిని వివరించడం, ఇచ్చిన సందర్భానికి బొమ్మను గీయడం తదితర కృత్యాలపై ప్రశ్నలు అడుగుతారు. ఉదాహరణకు.. రేఖీయ నిర్మాణం గల అణువు పటం గీయండి?

### నిజ జీవిత వినియోగం-అనువర్తనాలు

వివిధ ప్రక్రియలు-నిత్య జీవిత అనువర్తనాలు, వివిధ పదార్థాల నిత్యజీవిత వినియోగం, వివిధ పరికరాల ఉపయోగాల గురించి ప్రశ్నలు వస్తాయి. **ఉదా:** ఆమ్లాలను నిత్య జీవితంలో ఏయే సందర్భాల్లో వినియోగిస్తారు? ఫ్యూజ్ ఉపయోగాలు? తదితరం.

## జీవశాస్త్రం (పేపర్ 2)



**పార్ట్ ఎ:** మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ 1లో 7 ఒక మార్కు ప్రశ్నలు, సెక్షన్ 2లో 6 రెండు మార్కుల ప్రశ్నలు, సెక్షన్ 3లో 4 నాలుగు మార్కుల ప్రశ్నలు ఇస్తారు.

**పార్ట్ బి:** ఇది బిట్ పేపర్. మొత్తం 10 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు అర మార్క్ ఉంటుంది.

- జీవశాస్త్రంలో మొత్తం 10పాఠ్యాంశాలు ఉన్నాయి. విద్యాప్రమాణాల (ఆరు) ఆధారంగా ఆయా చాప్టర్లను ప్రిపేరయితే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. పోషణ పాఠ్యాంశంలో జీవక్రియలు, కిరణజన్య సంయోగక్రియ, జీవుల్లో పోషణ, మానవునిలో జీర్ణవ్యవస్థ, పోషకాహార లోపం తదితరాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. శ్వాసక్రియ పాఠ్యాంశంలో శ్వాసక్రియలో పాల్గొనే వాయువుల ఆవిష్కరణ, మానవునిలో శ్వాసక్రియా విధానం, కణశ్వాస క్రియ, మొక్కల్లో శ్వాసక్రియ, ప్రసరణ-పదార్థ రవాణా వ్యవస్థ పాఠ్యాంశంలో గుండె అంతర్నిర్మాణం, హార్థిక వలయం, రక్తపీడనం, రక్తస్కంధనం, మొక్కల్లో పదార్థాల రవాణాలపై దృష్టిపెట్టాలి. విసర్జన-వ్యర్థాల తొలగింపు పాఠ్యాంశంలో మానవునిలో విసర్జన, మానవ విసర్జక వ్యవస్థ, నెఫ్రాన్ నిర్మాణం, మూత్రం ఏర్పడే విధానం, మూత్రనాళికలు, మూత్రాశయం, డయాలసిస్, మొక్కల్లో విసర్జన తదితరాలను అధ్యయనం చేయాలి.
- నియంత్రణ-సమన్వయ వ్యవస్థ పాఠ్యాంశంలో ఉద్దీపన-ప్రతిస్పందన, సమీకృత వ్యవస్థలు-నాడీ సమన్వయం, ప్రచోదన, ప్రతిస్పందన మార్గాలు, కేంద్రనాడీ వ్యవస్థ, స్వయంచోధిత నాడీ వ్యవస్థ, మొక్కల్లో నియంత్రణ-ఫైటో హార్మోన్లు కీలక అంశాలుగా ఉంటాయి. ప్రత్యుత్పత్తి-పునరుత్పాదకత వ్యవస్థ పాఠ్యాంశంలో అలైంగిక ప్రత్యుత్పత్తి, శాఖీయ ఉత్పత్తి, లైంగిక ప్రత్యుత్పత్తి, మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తి, కణ విభజన, ప్రత్యుత్పత్తి-ఆరోగ్యం(హెచ్ఐవీ,ఎయిడ్స్) అంశాలను అధ్యయనం చేయాలి. జీవక్రియలో సమన్వయం చాప్టర్‌లో ఆకలి, రుచి, వాసన, నోరు, ఆహారవాహికలో ఆహార ప్రయాణం, జీర్ణాశయం తదితరాల గురించి తెలుసుకోవాలి. అనువంశికత పాఠ్యాంశంలో కొత్త లక్షణాలు-వైవిధ్యాలు, మెండల్ ప్రయోగాలు, పర్యావరణం-మన బాధ్యత పాఠ్యాంశంలో ఆవరణ వ్యవస్థ-ఆహారపు గొలుసు, మానవ కార్యకలాపాలు-ఆవరణ వ్యవస్థ, జైవిక పద్ధతులు, జైవిక నియంత్రణ, సహజవనరుల పాఠ్యాంశంలో కేస్ స్టడీస్ వ్యవసాయ భూమి (పూర్వం-ప్రస్తుతం) నీటి నిర్వహణ, మన చుట్టూ ఉండే సహజవనరులు, శిలాజ ఇంధనాలు, సంరక్షణలపై దృష్టిపెట్టాలి.

**ఇన్‌పుట్స్**
- » ఇంగ్లిష్: డి.హనుమంతరావు
- » మ్యాథ్స్: సి.జయప్రకాశ్ రెడ్డి
- » ఫిజిక్స్: ఎ.నాగరాజశేఖర్
- » జీవశాస్త్రం: టి.శివప్రసాద్

# విద్య, ఉద్యోగ సమాచారం

## టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్-ప్రవేశాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్).. 2020-21కి గాను రాష్ట్రంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
- ✦ ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలు 2020-21.
- ✦ **అర్హత:** మార్చి-2020లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ఎస్టీ (బాలురు, బాలికలు) విద్యార్థులు అర్హులు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ✦ **వయసు:** 2020, ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు.
- ✦ **ఎంపిక:** లెవల్-1, లెవల్-2 ప్రవేశ పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 20, 2019.
- ✦ **పరీక్షతేదీలు:** లెవల్-1 పరీక్షతేదీ: జనవరి 12, 2020; లెవల్-2 పరీక్ష తేదీ: ఫిబ్రవరి 16, 2020
- ✦ **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

## టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్-ప్రవేశాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్).. 2020-21కి గాను రాష్ట్రంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
- ✦ ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలు 2020-21.
- ✦ **అర్హత:** మార్చి-2020లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అర్హులు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ✦ **వయసు:** 2020, ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు.
- ✦ **ఎంపిక:** లెవల్-1, లెవల్-2 ప్రవేశ పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 20, 2019.
- ✦ **పరీక్షతేదీలు:** లెవల్-1 పరీక్షతేదీ: జనవరి 5, 2020; లెవల్-2 పరీక్ష తేదీ: ఫిబ్రవరి 9, 2020.
- ✦ **వెబ్‌సైట్:** www.tswreis.in

## ఐడీబీఐ-61

ముంబై ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ).. 61 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ (ఎస్‌సీఓ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **విభాగాల వారీ ఖాళీలు:** డీజీఎం-2, ఏజీఎం-5, మేనేజర్-54.
- ✦ **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, సీఏ/ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- ✦ **వయసు:** పోస్టులను బట్టి 25-45 ఏళ్ల మధ్య ఉండాలి.
- ✦ **ఎంపిక:** ప్రిలిమినరీ స్క్రీనింగ్, గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు ఫీజు:** రూ.700 (ఎస్సీ, ఎస్టీలకు రూ.150; పీడబ్ల్యూడీలకు ఉచితం).
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 12, 2019.
- ✦ **వెబ్‌సైట్:** www.idbibank.in

## డబ్ల్యూసీడీ (అనంతపురం)-329

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ అనంతపురం జిల్లాలోని 8 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 329 అంగన్వాడీ పోస్టుల భర్తీకి వివాహితులైన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **విభాగాల వారీ ఖాళీలు:** అంగన్వాడీ వర్కర్లు-55, మినీ అంగన్వాడీ వర్కర్లు-18, అంగన్వాడీ సహాయకులు-256.
- ✦ **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై.. అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామంలో స్థానికులై ఉండాలి.
- ✦ **వయసు:** 2019, జులై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల్లో 21 ఏళ్లు నిండిన వారు లేనిచో 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు).
- ✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 8, 2019.
- ✦ **వెబ్‌సైట్:** https://ananthapuramu.ap.gov.in

## నిమ్‌హాన్స్-7

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **విభాగాల వారీ ఖాళీలు:** సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ (న్యూరోవైరాలజీ)-2; క్లినికల్ సైకాలజిస్ట్-5.
- ✦ **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంఏ/ఎంఎస్సీ, ఎండీ/పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- ✦ **ఎంపిక:** పోస్టును బట్టి రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 18, 2019.
- ✦ **వెబ్‌సైట్:** http://nimhans.ac.in

## డబ్ల్యూసీడీ (కృష్ణా)-8

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన కృష్ణా జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ విజయవాడలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన పని చేయుటకు 8 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ **విభాగాల వారీ ఖాళీలు:** సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ (ఉమెన్)-1, కేస్ వర్కర్ (ఉమెన్)-1, లాయర్-1, కౌన్సెలర్ (ఉమెన్)-1, ఐటీ స్టాఫ్-1, మల్టీ పర్పస్ హెల్పర్-8.
- ✦ **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, డిప్లొమాతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- ✦ **వయసు:** 2019, జులై 1 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి.
- ✦ **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 5, 2019.
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 20, 2019.
- ✦ **వెబ్‌సైట్:** https://krishna.ap.gov.in

## ప్రవేశాలు

### నీట్ యూజీ- 2020

దేశంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (యూజీ)నీట్ -2020కు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

✦ నీట్ యూజీ 2020ని మొత్తం 11 భాషల్లో (హిందీ, ఇంగ్లిష్‌తో కలిపి) నిర్వహించనున్నారు. ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బయాలజీ (బోటనీ అండ్ జువాలజీ) నుంచి మొత్తం 180 ప్రశ్నలకు గాను 180 మార్కులకు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

✦ **అర్హతలు:** ఇంటర్మీడియట్ బైపీసీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి. డిసెంబర్ 31 నాటికి 17 ఏళ్లు నిండి.. 25 ఏళ్లకు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 5 ఏళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది.

✦ **దరఖాస్తు ఫీజు:** జనరల్ కేటగిరి అభ్యర్థులకు రూ.1500, జనరల్ ఈడబ్ల్యుఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.800ల దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

**ముఖ్యమైన సమాచారం**
- ✦ **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ✦ **పరీక్ష విధానం:** ఆఫ్‌లైన్ (పెన్ అండ్ పేపర్) విధానంలో పరీక్ష జరుగుతుంది
- ✦ **దరఖాస్తుల ప్రారంభతేదీ:** డిసెంబర్ 2, 2019
- ✦ **దరఖాస్తుల ముగింపు తేదీ:** డిసెంబర్ 31
- ✦ **పరీక్ష తేదీ:** మే 3, 2020
- ✦ **ఫలితాలు:** జూన్ 4, 2020
- ✦ **వెబ్‌సైట్:** www.ntaneet.nic.in

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
3-12-2019

## అంజలి 2.1-2-0-6



అంతర్జాతీయ మహిళల టి20 క్రికెట్‌లో నేపాల్ జట్టు బౌలర్ అంజలీ చంద్ అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసి రికార్డు సృష్టించింది. దక్షిణాసియా క్రీడల్లో భాగంగా సోమవారం మాల్దీవులుతో జరిగిన టి20 మ్యాచ్‌లో ఆమె (6/0) పరుగైనా ఇవ్వకుండా 6 వికెట్లు తీసి చరిత్రకెక్కింది. ఈ ఏడాది జనవరిలో చైనాతో జరిగిన పోరులో మలేసియా బౌలర్ మాస్ ఎలిసా (6/3) నెలకొల్పిన రికార్డును అంజలి సవరించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మాల్దీవులు జట్టు అంజలి ధాటికి 10.1 ఓవర్లలో 16 పరుగులకు ఆలౌటవ్వగా... నేపాల్ 5 బంతుల్లో వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసి గెలిచింది.

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు గత ఆగస్టులో ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. అయితే ఆ తర్వాత ఆమె గెలుపు గ్రాఫ్ అనూహ్యంగా పడిపోయింది. చైనా–1000, కొరియా, డెన్మార్క్, ఫ్రెంచ్, చైనా–750, హాంకాంగ్... ఇలా వరుసగా ఆరు టోర్నీల్లో ఆమె విఫలమైంది. కనీసం ఒక్కదాంట్లోనూ సింధు సెమీస్ కూడా చేరలేకపోయింది. అయితే ఈ పరాజయాల పరంపరకు అడ్డుకట్ట వేస్తూ 2019ని ఘనంగా ముగించాలని ఆమె పట్టుదలగా ఉంది. ప్రతిష్టాత్మకమైన బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో విజయం సాధించేందుకు సింధు శ్రమిస్తోంది.

# విజయంతో ముగిస్తా!



**ఇటీవలి ఓటములు స్వయంకృతం**

**ప్రపంచ చాంపియన్‌గా ఒత్తిడి లేదు**

**'సాక్షి'తో పీవీ సింధు**

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) టూర్ ఫైనల్స్‌లో సింధు డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. గత ఏడాది చైనాలోని గ్వాంగ్‌జౌలో జరిగిన టోర్నీలో ఆమె విజేతగా నిలిచింది. అదే వేదికపై ఈ సారి డిసెంబర్ 11 నుంచి ఈ టోర్నీ జరగనుంది. వరుస వైఫల్యాలతో పాయింట్లపరంగా వెనుకబడినా... ప్రపంచ చాంపియన్ హోదాలో సింధు నేరుగా ఈ ఈవెంట్‌కు అర్హత సాధించింది. ఇటీవలి పరాజయాలతో తన ఆత్మ స్థయిర్యం దెబ్బ తినలేదని, మళ్లీ పట్టుదలగా ఆడి పెద్ద విజయం సాధిస్తానని సింధు చెబుతోంది. 'సాక్షి'కి సింధు ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు ఆమె మాటల్లోనే...

వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు సన్నాహాలు బాగా సాగుతున్నాయి. గత టోర్నీ తర్వాత రెండు వారాలకు పైగా సమయం లభించింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. నా ఆటలో కనిపించిన కొన్ని లోపాలు, తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నంలో ఉన్నా. మహిళా సింగిల్స్ కోచ్ కిమ్ జి హ్యూన్ వెళ్లిపోయిన తర్వాత మరో కొరియా కోచ్ పార్క్ కూడా నా శిక్షణలో ప్రత్యేక సహకారం అందిస్తున్నారు. ఫైనల్స్ టోర్నీలో ఎప్పుడైనా గట్టి పోటీ ఉంటుంది. అగ్రశ్రేణి షట్లర్లు మాత్రమే ఉంటారు కాబట్టి ప్రతీ మ్యాచ్ కీలకమే.

ప్రపంచ చాంపియన్‌ను అనే ఆత్మవిశ్వాసం మంచిదే కానీ అది అతి విశ్వాసంగా మారిపోవద్దు. ప్రతీసారి ఆట మారిపోతుంది కాబట్టి కొత్త వ్యూహాలతో బరిలోకి దిగాల్సిందే. మన బలహీనతలను లక్ష్యంగా చేసుకొని ప్రత్యర్థులు సిద్ధమై వస్తారు కాబట్టి నేను కూడా అదే స్థాయిలో సన్నద్ధం కావాల్సిందే. ఉదాహరణకు నా బలం స్మాష్. ఆ షాట్‌ను నేను సమర్థంగా వాడాలి. అది సరిగా పని చేయకపోతే కష్టం.

వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత నా ప్రదర్శన బాగా లేదనేది వాస్తవం. అందులో ఎక్కువ భాగం ప్రత్యర్థి బలంకంటే నా స్వయంకృతమే ఉంది. సునాయాసంగా పాయింట్లు రావాల్సిన చోట కూడా నేను కోల్పోయాను. ఇక్కడ నేను అనుకున్న స్ట్రోక్‌లు విఫలం కావడంతో ప్రత్యర్థులు మానసికంగా పైచేయి సాధించారు. ఆ సమయంలో కొంత ఆత్మ రక్షణలో పడిపోతాం. అదే వరుసలో పరాజయాలు వచ్చాయి. ఆటలో గెలుపోటములు సహజమే కానీ వరల్డ్ చాంపియన్ కావడంతో కొంత ఉదాసీనత కారణంగా ఓడానంటే మాత్రం అంగీకరించను.

ఇటీవలి పరాజయాలతో నేను నిరాశ చెందిన మాట వాస్తవమే కానీ వాటితో నా ఆత్మ విశ్వాసం దెబ్బ తినదు. ఎందుకంటే నేను ఎప్పుడో అలాంటి దశను దాటి వచ్చేశాను. ఇలాంటి ఓటములతో కుంగిపోతే కష్టం. నేను మరింత నిలకడగా రాణించాల్సిన అవసరం ఉంది. ఎన్ని గెలిచినా మన ఆటను మెరుగుపర్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉండాలి. ఫైనల్స్‌లో టైటిల్ నిలబెట్టుకోగలననే నమ్మకం ఉంది.

వరల్డ్ చాంపియన్‌షిప్ నుంచి ఇప్పటి వరకు నా ఆటకు సంబంధించి వీడియోలు చూసి కోచ్‌లతో ఎన్నో విషయాలు చర్చించాను. వాటిని సరిగ్గా విశ్లేషిస్తూ వరల్డ్ టూర్ ఫైనల్స్‌పై దృష్టి పెట్టాను. ఇక కొంత మంది అనామక ప్లేయర్ల చేతిలో ఓడిపోవడం చాలా మంది అదోలా చూస్తున్నారు. కానీ నేను కూడా కెరీర్ ఆరంభంలో అలాంటి సంచలన విజయాలు సాధించినదాన్నే కదా. ఆ అమ్మాయిలు కూడా ఎంతో కష్టపడుతున్నారు. కాబట్టి వారికి అనుకూలంగా ఫలితం దక్కింది.

> "సింధులాంటి అత్యుత్తమ స్థాయి ప్లేయర్లు మళ్లీ కోలుకొని చెలరేగడం పెద్ద సమస్య కాదు. టోర్నీల షెడ్యూలింగ్ కఠినంగా ఉండటం కూడా ఆమె ఓటమికి కారణాల్లో ఒకటిగా భావిస్తున్నా. ఓడినా కూడా కొన్ని మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. గత రెండు నెలలు సింధుకు కలిసి రాలేదు కానీ ఇప్పుడు ఆమె చేస్తున్న కఠోర సాధనను బట్టి చూస్తే మళ్లీ తన స్థాయి విజయం సాధిస్తుందని నమ్ముతున్నా."
>
> – పుల్లెల గోపీచంద్, భారత చీఫ్ కోచ్



# తిలక్ వర్మకు చోటు

**అండర్–19 ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన ● కెప్టెన్‌గా ప్రియమ్ గార్గ్**



తిలక్ వర్మ

**ముంబై:** గత కొంత కాలంగా భారత యూత్ జట్టు సభ్యుడిగా నిలకడగా రాణిస్తున్న హైదరాబాద్ బ్యాట్స్‌మన్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మకు మరో అరుదైన అవకాశం లభించింది. వచ్చే నెలలో జరిగే అండర్–19 ప్రపంచ కప్‌లో పాల్గొనే భారత జట్టులోకి అతను ఎంపికయ్యాడు. 2018–19 సీజన్ కూచ్‌బెహార్ ట్రోఫీలో తిలక్ 6 మ్యాచ్‌లలో 86.56 సగటుతో 779 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఇందులో 4 సెంచరీలు, 3 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఆ తర్వాత వన్డే టోర్నీ వినూ మన్కడ్ ట్రోఫీలో కూడా 84.50 సగటుతో 8 మ్యాచ్‌లలో 507 పరుగులు సాధించాడు. ఈ ప్రదర్శనే అతను భారత అండర్–19 టీమ్‌లో రెగ్యులర్‌గా మారేందుకు కారణమైంది. ఇటీవల అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండు వన్డేల్లోనూ తిలక్ ఆడాడు. దక్షిణాఫ్రికాలో జనవరి 17 నుంచి ఫిబ్రవరి 9 వరకు వరల్డ్ కప్ జరుగుతుంది. ఇందు కోసం భారత జూనియర్ సెలక్షన్ కమిటీ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రియమ్ గార్గ్ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపిక కాగా... యూపీకే చెందిన ధ్రువ్ జురేల్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. యూపీ సీనియర్ జట్టులో ఇప్పటికే రెగ్యులర్ సభ్యుడిగా ఉన్న ప్రియమ్ 2018–19 రంజీ సీజన్‌లో 814 పరుగులతో సత్తా చాటాడు. విజయ్ హజారే ట్రోఫీలో డబుల్ సెంచరీ సహా అద్భుతమైన ప్రదర్శనతో చెలరేగుతున్న ముంబై ఆటగాడు యశస్వి జైస్వాల్ కూడా ప్రపంచ కప్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. అండర్–19 ప్రపంచ కప్‌లో 16 జట్లు పాల్గొంటాయి. నాలుగు గ్రూప్‌ల నుంచి రెండేసి జట్లు సూపర్ లీగ్ దశకు అర్హత సాధిస్తాయి. నాలుగు సార్లు (2000, 2008, 2012, 2018) అండర్–19 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత్ ఈ సారి గ్రూప్ 'ఎ'లో న్యూజిలాండ్, శ్రీలంక, జపాన్‌లతో కలిసి బరిలోకి దిగుతోంది.

**రక్షణ్‌కు చోటు...**

ప్రపంచ కప్‌కు ముందే భారత అండర్–19 జట్టు దక్షిణాఫ్రికా పర్యటన ప్రారంభమవుతుంది. ముందుగా సఫారీలతో భారత్ మూడు వన్డేల సిరీస్ ఆడుతుంది. ఆ తర్వాత ఈ రెండు జట్లతో పాటు న్యూజిలాండ్, జింబాబ్వే భాగంగా నాలుగు దేశాల వన్డే టోర్నీ కూడా జరుగుతుంది. ఈ సిరీస్‌ల కోసం సెలక్టర్లు అదనంగా మరో ఆటగాడిని ఎంపిక చేశారు. 16వ ఆటగాడిగా హైదరాబాద్‌కు చెందిన పేస్ బౌలర్ సీటీఎల్ రక్షణ్‌కు ఆ అవకాశం లభించింది. రక్షణ్ ఇటీవల అఫ్గానిస్తాన్‌తో మూడు వన్డేలు ఆడాడు.

**ప్రపంచ కప్‌లో పాల్గొనే**

**భారత అండర్-19 జట్టు**

ప్రియమ్ గార్గ్ (కెప్టెన్), ధ్రువ్ చంద్ జురేల్ (వైస్ కెప్టెన్), తిలక్ వర్మ (హైదరాబాద్), యశస్వి జైస్వాల్, అథర్వ అంకోలేకర్, దివ్యాంశ్ సక్సేనా, కార్తీక్ త్యాగి (ముంబై), శుభాంగ్ హెగ్డే, విద్యాధర్ పాటిల్ (కర్ణాటక), కుమార్ కుశాగ్ర, సుశాంత్ మిశ్రా (జార్ఖండ్), రవి బిష్ణోయ్, ఆకాశ్ సింగ్ (రాజస్తాన్), శాశ్వత్ రావత్ (బరోడా), దివ్యాంశ్ జోషి (మిజోరం).

## బ్యాడ్మింటన్‌లో డబుల్ ధమాకా

**భారత జట్లకు స్వర్ణాలు**



**పొఖారా (నేపాల్):** దక్షిణాసియా క్రీడల్లో తొలి రోజు భారత్‌కు ఐదు స్వర్ణాలు, ఎనిమిది రజతాలు, మూడు కాంస్య పతకాలు లభించాయి. బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల, మహిళల జట్లు టీమ్ విభాగంలో విజేతగా నిలిచి పసిడి పతకాలను సొంతం చేసుకున్నాయి. పురుషుల టీమ్ ఫైనల్లో భారత్ 3–1తో శ్రీలంకపై... మహిళల టీమ్ ఫైనల్లో భారత్ 3–0తో శ్రీలంకపై నెగ్గాయి. భారత్ తరఫున రెండు సింగిల్స్‌లో శ్రీకాంత్, సిరిల్ వర్మ గెలిచారు. డబుల్స్ మ్యాచ్‌లో అరుణ్ జార్జి–సాన్యమ్ శుక్లా జంట ఓడిపోగా... మరో డబుల్స్ మ్యాచ్‌లో గారగ కృష్ణ ప్రసాద్–ధ్రువ్ కపిల జంట నెగ్గడంతో భారత్‌కు స్వర్ణం ఖాయమైంది. భారత మహిళల జట్టు తరఫున రెండు సింగిల్స్‌లలో తెలుగమ్మాయిలు చుక్కా సాయి ఉత్తేజిత రావు, పుల్లెల గాయత్రి గెలుపొందగా... డబుల్స్ మ్యాచ్‌లో సిక్కి రెడ్డి–మేఘన జంట నెగ్గి పసిడి పతకాన్ని అందించారు. మరోవైపు పురుషుల ట్రయాథ్లాన్ వ్యక్తిగత విభాగంలో ఆదర్శ సినిమోల్ స్వర్ణం సాధించాడు. తైక్వాండోలో పురుషుల అండర్–29 పోమ్సె పెయిర్ ఈవెంట్‌లో, అండర్–23 పోమ్సె టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణాలు లభించాయి.

## 971 మంది క్రికెటర్లు

**ఐపీఎల్ వేలం కోసం పేర్లు నమోదు**

**ముంబై:** ఐపీఎల్–2020 కోసం జరిగే వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు 971 మంది క్రికెటర్లు ముందుకు వచ్చారు. తుది గడువు నవంబర్ 30లోగా వీరంతా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో 713 మంది భారత ఆటగాళ్లు కాగా, 258 మంది విదేశీయులు. భారత క్రికెటర్లలో 19 మంది జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించగా... 634 మంది ఎప్పుడూ టీమిండియా తరఫున ఆడలేదు. మరో 60 మంది కనీసం ఒక ఐపీఎల్ మ్యాచ్ అయినా ఆడినవారున్నారు. అయితే ఈ 971 మంది నుంచి తాము కోరుకుంటున్న ఆటగాళ్ల పేర్లను ఎనిమిది ఫ్రాంచైజీలు డిసెంబర్ 9లోగా సమర్పించాల్సి ఉంటుంది. ఆ జాబితాలో ఉన్న వారికే వేలంలో చోటు దక్కుతుంది. ఐపీఎల్‌లో ప్రస్తుతం గరిష్టంగా 73 మందిని మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంది. డిసెంబర్ 19న కోల్‌కతాలో వేలం నిర్వహిస్తారు.

**స్టార్క్ అవుట్:** ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మిషెల్ స్టార్క్ వరుసగా రెండో ఏడాది ఐపీఎల్‌కు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించాడు. అతను 2019 ఐపీఎల్‌లో ఆడలేదు. మరోవైపు ఏడుగురు విదేశీ క్రికెటర్లు రూ. 2 కోట్ల కనీస ధరతో వేలానికి సిద్ధపడుతున్నారు. ఈ జాబితాలో కమిన్స్, హాజల్‌వుడ్, లిన్, మిషెల్ మార్ష్, మ్యాక్స్‌వెల్, స్టెయిన్, మాథ్యూస్ ఉన్నారు. భారత్ తరఫున ఆడిన 19 మందిలో ఒక్కరు కూడా ఈ కనీస విలువలో తమ పేరు చేర్చకపోవడం విశేషం.

## రూట్ డబుల్ సెంచరీ



**హామిల్టన్:** మూడో రోజు సెంచరీతో అలరించిన ఇంగ్లండ్ సారథి జో రూట్ నాలుగో రోజు కూడా అదే జోరు కొనసాగిస్తూ కెరీర్‌లో మూడో డబుల్ సెంచరీ (441 బంతుల్లో 226; 22 ఫోర్లు, సిక్స్) సాధించాడు. ఫలితంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ తన తొలి ఇన్నింగ్స్‌లో 162.5 ఓవర్లలో 476 పరుగులకు ఆలౌటైంది. 101 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. విలియమ్సన్ (37 బ్యాటింగ్), టేలర్ (31 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



భారత క్రికెటర్, కర్ణాటక టి20 జట్టు కెప్టెన్ మనీశ్ పాండే ఓ ఇంటివాడయ్యాడు. ముంబైలో సోమవారం సినీ నటి ఆశ్రిత శెట్టిని మనీశ్ పాండే వివాహం చేసుకున్నాడు.

## ఆసీస్‌కు మళ్లీ ఇన్నింగ్స్ విజయం



**అడిలైడ్:** ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌లో పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా పరిపూర్ణ పాయింట్లు (120) సాధించింది. ఆఖరి టెస్టులో ఆసీస్ ఇన్నింగ్స్ 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. ఆఫ్‌స్పిన్నర్ నాథన్ లయన్ (5/69) తన స్పిన్ మాయాజాలంతో పాకిస్తాన్‌ను తిప్పేశాడు. దీంతో ఒకరోజు ముందుగానే మ్యాచ్ ముగిసింది. ఫాలోఆన్‌లో 39/3 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 239 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ షాన్ మసూద్ (68; 8 ఫోర్లు, 1 సిక్స్), అసద్ షఫీక్ (57; 5 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించారు. వీరు ఆడినంతసేపు బాగానే ఉన్నా... లయన్ వాళ్లిద్దర్నీ పెవిలియన్ చేర్చడంతో ఇన్నింగ్స్ ఇక ఎంతోసేపు సాగలేదు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్' అవార్డులు వార్నర్‌కే దక్కాయి.

**ఆసీస్ గడ్డపై పాక్ చెత్త రికార్డు...**

1999 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు ఆస్ట్రేలియాలో పర్యటించిన పాకిస్తాన్ ఒక్క మ్యాచ్ అయినా గెలవలేకపోయింది. ఇరు జట్ల మధ్య ఈ ఇరవై ఏళ్లలో ఆసీస్ గడ్డపై 14 టెస్టులు జరిగాయి. ఆ పద్నాలుగూ పాక్ ఓడింది. కనీసం 'డ్రా' అయినా చేసుకోలేకపోవడం గమనార్హం.

राष्ट्रीय परीक्षा एजेंसी
నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ
(నిర్ధారణలో ఉత్తమమైనది)
(उच्चतर शिक्षा विभाग, मानव संसाधन विकास मंत्रालय, भारत सरकार के तहत एक स्वायत्त संगठन)
(ఉన్నత విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ)

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (UG)-2020
[NEET (UG)-2020]

బహిరంగ ప్రకటన
(02 డిసెంబర్ 2019)

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) చే నిర్వహించబడే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (UG)-2020 [NEET (UG)-2020] కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుచున్నవి.
అన్ని విద్యాసంస్థలలో మరియు ఏదేని ఇతర చట్టం క్రింద నియంత్రించబడే వైద్య విద్యాసంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులలో ప్రవేశానికై కామన్ మరియు యూనిఫామ్ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (NEET) నిర్వహించుట కోసం నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం, 2019లోని సెక్షన్ 14 ఏర్పాటు చేస్తోంది. అందువలన AIIMS, న్యూఢిల్లీ, JIPMER మరియు అన్ని AIIMS తరహా విద్యాసంస్థలలో MBBS కోర్సులో ప్రవేశం కూడా NEET ద్వారా జరుగును.
NEET (UG)-2020 ఇంగ్లీష్ మరియు హిందీ సహా 11 భాషలలో నిర్వహించబడును.
పరీక్ష విధానం: NEET (UG)-2020 లో ఫిజిక్స్, కెమిస్ట్రీ అండ్ బయాలజీ (బోటనీ & జువాలజీ) నుంచి 180 బహుళైచ్ఛిక ప్రశ్నలు (ఒక సరియైన జవాబుతో నాలుగు ఆప్షన్లు) గల ఒక ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష కార్యక్రమాల షెడ్యూలు మరియు ఇతర ముఖ్యమైన సమాచారం దిగువ విధంగా ఉన్నాయి.

| ఈవెంట్స్ | | తేదీలు |
|---|---|---|
| పరీక్ష తేది | | 3 మే 2020 |
| పరీక్ష సమయం | | మ. 2:00 గంటల నుంచి సా. 5:00 గంటల వరకు |
| పరీక్ష వ్యవధి | | 180 నిమిషాలు (03 గంటలు) |
| పరీక్ష విధానం | | పెన్ మరియు పేపర్ |
| దరఖాస్తు ఫారం ఆన్‌లైన్ దాఖలు (ఫోటోగ్రాఫ్ మరియు సంతకం అప్‌లోడింగ్‌తో పాటు) | | 02 డిసెంబర్ 2019 – 31 డిసెంబర్ 2019 (రా. 11:50 గం.వరకు) |
| క్రెడిట్ కార్డ్/డెబిట్ కార్డ్/నెట్ బ్యాంకింగ్/UPI ద్వారా ఫీజు సక్సెస్‌ఫుల్ ట్రాన్జాక్షన్ | | 02 డిసెంబర్ 2019 – 01 జనవరి 2020 (రా. 11:50 గం.వరకు) |
| అభ్యర్థి చెల్లించే ఫీజు వివరాలు | జనరల్/అన్‌రిజర్వ్‌డ్ | రూ.1500/- |
| | జనరల్–EWS/OBC-NCL* | రూ.1400/- |
| | SC/ST/PwD/ట్రాన్స్‌జెండర్ | రూ.800/- |
| | ఎక్కడైన వర్తించు సర్వీస్/ప్రాసెసింగ్ చార్జీలు & వస్తుసేవల పన్ను (GST) లను అభ్యర్థి చెల్లించాలి. | |
| NTA వెబ్‌సైట్‌పై ధరఖాస్తు ఫారం వివరాలలో మార్పులు | | 15 జనవరి 2020 – 31 జనవరి 2020 |
| NTA వెబ్‌సైట్ నుండి అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్ | | 27 మార్చి 2020 |
| NEET (UG)-2020 పరీక్ష కేంద్రం | | అడ్మిట్ కార్డ్‌పై సూచించిన విధంగా |
| రికార్డు చేసిన స్పందనలు మరియు జవాబు కీల డిస్‌ప్లే | | వెబ్‌సైట్‌లో తరువాత తెలియజేయబడును. |
| వెబ్‌సైట్ (లు) | | www.nta.ac.in, ntaneet.nic.in |
| NTA వెబ్‌సైట్‌లో ఫలితాల వెల్లడి | | 04 జూన్, 2020లోగా |

* ఇతర వెనుకబడిన తరగతులు (OBC) - జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (NCBC - భారత ప్రభుత్వ వెబ్‌సైట్ www.ncbc.nic.in) లో లభ్యమయ్యే ఇతర వెనుకబడిన తరగతుల కేంద్ర జాబితా ప్రకారం నాన్ క్రీమీలేయర్.
పరీక్ష, సిలబస్, హాజరయ్యేందుకు/ ప్రవేశానికి అర్హత ప్రమాణాలు, వయసు, రిజర్వేషన్, సీట్ల వర్గీకరణ, పరీక్ష రుసుము, పరీక్ష జరిగే నగరాలు, స్టేట్ కోడ్ మొ॥ వాటికి సంబంధించిన సవివరమైన సమాచారం గల ఇన్ఫర్మేషన్ బులెటిన్ వెబ్‌సైట్ www.ntaneet.nic.in లో లభించును.
**NEET (UG)-2020 లో హాజరు కాగోరు అభీష్టం గల అభ్యర్థులు www.ntaneet.nic.in లోని ఇన్ఫర్మేషన్ బులెటిన్‌లోని అన్ని వివరాలను సరిచూసుకోగలరు మరియు 02.12.2019 (సోమవారం) మరియు 31.12.2019 (మంగళవారం) మధ్య ఆన్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయగలరు. ఫీజును 01.01.2020 (బుధవారం) వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించగలరు.**
ఉత్తరప్రత్యుత్తరాల కోసం చిరునామా: బ్లాక్ C-20/IA/8, సెక్టార్–62, IITK ఔట్‌రీచ్ సెంటర్, గౌతమ్‌బుద్ధనగర్, జిల్లా నోయిడా–201309, ఉత్తరప్రదేశ్ (ఇండియా)
సీనియర్ డైరెక్టర్ (NEET-UG), NTA
DAVP 21354/11/0007/1920

# సాక్షి బిజినెస్

మంగళవారం
3-12-2019

WWW.SAKSHIBUSINESS.COM


**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 8 ▲ | 8 ▼ |
| 40,802 | 12,048 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,565 | ▼ | 100 |
| డోజోన్స్ | 27,827 | ▼ | 224 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,286 | ▼ | 61 |
| డాక్స్ | 12,965 | ▼ | 272 |
| షాంఘై | 2,876 | ▲ | 4 |
| నికాయ్ | 23,530 | ▲ | 235 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 71.00 | 72.65 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.13 | 94.34 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.67 | 80.61 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.27 | 66.68 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.64 | 49.80 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.62 | 53.40 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.32 | 19.92 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.04 | 20.05 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.55 | 10.96 |

## విశాఖలో ఉబెర్ ఎక్సలెన్స్ సెంటర్

2020 చివరికి 500 మందికి ఉపాధి




**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ప్రముఖ ట్యాక్సీ సేవల సంస్థ 'ఉబెర్'.. విశాఖపట్నంలో తన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను సోమవారం ప్రారంభించింది. ఈ కేంద్రం ఏర్పాటు నిమిత్తం రూ. 5.73 కోట్లను వెచ్చించినట్లు ప్రకటించింది. అత్యవసర సమస్యలను పరిష్కరించడం, ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించడం కోసం శిక్షణ పొందిన బృందాలు ఇక్కడ నుంచే నిరంతర సేవలను అందిస్తాయని వివరించింది. ప్రస్తుతం ఈ కేంద్రంలో 70 మంది పనిచేస్తుండగా.. వచ్చే ఏడాది ప్రారంభం నాటికి వీరి సంఖ్యను 120కి పెంచనున్నామని, ఇక ఏడాది చివరి నాటికి మొత్తం 500 మందికి ఉపాధి లభించనుందని ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ డైరెక్టర్ (కమ్యూనిటీ ఆపరేషన్స్ ఫర్ ఆసియా పసిఫిక్) వెన్ స్యూ లిన్ మాట్లాడుతూ.. 'కస్టమర్లు, రైడర్లకు పూర్తి స్థాయి మద్దతును అందించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రం ఇది. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న కేంద్రాన్ని విస్తరించడంలో భాగంగా ఇక్కడ సెంటర్‌ను ప్రారంభించాం' అని వ్యాఖ్యానించారు.

**ప్రపంచంలో 12వ సెంటర్**

భారత్‌లో తన మొదటి కేంద్రాన్ని హైదరాబాద్‌లో 2015లో సంస్థ ఏర్పాటుచేసింది. ప్రస్తుతం 1,000 మంది ఉద్యోగులతో ఉబెర్ రైడర్స్, డ్రైవర్లు, కస్టమర్లు, కొరియర్, రెస్టారెంట్ భాగస్వాములకు ఇక్కడ నుంచే సేవలందిస్తోంది. ఓలాకు పోటీనివ్వడం కోసం తాజాగా రెండవ సెంటర్‌ను విశాఖలో ప్రారంభించింది. ప్రపంచంలోనే కంపెనీకి ఇది 12వ సెంటర్‌గా ప్రకటించింది. అమెరికాలో 2, యూరప్‌లో 4 సీఓఈ కేంద్రాలతో పాటు మధ్యప్రాచ్యం, ఆఫ్రికాల్లో ఇటువంటి కార్యాలయాలనే నిర్వహిస్తోంది.

# కార్వీకి మరో షాక్..!

- ట్రేడింగ్ లైసెన్సు సస్పెండ్ చేసిన ఎక్స్ఛేంజీలు
- నిబంధనలు ఉల్లంఘించినందుకే
- శాట్‌ను ఆశ్రయించనున్న సంస్థ
- పీవోఏపై ఊరటనివ్వని సెబీ




**ముంబై/హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** క్లయింట్ల షేర్లను సొంతానికి వాడుకుందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టాక్ బ్రోకింగ్ సంస్థ కార్వీకి ఒకదాని తర్వాత మరొకటిగా షాకులు తగులుతున్నాయి. తాజాగా అన్ని విభాగాల్లో ట్రేడింగ్ లైసెన్సును సస్పెండ్ చేస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సోమవారం ప్రకటించాయి. ఎక్స్ఛేంజీల నిబంధనలను ఉల్లంఘించడమే ఇందుకు కారణమని వెల్లడించాయి. సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని వేర్వేరుగా విడుదల చేసిన సర్క్యులర్‌లలో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వివరించాయి. ఈక్విటీ, డెట్ విభాగాల్లో కార్వీ ట్రేడింగ్ టెర్మినల్స్‌ను డీయాక్టివేట్ చేసినట్లు బీఎస్ఈ తెలిపింది. ఈక్విటీ డెరివేటివ్స్, కరెన్సీ డెరివేటివ్స్, కమోడిటీ సెగ్మెంట్స్‌లో నిర్దిష్ట ఆంక్షలు విధించినట్లు పేర్కొంది. అటు ఎన్ఎస్ఈ కూడా ఈక్విటీ, ఎఫ్అండ్‌వో, కరెన్సీ డెరివేటివ్స్, డెట్, కమోడిటీ డెరివేటివ్స్ వంటి అన్ని విభాగాల్లోనూ కార్వీపై నిషేధం విధించింది. అయితే, బ్రోకింగ్ లైసెన్సును సస్పెండ్ చేయడంపై సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రిబ్యునల్ (శాట్)ను ఆశ్రయించనున్నట్లు కార్వీ వర్గాలు తెలిపాయి. ఇది సత్వరమే పరిష్కారం కాగలదని పేర్కొన్నాయి. దాదాపు రూ. 2,300 కోట్ల విలువ చేసే క్లయింట్ల షేర్లను తనఖా పెట్టి రూ. 600 కోట్ల దాకా రుణాలు తీసుకుందని, క్లయింట్ల నిధులను సొంత అవసరాలకు వాడుకుందని కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీంతో కొత్త క్లయింట్లను చేర్చుకోకుండా, పాత క్లయింట్ల పవర్ ఆఫ్ అటార్నీలను (పీవోఏ) ఉపయోగించుకోకుండా కార్వీపై నవంబర్ 22న మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది.

**వెసులుబాటుకు సెబీ నిరాకరణ..**

క్లయింట్ల పవర్ ఆఫ్ అటార్నీలు (పీవోఏ) ఉపయోగించుకుని వారి ట్రేడ్స్‌ను సెటిల్ చేయడానికి వెసులుబాటు ఇవ్వాలన్న కార్వీ అభ్యర్థనను సెబీ తోసిపుచ్చింది. పీవోఏలను దుర్వినియోగం చేసి, క్లయింట్ల షేర్లను కంపెనీ అక్రమంగా దారి మళ్లించిందని ఆక్షేపించింది. ప్రాథమిక ఆధారాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. ప్రస్తుత పరిస్థితుల్లో క్లయింట్ల పీవోఏలను కార్వీ ఉపయోగించడానికి అనుమతించడం వివేకవంతమైన నిర్ణయం కాబోదని సెబీ స్పష్టం చేసింది. కార్వీ ద్వారా షేర్లను విక్రయించాలనుకుంటున్న క్లయింట్లు.. ఇందుకోసం ఎలక్ట్రానిక్ లేదా ఫిజికల్ డెలివరీ ఇన్‌స్ట్రక్షన్ స్లిప్ (డీఐఎస్)ను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించింది. విక్రయించిన షేర్లను డీమ్యాట్ అకౌంట్ నుంచి డెబిట్ చేసేలా బ్రోకింగ్ సంస్థకు క్లయింట్లు సూచనలివ్వడానికి డీఐఎస్ ఉపయోగపడుతుంది. కార్వీపై ఎన్ఎస్ఈ చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్ ఇంకా కొనసాగుతోందని, క్లయింట్ల షేర్లు.. నిధుల దుర్వినియోగం ఎంత మేర జరిగిందన్నది త్వరలోనే వెల్లడవుతుందని సెబీ వ్యాఖ్యానించింది. పీవోఏను ఉపయోగించుకోవడంపై స్పష్టతనివ్వాలన్న కార్వీ అభ్యర్థనపై డిసెంబర్ 2లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సెబీకి శాట్ సూచించిన సంగతి తెలిసిందే.

### ఇన్వెస్టర్ల ఖాతాల్లోకి షేర్లు..

కార్వీ అక్రమంగా తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్న షేర్లలో సుమారు 90 శాతం సెక్యూరిటీలు.. తిరిగి క్లయింట్ల ఖాతాల్లోకి చేరాయి. సెబీ తీసుకున్న సత్వర చర్యలతో సుమారు 83,000 మంది ఇన్వెస్టర్లకు తమ షేర్లు తిరిగి వచ్చాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ (ఎన్ఎస్‌డీఎల్) వెల్లడించింది. 'సెబీ ఆదేశాల మేరకు, ఎన్ఎస్ఈ పర్యవేక్షణలో కార్వీ స్టాక్ బ్రోకింగ్ డీమ్యాట్ ఖాతా నుంచి సుమారు 82,599 మంది క్లయింట్ల డీమ్యాట్ ఖాతాల్లోకి షేర్లను బదలాయించడం జరిగింది' అని పేర్కొంది. బాకీలు సెటిల్ చేసిన తర్వాత మిగతా వారి ఖాతాల్లోకి కూడా షేర్ల బదలాయింపు పూర్తవుతుందని ఎన్ఎస్‌డీఎల్ వివరించింది.

## ఇప్పటికీ భారత్‌లోనే ఇంటర్నెట్ చౌక..

టెలికం మంత్రి రవిశంకర్ ప్రసాద్

**న్యూఢిల్లీ:** ప్రపంచం మొత్తం మీద భారత్‌లోనే మొబైల్ డేటా రేట్లు అత్యంత తక్కువని కేంద్ర టెలికం మంత్రి రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. బ్రిటన్‌కు చెందిన కేబుల్.కో.యూకే అధ్యయనంలో ఇది వెల్లడైందని మైక్రోబ్లాగింగ్ సైటు ట్విట్టర్‌లో ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన చార్టును పోస్ట్ చేశారు. దీని ప్రకారం.. ఒక గిగాబైట్ (జీబీ) డేటా సగటు ధర భారత్‌లో 0.26 డాలర్లుగా ఉండగా.. బ్రిటన్‌లో 6.66 డాలర్లు, అమెరికాలో 12.37 డాలర్లుగా ఉంది. ప్రపంచ సగటు 8.53 డాలర్లుగా ఉంది. దేశీ టెల్కోలు భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియా, రిలయన్స్ జియో .. ఏకంగా 50%దాకా టారిఫ్‌లను పెంచుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మంత్రి స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది.



'ఈ మొబైల్ చార్జీల సమస్యంతా.. కుంభకోణాలతో అప్రతిష్ఠపాలైన యూపీఏ ప్రభుత్వ ఘనతే. దాన్ని మేం సరిచేశాం. అధిక మొబైల్ ఇంటర్నెట్ చార్జీలు.. యూపీఏ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చాయి. ట్రాయ్ గణాంకాల ప్రకారం 2014లో ఒక్క జీబీకి చార్జీ రూ. 268.97గా ఉండేది. ప్రస్తుతం ఇది రూ. 11.78కి తగ్గింది. ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్/ఎంటీఎన్ఎల్‌ను కూడా ప్రొఫెషనల్‌గా, లాభసాటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని మంత్రి పేర్కొన్నారు.

## ఇండిపెండెంట్ డైరెక్టర్ల 'డేటా బ్యాంక్' ఆరంభం

**న్యూఢిల్లీ:** ఇండిపెండెంట్ డైరెక్టర్ల వివరాలతో కూడిన సమగ్రమైన 'డేటా బ్యాంక్'ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ డేటా బ్యాంక్‌లో ప్రస్తుతమున్న ఇండిపెండెంట్ డైరెక్టర్ల వివరాలతో పాటు ఇండిపెండెంట్ డైరెక్టర్లయ్యే అర్హత గల వారి వివరాలను కూడా పొందుపరుస్తారు. కంపెనీలు ఏవైనా ఇండిపెండెంట్ డైరెక్టర్లను నియమించుకోవాలనుకుంటే ఈ డేటా బ్యాంక్ వాటికి ఉపయోగపడుతుంది. ఈ డేటా బ్యాంక్ పోర్టల్‌ను కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధీనంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసీఏ) నిర్వహిస్తుంది. 2013 నాటి కంపెనీల చట్టం ప్రకారం ఇండిపెండెంట్ డైరెక్టర్లు ఈ నెల 1 నుంచి 3 నెలలలోపు తమ వివరాలను ఈ డేటాబ్యాంక్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా, 2020 మార్చి నుంచి అందుబాటులోకి వచ్చే ఆన్‌లైన్ ప్రొఫిషియెన్సీ సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలో ఇండిపెండెంట్ డైరెక్టర్లు ఉత్తీర్ణులు కావలసి ఉంటుంది.



## ఆ మాటలతో.. దేశ ప్రయోజనాలకు విఘాతం

రాహుల్ బజాజ్ విమర్శలపై ఆర్థిక మంత్రి నిర్మల వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనే దమ్ము లేకుండా పోయిందంటూ వ్యాపార దిగ్గజం రాహుల్ బజాజ్ చేసిన విమర్శలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. తమ సొంత అభిప్రాయాలను అందరికీ ఆపాదించడం సరికాదని ఆమె వ్యాఖ్యానించారు. ఇలాంటి విమర్శలు .. జాతి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఒక సదస్సులో పాల్గొన్న సందర్భంగా కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అమిత్ షాల సమక్షంలోనే రాహుల్ బజాజ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే, ఎవరూ దేని గురించీ భయపడాల్సిన అవసరం లేదని, అలాంటి పరిస్థితులేమైనా ఉంటే చక్కదిద్దేందుకు కృషి చేస్తామని షా స్పందించారు. ఈ చర్చాగోష్ఠి క్లిప్పింగ్‌ను మైక్రోబ్లాగింగ్ సైటు ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన నిర్మలా సీతారామన్.. అన్ని సమస్యలను ప్రభుత్వం పట్టించుకుంటోందని, పరిష్కరించే ప్రయత్నాలూ చేస్తోందని చెప్పడానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.



**బజాజ్‌కు 'బయోకాన్' షా మద్దతు ..**

మరోవైపు, రాహుల్ బజాజ్‌కు మద్దతుగా మరో పారిశ్రామిక దిగ్గజం బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా స్పందించారు. కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం అంటరానివాటిగా చూస్తోందని, ఎకానమీ గురించి ఏ విమర్శలనూ వినదల్చుకోవడం లేదంటూ ఆమె వ్యాఖ్యానించారు. అటు నిర్మలా సీతారామన్ ట్విట్టర్ పోస్టులపైనా షా స్పందించారు. కార్పొరేట్ సంస్థలు.. దేశానికి, ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. 'మేడమ్ మేం జాతి వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక శక్తులం కాము. ఎకానమీని ప్రబల శక్తిగా తీర్చిదిద్దేందుకు మీరు చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం కావాలనే మేమూ కోరుకుంటున్నాం' అని ఆమె ట్వీట్ చేశారు. ఇక, ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వం తీరుపై విమర్శలకు దిగాయి. 'విమర్శించడమనేది జాతి ప్రయోజనాలకు ముప్పు అంటే.. ప్రభుత్వాన్ని పొగిడితేనే దేశ ప్రయోజనాలను కాపాడినట్లవుతుందా' అంటూ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి కపిల్ సిబాల్ ట్వీట్ చేశారు.

## డీహెచ్ఎఫ్ఎల్ దివాలా దరఖాస్తుకు ఎన్‌సీఎల్‌టీ ఓకే




**ముంబై:** దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై (డీహెచ్ఎఫ్ఎల్) దివాలా పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతూ ఆర్‌బీఐ దాఖలు చేసిన దరఖాస్తును జాతీయ కంపెనీలా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సోమవారం అనుమతించింది. ఈ పిటిషన్ ప్రవేశానికి అర్హమైనదని ఎన్‌సీఎల్‌టీ బెంచ్ స్పష్టం చేసింది. గృహ, ప్రాపర్టీ తనఖా రుణాల్లో డీహెచ్ఎఫ్ఎల్ దేశంలోనే మూడో అతిపెద్ద సంస్థ కావడం గమనార్హం. ఈ సంస్థ రుణ చెల్లింపుల్లో విఫలం కావడంతో దివాలా అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద ఆర్‌బీఐ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. ఈ పరిణామాల నేపథ్యంలో డీహెచ్ఎఫ్ఎల్ షేరు ధర బీఎస్ఈలో 5 శాతం క్షీణించింది. రూ.19.70 వద్ద లోయర్ సర్క్యూట్ (ఒక రోజులో స్టాక్ ధర క్షీణించేందుకు గరిష్టంగా అనుమతించిన మేర) వద్దే క్లోజయింది. అటు ఎన్ఎస్ఈలోనూ ఇంతే మొత్తం క్షీణించి రూ.19.75 వద్ద ముగిసింది.

## హైదరాబాద్‌లో ఇంటెల్ డిజైన్ సెంటర్

- ప్రారంభించిన మంత్రి కేటీఆర్
- ఏడాదిలో 1,200 మంది నియామకం
- కంపెనీ ఎస్‌వీపీ రాజా ఎం కోడూరి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ ఇండియా... డిజైన్, ఇంజనీరింగ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. 3 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో 1,500 సీట్ల సామర్థ్యంతో దీనిని నెలకొల్పారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు సోమవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 300 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సిబ్బంది పరంగా కొత్త సెంటర్ ఏడాదిలో పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకుంటుందని ఇంటెల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజా ఎం కోడూరి ఈ సందర్భంగా తెలిపారు. ఎక్సా స్కేల్ సూపర్ కంప్యూటర్ అభివృద్ధిలో హైదరాబాద్ కేంద్రం పాలు పంచుకుంటుందని కూడా వెల్లడించారు. ఈ సూపర్ కంప్యూటర్ యూఎస్‌లో 2021లో, భారత్‌లో 2022లో రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.

**మూడు లక్షల ఉద్యోగాలు..**

వచ్చే నాలుగేళ్లలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో తెలంగాణలో 3 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేటీఆర్ తెలిపారు. 'ఇప్పటికే ఈ రంగంలో 30,000 పైచిలుకు మందికి ఉద్యోగాలు లభించాయి. రూ.5,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు రెండూ నిండిపోయాయి. మరో భారీ తయారీ క్లస్టర్ కోసం కేంద్రాన్ని కోరాం. అక్కడి నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న టి- వర్క్స్ మూడు నాలుగు నెలల్లో ప్రారంభం కానుంది. ఇక్కడ ఎలక్ట్రానిక్స్ రంగ కంపెనీలు తమ ఆవిష్కరణల తాలూకు నమూనాలను రూపొందించుకోవచ్చు' అని వివరించారు.



సెంటర్ ప్రారంభోత్సవంలో కేటీఆర్, ఇంటెల్ ప్రతినిధులు

## 5 శాతం పెరిగిన ప్రత్యక్ష పన్నుల వసూళ్లు..



**న్యూఢిల్లీ:** కార్పొరేట్ ట్యాక్స్ రేటును తగ్గించడం వల్ల పన్ను వసూళ్లపై ప్రతికూల ప్రభావమేమీ లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ దాకా స్థూలంగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 5 శాతం పెరిగాయని ఆమె తెలిపారు. ట్యాక్సేషన్ చట్ట సవరణ బిల్లు 2019పై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొన్న సందర్భంగా.. ప్రత్యక్ష పన్ను వసూళ్లేమీ తగ్గలేదని మంత్రి స్పష్టం చేశారు. సాధారణంగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లు ఆఖరు త్రైమాసికంలోనే అత్యధికంగా ఉంటాయని ఆమె చెప్పారు.

## శాంసంగ్ లాభం 58% డౌన్

- 20 శాతం పెరిగిన ఆదాయం
- వెయ్యి కోట్ల డాలర్లకు వృద్ధి

**న్యూఢిల్లీ:** శాంసంగ్ ఇండియా కంపెనీ నికర లాభం గత ఆర్థిక సంవత్సరంలో 58 శాతం తగ్గింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.3,713 కోట్లుగా ఉన్న నికర లాభం గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,540 కోట్లకు తగ్గిందని కంపెనీల రిజిస్ట్రార్(ఆర్‌ఓసీ)కి శామ్‌సంగ్ ఇండియా వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం...,

**60 శాతం ఆదాయం మొబైల్ ఫోన్లదే...**

ఈ కంపెనీ మొత్తం ఆదాయం 20 శాతం వృద్ధి చెందింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.61,066 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం 20 శాతం వృద్ధితో రూ.73,086 కోట్లకు పెరిగింది. దీంతో భారత్‌లో 1,000 కోట్ల డాలర్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. కార్యకలాపాల ఆదాయం రూ.59,371 కోట్ల నుంచి 19 శాతం వృద్ధితో రూ.70,628 కోట్లకు చేరింది. దీంట్లో 60 శాతం ఆదాయం (రూ.43,088 కోట్లు)మొబైల్ ఫోన్ల విభాగం నుంచే వచ్చింది. టీవీ, కెమెరాల విభాగం ఆదాయం రూ.5,016 కోట్లు, గృహోపకరణాల విభాగం ఆదాయం రూ.7,408 కోట్లుగా ఉన్నాయి. ఇక కంపెనీ మొత్తం వ్యయాలు రూ. 55,284 కోట్ల నుంచి 27% వృద్ధితో రూ.70,228 కోట్లకు పెరిగింది. వడ్డీ భారం రూ.711 కోట్ల నుంచి రూ.1,059 కోట్లకు ఎగసింది.




# యాహూ! సరికొత్తగా...

- 1 టీబీ ఉచిత స్టోరేజ్‌తో మెయిల్
- మొబైల్ యూజర్లపై మరింతగా దృష్టి
- ఫోన్స్‌లో ప్రీ-ఇన్‌స్టాల్ చేసేందుకు మొబైల్స్ తయారీ సంస్థలతో చర్చలు

ఒకప్పుడు ఇంటర్నెట్ సెర్చి ఇంజిన్‌గా, ఈ-మెయిల్‌కు పర్యాయపదంగా వెలిగిన యాహూ ఆ తర్వాత మిగతా సంస్థల నుంచి పోటీని తట్టుకోలేక వెనుకబడిపోయింది. అయితే, పూర్వ వైభవాన్ని సంపాదించుకునేందుకు యాహూ మెయిల్ తాజాగా ప్రయత్నాల్లో ఉంది. ఇందులో భాగంగా సరికొత్త ఫీచర్స్‌తో పాటు మొబైల్ యాప్‌ను రీబ్రాండింగ్ చేయడం ద్వారా యూజర్లను ఆకర్షించేందుకు కసరత్తు చేస్తోంది. పోటీ సంస్థలు గూగుల్‌కి చెందిన జీమెయిల్, మైక్రోసాఫ్ట్ అవుట్‌లుక్ వంటివి తమ యాప్స్‌ను ఎప్పటికప్పుడు కొంగొత్త ఫీచర్లు, సర్వీసులతో రీ-బ్రాండ్ చేసుకుంటూనే ఉన్న నేపథ్యంలో యాహూ తాజా ప్రయత్నాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**22 కోట్ల మంది యూజర్లు..**

యాహూ మెయిల్‌కు ప్రపంచవ్యాప్తంగా 22.76 మిలియన్ల మంది నెలవారీ యూజర్లు ఉన్నారు. మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్ పీసీలు, కంప్యూటర్స్ మొదలైన వివిధ డివైజ్‌ల ద్వారా వీరిలో చాలా మంది ఈమెయిల్ సర్వీసులు ఉపయోగించుకుంటున్నారు. మొత్తం యూజర్లలో ప్రతి నెలా 7.5 కోట్ల మంది యూజర్లు కేవలం తమ మొబైల్స్, ట్యాబ్లెట్స్ ద్వారానే యాహూ మెయిల్‌ను ఉపయోగిస్తున్నారు. యాహూ మెయిల్ వినియోగదారుల్లో 60 శాతం మంది అమెరికాయేతర దేశాలవారే. ప్రస్తుతం ఉన్న యూజర్లు మరో ఈమెయిల్ సేవల సంస్థ వైపు మళ్లకుండా తమవద్దే అట్టే పెట్టుకునే దిశగా కొత్త మొబైల్ యాప్ ఫీచర్స్‌ను తీర్చిదిద్దినట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. దీంతో పాటు భారత్‌లో తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, గుజరాతీ, బెంగాలీ, మరాఠీ వంటి ఏడు ప్రాంతీయ భాషల్లో సేవలు అందిస్తున్నట్లు వివరించాయి.

**కొత్త ఫీచర్స్‌లో కొన్ని ..**

అన్నింటికన్నా ప్రధానంగా మిగతా సంస్థలతో పోలిస్తే యాహూ మెయిల్ అత్యధికంగా 1 టెరాబైట్ (టీబీ) స్టోరేజీ స్పేస్ అందిస్తోంది. సుమారు 250-300 సినిమాలకు సరిపడేంత స్టోరేజీ ఇది. పోటీ సంస్థ జీమెయిల్ కేవలం 15 జీబీ స్టోరేజీ ఇస్తోంది. ఈ పరిమితి దాటితే.. అప్పటికే ఉన్న మెయిల్స్ కొన్నింటిని డిలీట్ చేసుకుని.. ఆ మేరకు పెరిగిన స్పేస్‌ను వాడుకోవాల్సి ఉంటోంది. లేదా నెలవారీ కొంత మొత్తం చెల్లించి అదనంగా స్టోరేజీ స్పేస్ కొనుక్కోవాల్సి వస్తోంది. ఇక, ఇన్‌బాక్స్‌లో స్పామ్ బాదరబందీ లేకుండా కాంటాక్ట్స్ నుంచి వచ్చే మెయిల్సే కనిపించేలా .. యాహూ మెయిల్ యూజర్లు..'పీపుల్ వ్యూ' పేరిట మరో కొత్త ఫీచర్ వినియోగించుకోవచ్చు. పీపుల్, ట్రావెల్, రిసీట్స్ వంటి మూడు కేటగిరీల్లో కింద మెయిల్స్‌ను విడగొట్టుకోవచ్చు. ఇవే కాకుండా పలు రకాల ఫిల్టర్స్, అటాచ్‌మెంట్ ఆప్షన్లు మొదలైనవి ఇందులో ఉన్నాయి. మిగతా ఈ-మెయిల్ సర్వీస్ ప్రొవైడర్స్ తరహాలోనే బహుళ ఈ-మెయిల్ ఖాతాలను యాహూ మెయిల్ యాప్‌నకు అనుసంధానించుకోవచ్చు. పెద్ద ఫోన్స్‌ను ఒంటి చేత్తో ఆపరేట్ చేసేటప్పుడు కూడా సులువు గా ఉపయోగించుకోగలిగేలా యాప్‌లో ఫీచర్స్‌ను తీర్చిదిద్దినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి.




### మెయిల్ ప్రో రీబ్రాండింగ్..

యూజర్లకు ఉచిత సర్వీసులు అందిస్తున్నప్పటికీ.. మెయిల్స్‌లో ప్రకటనల ద్వారా యాహూ మెయిల్‌కు కొంత ఆదాయం లభిస్తుంది. దీనితో పాటు ప్రకటనల బాదరబందీ లేని సబ్‌స్క్రిప్షన్ ఆధారిత యాహూ మెయిల్ ప్రో సర్వీసును కూడా సంస్థ గతంలో ప్రవేశపెట్టింది. సుమారు 6-7 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన ఈ సర్వీసును కూడా ప్రస్తుతం రీబ్రాండ్ చేస్తోంది. అలాగే, కొత్త యాహూ మెయిల్ అప్లికేషన్‌ను మొబైల్ ఫోన్స్‌లో ప్రీ-ఇన్‌స్టాల్ చేసేలా ఫోన్స్ తయారీ సంస్థలతోనూ చర్చలు జరుగుతున్నాయని సంస్థ వర్గాలు తెలిపాయి. ఎంటర్‌ప్రైజ్ ఈ-మెయిల్ విభాగంలో ప్రవేశించే యోచనేదీ లేదని.. సాధారణ యూజర్లపైనే ప్రధానంగా దృష్టి పెట్టనున్నామని పేర్కొన్నాయి.

## వాల్‌మార్ట్‌తో కలిసి... హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డులు

గ్రోసరీ దిగ్గజం కస్టమర్లకు 50 రోజుల ఉచిత క్రెడిట్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హెచ్‌డీఎఫ్‌సీ భాగస్వామ్యంతో వాల్‌మార్ట్ ఇండియా తన కస్టమర్ల కోసం కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులను విడుదల చేసింది. వాల్‌మార్ట్ తాలూకు బెస్ట్‌ప్రైస్ హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ స్టోర్ల సభ్యుల కోసం ఈ కార్డులను విడుదల చేస్తున్నట్లు వాల్‌మార్ట్ ఇండియా సీఈఓ క్రిష్ అయ్యర్ చెప్పారు. వీటితో కస్టమర్లకు 18- 50 రోజుల ఫ్రీ క్రెడిట్ లభిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా బెస్ట్‌ప్రైస్‌లో రిజిస్టరైన సభ్యులు ఈ కార్డులకు అర్హులని తెలియజేశారు. రెండు రకాల క్రెడిట్ కార్డులు (బెస్ట్‌ప్రైస్ సేవ్‌స్మార్ట్, బెస్ట్‌ప్రైస్ సేవ్ మాక్స్) అందుబాటులో ఉంటాయని, బీ2బీ కస్టమర్లు తమ కొనుగోళ్లకు అనుగుణమైన కార్డును ఎంచుకోవచ్చునని చెప్పారాయన. ఈ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపితే క్యాష్‌బ్యాక్, రివార్డు పాయింట్ల లాంటి పలు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలుంటాయన్నారు. త్వరలో కర్నూలు, తిరుపతిల్లో బెస్ట్‌ప్రైస్ దుకాణాలు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా క్రిష్ అయ్యర్ చెప్పారు. ఎకానమీలో మందగమనం త్వరలో సమసిపోతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని బెస్ట్‌ప్రైస్ స్టోర్లలో ఈ కార్డులను అందుబాటులోకి తెస్తామన్నారు.

సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా బెస్ట్‌ప్రైస్‌లో కస్టమర్లు జరిపిన లావాదేవీలను మదింపు చేసి కార్డులు జారీ చేస్తామని కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పేమెంట్స్ బిజినెస్ విభాగం కంట్రీ హెడ్ పరాగ్ రావ్ చెప్పారు. ఈ కార్డుల వార్షిక ఫీజు రూ. 500- 1000 మధ్యలో ఉంటుందన్నారు. ''సేవ్‌స్మార్ట్ కార్డుతో దాదాపు ఏటా రూ.14,250 మేర, మాక్స్ కార్డుతో ఏటా దాదాపు రూ.40,247 మేర సభ్యులు ఆదా చేసుకోవచ్చు. ఎస్ఎంఈ విభాగం దేశీయ ఎకానమీకి వెన్నెముక. ఈ విభాగానికి చేయూతనిచ్చే దిశగా ఈ కార్డులను తీసుకొచ్చాం'' అని వివరించారు. ఎకానమీలో మందగమనం పూర్తిగా పోతుందనే సంకేతాలున్నాయని, ఇకపై రికవరీ చూడవచ్చని అంచనా వేశారు. కార్యక్రమంలో డైనర్స్ క్లబ్ ప్రతినిధి యానీ జాంగ్ తదితరులు పాల్గొన్నారు.



కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డు ఆవిష్కరిస్తున్న పరాగ్ రావ్, క్రిష్ అయ్యర్, యానీ జాంగ్

### మహీంద్రా ఫైనాన్స్‌కు రూ.1,433 కోట్ల ఐఎఫ్‌సీ నిధులు

**న్యూఢిల్లీ:** మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలో ప్రపంచ బ్యాంక్ విభాగం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రూ.1,433 కోట్లు (20 కోట్ల డాలర్లు) పెట్టుబడులు పెట్టనున్నది. ఆదాయం తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో చిన్న, మధ్య తరహా వాణిజ్య సంస్థలు (ఎమ్ఎస్ఈ)లకు రుణాలందించడానికి ఈ నిధులు వినియోగిస్తారని ఐఎఫ్‌సీ తెలిపింది. వీటిల్లో సగం నిధులు మహిళల ఆధ్వర్యంలోని ఎమ్ఎస్ఈలకు అందిస్తామని పేర్కొంది. మహిళలకు రుణాలను ఐఎఫ్‌సీ–గోల్డ్‌మన్ శాక్స్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అపర్చునిటీ ఫెసిలిటీ ద్వారా అందిస్తామని వివరించింది.

### బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,980 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,170 |
| వెండి (కిలో) | 47,900 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,900 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,030 |
| వెండి (కిలో) | 45,700 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,980 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,260 |
| వెండి (కిలో) | 45,000 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,116 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,170 |
| వెండి (కిలో) | 47,600 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 56.06 (రాత్రి 11.30కు) | $ 55.17 (శుక్రవారం ముగింపు) |
| బ్రెంట్ | 61.22 (రాత్రి 11.30కు) | $ 60.49 (శుక్రవారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 03-12-2019

| | |
|---|---|
| విశాఖ | 460–00 |
| చిత్తూరు | 466–00 |
| వరంగల్ | 447–00 |
| **02–12–2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 443–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 5.00 |
| విజయవాడ | 455–00 |
| నమక్కల్ | 431–00 |
| గోదావరి | 455–00 |

# వృద్ధి 5.1 శాతం మించదు

- అంచనాలను కుదించిన క్రిసిల్
- ఇంతక్రితం అంచనా 6.3 శాతం

**ముంబై:** భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 2019–20 ఆర్థిక సంవత్సరం అంచనాలను రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ తగ్గించింది. ఇంతక్రితం 6.3 శాతం ఉన్న ఈ రేటును 5.1 శాతానికి తగ్గిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఊహించినదానికన్నా మందగమన తీవ్రత ఎక్కువగా ఉందనీ తన తాజా నివేదికలో పేర్కొంది. ''పారిశ్రామిక ఉత్పత్తి, ఎగుమతులు, బ్యాంకింగ్ రుణ వృద్ధి, పన్ను వసూళ్లు, రవాణా, విద్యుత్ ఉత్పత్తి వంటి కీలక స్వల్పకాలిక సూచీలన్నీ బలహీన ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. అయితే ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) 4.75 శాతం వృద్ధి రేటు నమోదయితే, చివరి ఆరు నెలల్లో (అక్టోబర్–మార్చి) మాత్రం వృద్ధిరేటు కొంత మెరుగ్గా 5.5 శాతంగా నమోదయ్యే అవకాశం ఉంది'' అని క్రిసిల్ నివేదిక పేర్కొంది. వస్తు, సేవల పన్ను, రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్, దివాలా చట్టం వంటివి ఆర్థిక వ్యవస్థపై ఇంకా కొంత ప్రతికూలతను చూపుతున్నాయని, ఆయా అంశాల అమలు, సర్దుబాట్లలో బాలారిష్టాలు తొలగిపోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రైవేటు వినియోగం, పెట్టుబడుల బలహీనత వంటి పరిస్థితులను చూస్తుంటే డిమాండ్ పూర్తిగా కిందకు జారిన పరిస్థితులు స్పష్టమవుతున్నాయని వివరించింది. ఈ నివేదిక నేపథ్యం చూస్తే...

- ఆర్థిక సంవత్సరం మొత్తంలో కేవలం వృద్ధి 4.7 శాతంగానే ఉంటుందని నోమురా అంచనా.
- శుక్రవారం వెలువడిన క్యూ2 ఫలితాల్లో జీడీపీ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ట స్థాయి 4.5 శాతానికి పడిపోయింది.
- ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష గురువారం జరగనున్న నేపథ్యంలో క్రిసిల్ తాజా నివేదిక వెలువడింది. అక్టోబర్‌లో జరిగిన సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ 2019–20 వృద్ధి రేటును 7 శాతం నుంచి 6.1 శాతానికి కుదించింది. శుక్రవారంనాటి గణాంకాల నేపథ్యంలో.. వృద్ధిపై ఆర్‌బీఐ భవిష్యత్ అంచనా చూడాల్సి ఉంది.



### సమీప భవిష్యత్తులో బలహీనమే: డీఅండ్‌బీ

అమెరికా ఆర్థిక గణాంకాల ప్రచురణ సంస్థ– డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ (డీఅండ్‌బీ) మరో నివేదికను విడుదల చేస్తూ, సమీప భవిష్యత్తులో భారత్ ఆర్థిక వృద్ధి బలహీనంగానే ఉంటుందని విశ్లేషించింది. ఊహించినదానికన్నా మందగమనం కొంత ఎక్కువకాలమే కొనసాగే అవకాశం ఉందనీ అభిప్రాయపడింది. ఇటీవల వచ్చిన వరదలు, తగ్గిన వ్యవసాయ ఉత్పత్తి వంటి అంశాలు గ్రామీణ ప్రాంతాల డిమాండ్‌ను దెబ్బతీసిందని పేర్కొంది.

### నవంబర్‌లో 'తయారీ' కొంచెం బెటర్ : పీఎంఐ

కాగా, తయారీ రంగం నవంబర్‌లో కొంత మెరుగుపడినట్లు ఐహెచ్ఎస్ మార్కిట్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పీఎంఐ (పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్) సర్వే పేర్కొంది. సూచీ 51.2గా నమోదయిందని పేర్కొంది. అక్టోబర్‌లో ఈ సూచీ రెండేళ్ల కనిష్ట స్థాయి 50.6గా ఉంది. అయితే పీఎంఐ 50కు ఎగువన ఉన్నంత వరకూ దానిని వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. సర్వే ప్రకారం.. నవంబర్‌లో కొన్ని కంపెనీలు కొత్త ఆర్డర్లు పొందగలిగితే, మరికొన్ని ఆర్థిక సవాళ్లను ఎదుర్కొన్నాయి.

### ఎన్‌సీసీకి రూ.243 కోట్ల ఆర్డరు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** నిర్మాణ రంగ కంపెనీ ఎన్‌సీసీ రూ.243 కోట్ల విలువైన ఆర్డరును నవంబరులో దక్కించుకుంది. కంపెనీకి చెందిన రోడ్స్ విభాగం ఓ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ నుంచి ఈ కాంట్రాక్టును పొందినట్టు వివరించింది. 60 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది.

### స్థూల ఆదాయంలో ఎయిర్‌టెల్ టాప్

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–20) రెండో త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)లో టెలికం కంపెనీల స్థూల ఆదాయం రూ. 54,218 కోట్లుగా ఉంది. టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్) ప్రకటించిన తాజా సమాచారం ప్రకారం.. భారతీ ఎయిర్‌టెల్ ఆదాయం రూ. 19,061 కోట్లుగా నమోదైంది. అంటే, మొత్తం ఈ రంగం సాధించిన స్థూల ఆదాయంలో సంస్థ వాటా 35 శాతంగా ఉంది. ప్రభుత్వానికి రూ. 1,160.63 కోట్లు (లైసెన్స్ ఫీజు రూ. 851.3 కోట్లు, స్పెక్ట్రం ఫీజు రూ. 309.33 కోట్లు)ను చెల్లించింది. అయితే, సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్)లో మాత్రం వెనకపడిపోయింది. ఇది 55.83 శాతంతో రూ. 10,641.33 కోట్లకు పరిమితమైంది.

### వచ్చే ఏడాది జీతాల్లో పెంపు 9.2%

**న్యూఢిల్లీ:** భారతలో ఉద్యోగులకు వచ్చే ఏడాది జీతాల్లో 9.2 శాతం వృద్ధికి అవకాశం ఉందని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ కార్న్ ఫెర్రీ నివేదిక అంచనా వేస్తోంది. ఇది ఆసియాలోనే అధిక పెంపుగా తన నివేదికలో పేర్కొంది. ఈ ఏడాదిలో 10 శాతం పెంపుతో పోల్చితే పెంపు కాస్త తగ్గినప్పటికీ.. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని లెక్కించే వాస్తవ వేతనంలో మాత్రం ఎటువంటి మార్పు లేకుండా 5 శాతంగానే ఉండవచ్చని వివరించింది. ప్రపంచవ్యాప్తంగా వేతన పెంపు 4.9 శాతం, ద్రవ్యోల్బణ ఆధారంగా 2.8 శాతంగా ఉండనున్నట్లు లెక్కించింది.

# మార్కెట్ అక్కడక్కడే

- హెచ్చుతగ్గుల్లో సూచీలు
- నిరాశపరిచిన జీడీపీ, వాహన విక్రయ గణాంకాలు
- కీలక రేట్ల కోతపై ఆశలు
- 8 పాయింట్ల లాభంతో 40,802కు సెన్సెక్స్
- 8 పాయింట్లు తగ్గి 12,048కు నిఫ్టీ

**స్టాక్ మార్కెట్ డేటా**

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 2,583 |
| ఎన్ఎస్ఈ | 39,280 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 8,16,662 |
| ఎఫ్ఐఐ | -1,731 |
| డీఐఐ | 754 |

ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగిన సోమవారం నాటి ట్రేడింగ్‌లో చివరకు స్టాక్ మార్కెట్ మిశ్రమంగా ముగిసింది. అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా ఉన్నా, డాలర్‌తో రూపాయి మారకం విలువ 10 పైసలు పుంజుకున్నా మన మార్కెట్లో మాత్రం ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో జీడీపీ ఆరేళ్ల కనిష్ట స్థాయికి పడిపోవడం, నవంబర్ నెల వాహన విక్రయాలు నిరాశపరచడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీంతో వాహన, బ్యాంక్ షేర్లు పతనమయ్యాయి. మరోవైపు మరో మూడు రోజుల్లో ఆర్‌బీఐ పాలసీ విధానాన్ని ప్రకటించనుండటంతో పలువురు ఇన్వెస్టర్లు, ట్రేడర్లు రక్షణాత్మక విధానాన్ని అనుసరించారు. బీఎస్ఈ సెన్సెక్స్ 8 పాయింట్ల లాభంతో 40,802 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 8 పాయింట్లు తగ్గి 12,048 పాయింట్ల వద్ద ముగిశాయి. మొబైల్ చార్జీలు 40 శాతం మేర పెరగడంతో టెలికం కంపెనీల షేర్లు జోరుగా పెరిగాయి.

## జర్మనీ వాణిజ్య రాయబారి శ్రీసిటీ సందర్శన

**కేవీబీపురం (చిత్తూరు జిల్లా):** చెన్నైలోని జర్మనీ వాణిజ్య రాయబారి కరీస్ స్టోల్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్ సుబ్రమణ్యం ఆమెకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం పట్ల ఎంతగానో ఆకర్షితులైన కాన్సుల్, జర్మన్ కంపెనీలకు, ముఖ్యంగా చిన్న, పెద్ద తరహా పరిశ్రమలకు అత్యంత అనుకూల గమ్యంగా ఈ ప్రారిశ్రామికవాడ ఉందన్న విషయం ఈ పర్యటన ద్వారా తమకు అవగతమైందన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, జర్మనీ సహా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల గమ్యస్థానంగా భారత్ ఉద్భవించిందన్నారు. కాన్సుల్ జనరల్ పర్యటన ఫలితంగా జర్మనీ నుండి శ్రీసిటీకి మరిన్ని పెట్టుబడులు వస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.



కరీస్‌స్టోల్‌కు మెమెంటో బహుకరిస్తున్న శ్రీసిటీ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రమణ్యం

## సంహి హోటల్స్ ఐపీఓకు సెబీ ఓకే



సంహి హోటల్స్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం లభించింది. ఈ ఐపీఓ సైజు రూ.1,800–2,000 కోట్ల రేంజ్‌లో ఉంటుందని అంచనా. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ, కంపెనీ అనుబంధ సంస్థల రుణ భారాన్ని తగ్గించుకోవడానికి, సాధారణ వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తారు.

# సుజుకీ అప్.. హీరో డౌన్



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది నవంబర్‌లో కూడా ఆటో రంగ అమ్మకాలు నెమ్మదించాయి. ద్విచక్ర వాహన విభాగంలో సుజుకీ మోటార్‌సైకిల్ విక్రయాలు 14.69 శాతం పెరిగాయి. దిగ్గజ కంపెనీలైన హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో అమ్మకాలు తగ్గాయి. వాణిజ్య వాహన విభాగంలో అశోక్ లేలాండ్ 25 శాతం తగ్గుదలను నమోదుచేసింది. ప్యాసింజర్ వాహన విభాగంలో మారుతీ వంటి దిగ్గజ కంపెనీల అమ్మకాలు తగ్గిన విషయం తెలిసిందే కాగా, తాజాగా వెల్లడైన టయోటా విక్రయాలు సైతం 22 శాతం క్షీణతను నమోదుచేశాయి.

**నవంబర్ వాహన విక్రయాలు (దేశీయ)**

| కంపెనీ | 2019 | 2018 | వృద్ధి.(శాతం) |
|---|---|---|---|
| హీరో మోటోకార్ప్ | 5,05,994 | 6,01,045 | - 15.82 |
| బజాజ్ ఆటో | 2,07,775 | 2,34,818 | - 11.5 |
| టీవీఎస్ మోటార్ | 1,91,222 | 2,60,253 | - 26.52 |
| సుజుకీ మోటార్‌సైకిల్ | 60,855 | 53,058 | 14.69 |
| టయోటా | 8,312 | 10,721 | - 22 |
| అశోక్ లేలాండ్ | 9,377 | 12,570 | - 25 |
| కియా మోటార్స్ | 14,005 | - | - |

**రాష్ట్రీయం**

## డ్రైవర్ 'పువ్వాడ'!



బస్సు నడుపుతున్న పువ్వాడ

ఈ ఫొటోలో కనిస్తున్నది మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగులకు వరాలు ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఖమ్మం ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి డ్రైవర్ డ్రెస్ కోడ్‌ను పాటిస్తూ బస్సు నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. అక్కడున్న డ్రైవర్లు, కండక్టర్లతో కాసేపు ముచ్చటించారు. – ఖమ్మం మామిళ్లగూడెం

## సొంత ఖర్చులతో విద్యార్థులకు భోజనం

### మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సతీశ్

**హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలు, మోడల్ స్కూల్‌లలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తన సొంత ఖర్చులతో సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాలలకు వచ్చేది ఎక్కువగా పేద విద్యార్థులే కావడంతో వారు ఆకలితో ఉండకూడదని నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలలకు చెందిన 2,200 మంది విద్యార్థులకు ఆయన మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. 2017లో దీనిని ప్రారంభించిన ఎమ్మెల్యే, 2018లో ఎన్నికల కోడ్ వచ్చాక విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించలేకపోయారు. ఈ సంవత్సరం మళ్లీ మధ్యాహ్న భోజనాన్ని జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మతో కలసి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రారంభించారు. వచ్చే శాసనసభ ఎన్నికల వరకు కళాశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తానని చెప్పారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## డిప్లొమా విద్యార్థిని కిడ్నాప్, అత్యాచారం

### నిందితుడిపై నిర్భయ చట్టం కింద కేసు

**నిజామాబాద్అర్బన్:** నిజామాబాద్‌లో ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసి, ఆపై అత్యాచారం చేసిన సంఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. నగర శివారు ప్రాంతానికి చెందిన విద్యార్థిని (17) డిప్లొమా చదువుతోంది. ఆమెను అదే ప్రాంతానికి చెందిన ఎలక్ట్రీషియన్‌గా పని చేసే శివసాయి నవంబర్ 25న కిడ్నాప్ చేశాడు. కూతురు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిద్దరు కామారెడ్డి జిల్లాలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. సోమవారం స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. శివ తన బంధువుల ఇంట్లో ఉంచాడని, పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారానికి పాల్పడినట్లు విద్యార్థిని వెల్లడించింది. దీంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై నిర్భయ చట్టం కింద కేసులు నమోదు చేశారు.

## డిక్కిన్ వర్సిటీ ఎన్నికల్లో తెలుగు విద్యార్థి విజయం



**కోహీర్:** ఆస్ట్రేలియాలోని డిక్కిన్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో తెలుగుతేజం సాయిప్రణీత్‌రెడ్డి విజయం సాధించాడు. యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రణీత్ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందాడు. సాయిప్రణీత్‌లో మంచి నాయకత్వ లక్షణాలు ఉండడంతో లేబర్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాయిప్రణీత్‌రెడ్డి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అరవిందరెడ్డి, స్రవంతిరెడ్డి దంపతుల కుమారుడు.

## తడిసిన ధాన్యం



ఉమ్మడి వరంగల్ జిల్లా, పెద్దపల్లి జిల్లాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. అలాగే పెద్దపల్లి జిల్లాలో ఐదారువేల క్వింటాళ్ల ధాన్యం తడిసినట్లు జిల్లా వ్యవసాయాధికారి తిరుమల్ ప్రసాద్ తెలిపారు. రైతులు రెండు మూడు రోజులు వరి కోతలు చేపట్టవద్దన్నారు. ధాన్యం మార్కెట్‌కు తీసుకురావద్దని చెప్పారు. - వరంగల్, పెద్దపల్లి

# వలకు చిక్కి.. జీవచ్ఛవాలుగా మారి..

గల్లంతైన బీట్ అధికారుల మృతి • పడవ ప్రమాదం.. విషాదాంతం

**చింతలమానెపల్లి (సిర్పూర్):** ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి వద్ద ప్రాణహిత నదిలో జరిగిన పడవ ప్రమాదం విషాదం మిగిల్చింది. శనివారం గల్లంతైన బీట్ అధికారులు మంజం బాలకృష్ణ (31), బదావత్ సురేష్ నాయక్ (35)ల మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి. చేపల వలకు చిక్కి జీవచ్ఛవాలుగా కనిపించాయి. ఉదయం నుంచే చింతలమానెపల్లి, మహారాష్ట్ర పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈతగాళ్లకు ఘటనా స్థలానికి కొద్ది దూరంలో నదిలో చేపల వేటకు ఏర్పాటు చేసిన వలలో మృతదేహాలు చిక్కుకుని కనిపించాయి. ఎన్‌డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) టీం ఇన్‌స్పెక్టర్ పవన్ ఆధ్వర్యంలో మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బీట్ అధికారులు గల్లంతైనట్లు మహారాష్ట్రలోని అహేరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. బాలకృష్ణ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు సీఆర్‌పీసీ 174 సెక్షన్ కింద చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.



సురేష్ నాయక్, బాలకృష్ణ మృతదేహాలు

**మిన్నంటిన రోదనలు**

బీట్ అధికారుల మృతదేహాలు లభించడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. బాలకృష్ణ, సురేష్ ఇకలేరనే సమాచారంతో శోకసంద్రంలో మునిగిపోయారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

- ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్
- 30 మంది ప్రయాణికులు క్షేమం

**నల్లగొండ క్రైం:** నల్లగొండ సమీపంలోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు లేచి బస్సు పూర్తిగా దగ్ధమైంది. రూరల్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న గాయత్రీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు నల్లగొండ మండలం చర్లపల్లి వద్దకు వచ్చిన సమయంలో ముందు నుంచి పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడు. వెంటనే బస్సును పక్కకు నిలిపి అందులో ఉన్న 30 మంది ప్రయాణికులను లగేజీతో సహా కిందికి దింపాడు. అనంతరం బస్సు ఇంజెన్ వైర్ల షార్ట్ సర్క్యూట్‌తో పొగలు రావడాన్ని గమనించి ఆర్పేందుకు యత్నించాడు. ఇసుక, నీటిని పోసి పొగలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ మరింత ఎక్కువగా వస్తుండటంతో డ్రైవర్.. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అప్పటికే మంటలు చెలరేగి బస్సును పూర్తిగా చుట్టుముట్టాయి. పోలీసులు, అగ్నిమాపక అధికారులు వచ్చే లోపే బస్సులో మంటలు ఎగిసిపడ్డాయి. 30 నిమిషాలపాటు బస్సు మంటల్లో ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా, బస్సు డ్రైవర్ గోపి అప్రమత్తతతోనే పెను ప్రమాదం తప్పింది.



అద్దంకి నార్కట్‌పల్లి రహదారిలో చర్లపల్లి గ్రామం వద్ద దగ్ధమవుతున్న బస్సు

## కూతురుకు న్యాయం జరగడం లేదని..

### మనోవేదనతో తండ్రి ఆత్మహత్య

**మరిపెడ రూరల్:** తన కూతురుకు న్యాయం జరగడం లేదని మనస్తాపం చెందిన ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్ఆర్ జండాల్‌తండాకు చెందిన భూక్యా ఠాగూర్(48) చిన్న కూతురు (15) చదువును ఆపేసి ఇంటి వద్దే ఉంటోంది. ఆముదాలగడ్డ తండాకు చెందిన ధరావత్ రామకృష్ణ ఆ బాలికను ప్రేమ పేరుతో శారీరకంగా లొంగదీసుకోవడంతో బాలిక గర్భం దాల్చింది. బాలికను నిలదీయగా జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. తమ కూతురిని పెళ్లి చేసుకోవాలని వారు ఆ యువకుడి కుటుంబాన్ని కోరగా ముఖం చాటేయడంతో పెద్ద మనుషులను, అనంతరం పోలీసులను ఆశ్రయించాడు. రెండు చోట్ల న్యాయం జరగకపోవడంతో మనస్తాపం చెంది బలవన్మరణం చెందాడు. కాగా, తండాకు చెందిన ముగ్గురు పెద్ద మనుషులపై కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.



కృష్ణమ్మ ఒడిలో దిశ అస్థికలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

## 'దిశ' అస్థికల నిమజ్జనం

**ఎర్రవల్లిచౌరస్తా:** జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం బీచుపల్లిలోని కృష్ణానదిలో సోమవారం 'జస్టిస్ ఫర్ దిశ' అస్థికలను తండ్రి శ్రీధర్‌రెడ్డి నిమజ్జనం చేశారు. పుట్టి ద్వారా నదిలోకి వెళ్లి అస్థికలను కలిపారు. కాగా, అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ తండ్రికి ఇలాంటి పరిస్థితి రావద్దని అన్నారు. ఆ మానవ మృగాలను బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఉత్తమ కలెక్టర్‌గా హనుమంతరావు

### నేడు అవార్డు స్వీకరించనున్న సంగారెడ్డి కలెక్టర్



**సాక్షి, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావుకు మరో అరుదైన గౌరవం దక్కింది. దివ్యాంగులకు అందిస్తున్న విశిష్ట సేవలకుగాను ప్రభుత్వం ఆయనను 'ఉత్తమ కలెక్టర్'అవార్డుకు ఎంపిక చేసింది. మంగళవారం ఆయన ఈ అవార్డును హైదరాబాద్‌లో అందుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని సోమవారం ఆయన స్వయంగా వెల్లడించారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో వేగంగా అభివృద్ధి

### విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి



**జోగుళాంబ శక్తిపీఠం:** రెండు తెలుగు రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. ఆయన చేపట్టిన హిందూ ధర్మ ప్రచార యాత్ర సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో ముగిసింది. ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామీజీకి గద్వాల కోటలో విజయోత్సవ సభ నిర్వహించి పుష్పాభిషేకం చేశారు. అనంతరం స్వామి మాట్లాడుతూ తన 63 రోజుల తెలంగాణ యాత్ర ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా నీళ్లు, పచ్చని పంటలతో సస్యశ్యామలంగా కనిపించిందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, భద్రాద్రి, అలంపురం వంటి అనేక పురాతన ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఆలయాలకు పూర్వవైభవం తీసుకురావడంలో సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. ఏపీలోనూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సైతం హైందవ ధర్మాలను చక్కగా పాటిస్తున్నారని ప్రశంసించారు. తన గురువు స్వరూపానందేంద్ర సరస్వతి ఆదేశానుసారం దేశమంతటా తిరిగి హిందూ ధర్మ ప్రచార యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జోగుళాంబ ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు.

## క్లుప్తంగా...

### రానున్న మూడ్రోజులు మోస్తరు వర్షాలు

**బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి**

**సాక్షి, హైదరాబాద్:** శ్రీలంక, దక్షిణ తమిళనాడు తీరాలకు దగ్గర్లో నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ఏర్పడింది. మరోవైపు తూర్పు, ఆగ్నేయ దిశల నుండి గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో రానున్న మూడురోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలావుండగా గత 24 గంటల్లో రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. నిజామాబాద్‌లో 8 డిగ్రీలు అధికంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రామగుండంలో 7.6 డిగ్రీలు ఎక్కువగా 23 డిగ్రీలు, భద్రాచలంలో 7.5 డిగ్రీలు ఎక్కువగా 25 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### ‘నీట్’ దరఖాస్తు ప్రక్రియ మొదలు

**నోటిఫికేషన్ జారీచేసిన ఎన్‌టీఏ**

**సాక్షి, హైదరాబాద్:** ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నోటిఫికేషన్ జారీచేసింది. 2020–21 వైద్య విద్యాసంవత్సరానికి గానూ వచ్చే ఏడాది మే 3న పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తులను ‘nta.ac.in’ లేదా ‘ntaneet.nic.in’ వెబ్‌సైట్లలో పొందవచ్చు. దేశవ్యాప్తంగా 154 నగరాల్లోని 2,546 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో మాత్రమే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు కేవలం ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించాలి. ఈ–మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ ఉపయోగించి దరఖాస్తు చేయాలి. డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్, పేటీఎం తదితరాల ద్వారా రుసుము చెల్లించాలి. రుసుము చెల్లించిన తర్వాత దరఖాస్తు ఫారం ఒక్కోసారి రద్దయిపోతే, చెల్లించిన రుసుం తిరిగి వెనక్కు వస్తుంది.

### ప్రొబెషనరీ సబ్ రిజిస్ట్రార్లకు శిక్షణ

**పాల్గొన్న స్పెషల్ సీఎస్ సోమేశ్**

**సాక్షి, హైదరాబాద్:** అటు క్షేత్రస్థాయి పరిస్థితులతో పాటు ఇటు చట్టాలను సంపూర్ణంగా అధ్యయనం చేసే విధంగా రూపొందించిన శిక్షణా తరగతులను సీరియస్‌గా తీసుకోవాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖలో నూతనంగా నియమితులైన 23 మంది ప్రొబెషనరీ సబ్ రిజిస్ట్రార్ల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వాగతోపన్యాసం చేసిన రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ కమిషనర్ చిరంజీవులు మాట్లాడుతూ ఒక పుష్కర కాలం తర్వాత శాఖలోకి కొత్త రక్తం వస్తోందన్నారు. ప్రొబెషనరీ సబ్ రిజిస్ట్రార్లకు యోగా, కంప్యూటర్‌లలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమేశ్ కుమార్ సబ్ రిజిస్ట్రార్లకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు.

### కృష్ణా బోర్డు భేటీ వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా బోర్డు భేటీ మళ్లీ వాయిదా పడింది. కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో లభ్యతగా ఉన్న జలాల పంపకాలపై మంగళవారం బోర్డు భేటీ అయ్యి చర్చించాల్సి ఉన్నా, ఉభయ తెలుగు రాష్ట్రాలు భేటీ వాయిదా కోరాయి. ఏపీ ఇంజనీర్లు అమరావతి, ఇతర పనుల్లో బిజీగా ఉన్నామని, తెలంగాణ అధికారులు ఇతర ప్రాధాన్య పనులు ఉన్నాయని వాయిదా కోరారు. దీంతో భేటీని వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. తదుపరి సమావేశపు తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

### బాధ్యతలు స్వీకరించిన నీతూకుమారి ప్రసాద్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నూతన కమిషనర్‌గా నీతూకుమారి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ ట్యాక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. బంగారు తెలంగాణ సాధనలో ఆర్థిక స్వావలంబనకు అత్యున్నత ప్రమాణాలతో పనిచేస్తామని ఉద్యోగుల తరపున సంఘం సభ్యులు కమిషనర్ ఎదుట ప్రతిజ్ఞ తీసుకున్నారు.

### నేటి నుంచి సచివాలయం పరిసరాల్లో ఆంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయం పరిసరాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. సచివాలయం చుట్టుపక్కల ప్రాంతాలు, రోడ్లలో ఎలాంటి సమావేశాలు, ర్యాలీలు, గుమిగూడడాలు, ఐదుగురి కన్నా ఎక్కువమంది సంచరించడంపై నిషేధం విధించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 22 ప్రకారం మంగళవారం నుంచి ఫిబ్రవరి 2 వరకు మూడు నెలల కాలం వరకు ఈ నిషేధాజ్ఞలు వర్తిస్తాయని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# 1st తర్వాత సెకండే ఎందుకు?



- ‘ఇంటర్’మొదటి ఏడాది తర్వాతే రెండో ఏడాది చేయాల్సిన అవసరం లేకుండా మార్పు
- ప్రశాంతమైన చదువుకు... ‘ఫ్లెక్సీ కోర్సు’
- విద్యార్థి మరో కోర్సు చేసి వచ్చి, మిగిలిన ఏడాది పూర్తి చేసే అవకాశం
- ఈనెల 7న అధ్యయనం కోసం సెంచూరియన్ వర్సిటీకి బోర్డు బృందం
- ‘సాక్షి’తో ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్



**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియెట్‌లో ఫ్లెక్సీ కోర్సు విధానం (మొదటి ఏడాది తరువాతే రెండో ఏడాది కచ్చితంగా చదవాల్సిన అవసరం లేకుండా) అమలుకు ఇంటర్మీడియెట్ బోర్డు ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం తరువాత కచ్చితంగా రెండో ఏడాది పూర్తి చేయాలి. ఈ నిబంధనను తొలగించే అంశంపై బోర్డు కసరత్తు చేస్తోంది.తొలి ఏడాది ముగిశాక విద్యార్థి మరేదైనా చదువుకొని మళ్లీ ద్వితీయ ఏడాది పూర్తి చేసే అవకాశాన్ని కల్పించనున్నారు. ఈ విధానం విదేశాల్లో ఉండగా, దేశంలోని ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీలో మాత్రమే ఇది అమల్లో ఉంది. దీనివల్ల విద్యార్థులు కొంత కాలవ్యవధితో తమ చదువును కొనసాగించ వచ్చని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ తెలిపారు. ఆయన వివిధ అంశాలపై ‘సాక్షి’తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**ఒత్తిడి తగ్గించేందుకే..**

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు అనేక చర్యలు చేపడుతున్నాం. గత నెల 30న నిర్వహించిన స్టూడెంట్ కౌన్సిలర్ల శిక్షణలో వ్యక్తిత్వ వికాస నిపుణులు విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించేందుకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లలో పాస్, ఫెయిల్ స్థానంలో క్లియర్, నాట్ క్లియర్ పదాలను తీసుకురావడం, ఫ్లెక్సీ విధానం అమలు వంటివి. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.దేశ వ్యాప్తంగా పాస్, ఫెయిల్ విధానమే ఉంది. మన రాష్ట్రంలో దానిని తీసుకువస్తే ఇతర రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు వస్తాయా అనే అంశాన్నీ చర్చించాల్సి ఉంది. ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీకి ఈనెల 7న అధ్యయనానికి వెళ్తున్నాం. వచ్చాక నివేదికతోపాటు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తాం.

**వృత్తి విద్యా కోర్సుల్లో సమూల మార్పులు**

రాష్ట్రంలో వృత్తివిద్యను మార్పు చేయబోతున్నాం. ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సులను ప్రవేశ పెడతాం. వొకేషనల్ ఇంటర్మీడియట్ పూర్తి కాగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండేలా చూస్తాం. ప్రస్తుతం సెంచూరియన్ యూనివర్సిటీలో 28 రకాల వొకేషనల్ కోర్సులు ఉన్నాయి. వాటిని అధ్యయనం చేసి రాష్ట్రంలో మార్పులు తీసుకువస్తాం.

**వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ..**

చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం. ఈ మేరకు జిల్లా అధికారులకు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశాం. రెండు రోజుల్లో ఈ తరగతులు ప్రారంభమవుతాయి. కృతార్థులు కాని విద్యార్థులకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం.

**బోర్డు వెబ్‌సైట్‌లో ఆడియో వీడియో పాఠాలు**

విద్యార్థుల కోసం బోర్డు వెబ్‌సైట్‌లో ఆడియో, వీడియో పాఠాలను ఉంచుతాం. ప్రభుత్వ , ప్రైవేటు కాలేజీల విద్యార్థులూ వాటిని చూసి నేర్చుకునేలా ఉంటాయి. ఇంగ్లిష్–తెలుగులో రూపొందించిన ఈ పాఠాలను (పాఠ్యాంశాల వారీగా) నిపుణుల నుంచి తీసుకుంటున్నాం. త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

**ద్వితీయ సంవత్సర పాఠ్య పుస్తకాల మార్పు**

గతేడాది ప్రథమ సంవత్సర పాఠ్య పుస్తకాలను మార్పు చేశాం. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరంలో మార్చుతున్నాం. వచ్చే ఏడాదినుంచి కొత్త పుస్తకాలు అందుబాటులోకి తెస్తాం. ఈసారి ఆన్‌లైన్ మూల్యాంకనం అమలు చేయం.. వచ్చే ఏడాదికి ఆలోచిస్తాం.ఇకపై పక్కాగా నిబంధనల ప్రకారం ఉన్న కళాశాలలకే అనుమతులు ఇస్తాం. ఈ ప్రక్రియనూ జనవరిలోనే ప్రారంభిస్తాం.

### త్వరలో పౌల్ట్రీ పాలసీ: తలసాని



**సాక్షి, హైదరాబాద్:** దేశంలోనే అత్యున్నతమైన పౌల్ట్రీ పాలసీని త్వరలోనే రూపొందిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పౌల్ట్రీ రంగం అభివృద్ధిపై కమిటీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం మొదటి సమావేశం నిర్వహించారు. ఈ ఉపసంఘంలో సభ్యులుగా ఉన్న రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి రాష్ట్రంలో తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. పేద రైతులకు సబ్సిడీపై పెరటి కోళ్ల యూనిట్లను సరఫరా చేస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న చిన్న, పెద్ద పౌల్ట్రీ ఫారంల జాబితాను వెంటనే జిల్లాల వారీగా సేకరించాలని డైరెక్టర్ లక్ష్మారెడ్డిని కమిటీ ఆదేశించింది. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాజేంద్రనగర్‌లోని కోళ్ల పరిశోధన డైరెక్టర్ డాక్టర్ చటర్జీ, వెటర్నరీ యూనివర్సిటీ డీన్ ఎస్‌టీ వీరోజిరావు, అడిషనల్ డైరెక్టర్ రాంచందర్, ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఒక్కోసారి ప్రమాదమూ.. కళ్లకు ఇలా ప్రమోదాన్ని కలిగిస్తుంది. ఇక్కడ జరుగుతోంది కూడా అదే.. ఐస్‌ల్యాండ్‌లో అగ్ని పర్వతం లావాను ఎగజిమ్ముతున్నప్పుడు కొందరు దానికి దగ్గరగా నిల్చుని చూస్తున్న దృశ్యమిది.. ఈ చిత్రాన్ని ఆలివర్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు.

## కాలుష్య మూసీని శుభ్రం చేద్దాం

- ప్రణాళిక రూపొందించండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



**సాక్షి, హైదరాబాద్ :** మూసీ నది కాలుష్యంపై పత్రికల్లో వచ్చిన కథనాలను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. ప్రభుత్వం తలచుకుంటే మూసీనే కాదు హుస్సేన్‌సాగర్‌లో కాలుష్య కోరల్ని కూడా పెకలించగలదని ధర్మాసనం అభిప్రాయపడింది. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన ప్రభుత్వం మూసీ శుభ్రంగా ఉండేలా ఎందుకు చేయలేదని ప్రశ్నించింది. చెరువుల్లో కూడా కాలుష్యం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇవన్నీ కాలుష్య కారకాలుగా మారడానికి అందరూ బాధ్యులేనని వ్యాఖ్యానించింది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనం చేయడం కూడా కాలుష్యానికి ఒక కారణమంది. మూసీ ప్రక్షాళనకు ఒక ప్రణాళికను రూపొందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూసీ కాలుష్య ప్రభావం 66 గ్రామాలపై ఉందని, మూసీ పరీవాహక ప్రాంతాల్లో నిర్మాణాలు చేయడం వల్ల ప్రవాహానికి సమస్యగా మారిందనే కథనంలోని అంశాలపై విచారణ జరిపింది. జైపూర్‌లో ఒక నది కలుషితమైతే అక్కడి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన సంకల్పం ఫలించిందని, అదే విధంగా మూసీ విషయంలోనూ ఇక్కడి ప్రభుత్వం ఒక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించింది. గతంలోని కేసుల్లో స్టే ఉత్తర్వుల కారణంగా తాము ఏమీ చేయలేకపోతున్నామని ప్రభుత్వం చేసిన వాదనను ధర్మాసనం తప్పుపట్టింది. మూడు నెలల్లోగా మూసీ నదిలో 5 కిలోమీటర్ల పరిధిలో శుభ్రం చేస్తామని మూసీ నది అభివృద్ధి మండలి ఇచ్చిన హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించింది. గతంలో మూసీపై ఉన్న కేసులన్నింటినీ కలిపి విచారణ జరుపుతామని, కాలుష్య నివారణ ప్రణాళికతో పూర్తి వివరాలను తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక/పరిశ్రమలు/పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శులు, జీహెచ్‌ఎంసీ/జలమండలి/కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, యాదాద్రి–భువనగిరి జిల్లాల కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 3కి వాయిదా వేసింది.

## పిల్లలు తక్కువున్న అంగన్‌వాడీల మూసివేత!

- సమీప కేంద్రాల్లో విలీనం చేసే అంశంపై పరిశీలన
- దాదాపు 3 వేల కేంద్రాల్లో అతి తక్కువగా నమోదు
- నెలలో పూర్తిస్థాయి సమాచారంతో నివేదికల రూపకల్పన



**సాక్షి, హైదరాబాద్:** తక్కువ పిల్లలున్న అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళం పాడాలని సర్కారు భావిస్తోంది. మెరుగైన సేవలందించాలన్న సంకల్పంతో అంగన్‌వాడీ కేంద్రాల హేతుబద్ధీకరణకు ఉపక్రమించిన ప్రభుత్వం.. క్షేత్ర స్థాయిలో కేంద్రాల వారీగా పరిస్థితులను సమీక్షిస్తోంది. పిల్లల నమోదులో వెనుకబాటు, లబ్ధిదారుల సంఖ్య తక్కువగా ఉండటం లాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించిన ప్రభుత్వం.. సేవలను విస్తృతం చేసే క్రమంలో ఒకే చోట రెండు, మూడు అంగన్‌వాడీ కేంద్రాలుంటే వాటి సంఖ్యను సైతం కుదించాలని యోచిస్తోంది. ఈ మేరకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోంది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ఇందులో 99 ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల్లో ఉండగా, 25 ప్రాజెక్టులు పట్టణ ప్రాంతాల్లో, మరో 25 గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. వీటిలో 31,711 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 4.31 లక్షల గర్భిణులు, పాలిచ్చే తల్లులు, మూడేళ్ల లోపున్న చిన్నారులు 10.42 లక్షలు, ఆరేళ్ల లోపున్న చిన్నారులు 6.54 లక్షల మంది వివిధ పోషక పథకాల కింద లబ్ధి పొందుతున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో కేంద్రాల వారీగా లబ్ధిదారుల గణాంకాలతో పాటు నమోదు సంఖ్యను విశ్లేషించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**హాజరు శాతమే కీలకం..**

హేతుబద్ధీకరణకు ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనే దానిపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతమున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ మంది లబ్ధిదారులు, స్వల్ప నమోదు ఉన్న కేంద్రాల జాబితాను రూపొందిస్తోంది. వీటితో పాటు నమోదైన వారి హాజరు శాతాన్ని కూడా పరిశీలిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 3 వేలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ నమోదు ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను ఆ శాఖ పరిశీలిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత సమీపంలోనే రెండు లేదా మూడు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఒక కేంద్రంలో ఎక్కువ మంది పిల్లలు నమోదవుతుండగా.. మిగతావాటిలో అరకొరగా నమోదవుతున్నారు. దీంతో ఒకేచోటకు కేంద్రాలను మార్చే అంశంపైనా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నమోదు సంఖ్యకు తగ్గట్లు అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లను నియమిస్తారు.

**నెల రోజుల్లో నివేదికలు..**

అంగన్‌వాడీ కేంద్రాల వారీగా నమోదు, లబ్ధిదారులకు అందిస్తున్న సేవలపై నెలరోజుల్లో నివేదికలు రూపొందించాలని జిల్లా సంక్షేమాధికారులకు రాష్ట్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. నమోదు తక్కువగా ఉన్న కేంద్రాలపై సమీక్షలు నిర్వహించి అసలు కారణాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. గతవారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధ్యక్షతన జిల్లా సంక్షేమాధికారుల సమావేశం జరిగింది. ఇందులో జిల్లా అధికారులకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది.

### టీవీ రేటింగ్‌ల కోసం గోల్‌మాల్

**రెండు చానల్స్‌పై ఛార్జిషీటు**

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్పీ రేటింగ్ కోసం మీటర్లలో గోల్‌మాల్ చేశారనే అభియోగాలపై రెండు టీవీ చానల్స్‌పై ఛార్జిషీటు దాఖలైంది. వీటిపై బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్) కేసులు పెట్టింది. బార్క్ పెట్టిన కేసుల ఆధారంగా హైదరాబాద్ నగరంలోని వెస్ట్‌మారేడ్‌పల్లి పోలీసులు ఛార్జిషీటు దాఖలు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, అసోంలలో టీవీ రేటింగ్స్ అక్రమాలను గుర్తించిన బార్క్ తెలంగాణపై దృష్టి పెట్టింది. దీంతో అదుపులోకి తీసుకున్న నిందితుల్లో ఇద్దరికి రెండు తెలుగు రాష్ట్రాలతో సంబంధం ఉన్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం.

### ఎంపీవో టు డీపీవో జీపీల తనిఖీకి వెళ్లాల్సిందే..

**పీఆర్ కమిషనర్ రఘునందన్‌రావు ఉత్తర్వులు**

**సాక్షి, హైదరాబాద్:** నిరంతర పర్యవేక్షణతోనే గ్రామ పంచాయతీల పనితీరు మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకనుగుణంగా తరుచూ జీపీలను సందర్శించేలా అధికారుల జాబ్‌చార్ట్‌ను రూపొందించింది. మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) మొదలు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వరకు విధిగా పంచాయతీలను తనిఖీ చేయాలని నిర్దేశించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీవో, డీపీవోలే తప్పనిసరిగా గ్రామ పంచాయతీలను తనిఖీ చేయాలని కొత్త చట్టంలో పొందుపరిచారు. డీపీవో నెలకు ఐదు జీపీలు తనిఖీ చేయాలి. గ్రామాల్లో 85 శాతం మొక్కలు బతికేలా చూడాల్సిన బాధ్యత ఎంపీవోలదే. డివిజనల్ పంచాయతీ అధికారుల (డీఎల్‌పీవో)కు మొదట్లో జీపీల్లో పర్యటించాలనే నిబంధన ఉండేది కాదు.

## ఎన్‌వోసీ రాకుంటే.. నుమాయిష్ లేనట్టే

- తేల్చి చెప్పిన హైకోర్టు
- ఎగ్జిబిషన్ మ్యాప్ సమర్పించండి.. మాక్ డ్రిల్ నిర్వహించండి
- హైదరాబాద్ సీపీకి ఆదేశం
- ఎగ్జిబిషన్ పర్యవేక్షణ అధికారి స్వయంగా హాజరుకావాలి
- విచారణ ఈ నెల 9వ తేదీకి వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి ఎగ్జిబిషన్ సొసైటీ కచ్చితంగా నిరభ్యంతర ధ్రువపత్రాన్ని పొందితీరాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ధ్రువపత్రం రాకుంటే ఈసారి ఎగ్జిబిషన్ నిర్వహిస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించే ప్రసక్తే లేదని కూడా తేల్చిచెప్పింది. అలాగే ఎగ్జిబిషన్‌లో విపత్తు సంభవిస్తే సందర్శకులు సురక్షితంగా బయటపడేందుకు ఉన్న మార్గాలపై పూర్తి నివేదిక సమర్పించాలని నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. ఎగ్జిబిషన్ మైదానంలోకి ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే దారులతో కూడిన పూర్తి మ్యాప్‌ను నివేదించాలని కోరింది. ఈ మేరకు సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది. హైదరాబాద్ నుమాయిష్‌లో గతంలో అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో న్యాయవాది ఖాజా ఇజాజుద్దీన్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు మరోసారి విచారణ జరిపింది. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోకుండానే ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రాసిక్యూట్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ హైకోర్టును కోరారు.

**సంతృప్తి చెందితేనే ఎగ్జిబిషన్..**

అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు పొందినా.. ఆ పత్రాల్ని ఏవిధంగా జారీ చేశారో, ఎందుకు అనుమతి ఇచ్చారో కూడా స్పష్టం చేయాల్సిందేనని ధర్మాసనం పేర్కొంది. జారీ చేసిన ఎన్‌వోసీ పట్ల తాము సంతృప్తి చెందితేనే ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి లభిస్తుందని చెప్పింది. ఎగ్జిబిషన్ మైదానాన్ని 4 భాగాలుగా చేసి సందర్శకులు ఎలా రావాలి, ఎటు వెళ్లాలి, ఒకవేళ ప్రమాదం జరిగితే సందర్శకులు ఎటు నుంచి బయటకు వెళ్తే సురక్షితమో ప్రచారం చేయాలని, ప్రకటనలు ఇవ్వాలని హైకోర్టు సూచించింది. ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పర్యవేక్షించే సీనియర్ ఐపీఎస్ అధికారి ఈ నెల 9న జరిగే విచారణకు స్వయంగా హాజరై తాము లేవనెత్తే సందేహాలను నివృత్తి చేయాలని ఆదేశించింది. ఎగ్జిబిషన్ నిర్వహణపై నగర పోలీస్ కమిషనర్ వివరంగా నవంబర్ 16న కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ ప్రమాదం జరిగితే సందర్శకులు సురక్షితంగా బయటపడే మార్గాలతో ఎగ్జిబిషన్ మైదానం మ్యాప్‌ను సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

**ప్రభుత్వం అనుమతించినా జరగదు..**

అగ్నిమాపక శాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందకపోయినప్పటికీ.. ప్రభుత్వం నుమాయిష్‌కు అనుమతి ఇచ్చినా దాని నిర్వహణకు తాము మాత్రం అనుమతించే ప్రసక్తే లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఎగ్జిబిషన్ ప్రారంభానికి ముందే మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచన చేసింది. అగ్ని ప్రమాదం జరిగితే మంటలను ఆర్పేందుకు పరుగులు పెట్టడం కాదని, ఆ ప్రమాదం జరగకుండా తగిన చర్యలు ముందుగా తీసుకోవాలని గతంలో జరిగిన విచారణ సమయంలో ధర్మాసనం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. విపత్తుల నిర్వహణ సంస్థ సమర్థవంతంగా పనిచేస్తుంటే ఇటువంటి విపత్తులు జరగకుండా ఉంటాయంది. ఈ పిల్‌లో విపత్తు నిర్వహణ సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థలను గతంలోనే ధర్మాసనం ప్రతివాదులుగా చేసింది. దీనిపై పూర్తి వివరాలు తెలియజేయాలని ప్రభుత్వాన్ని, నగర పోలీసులను ఆదేశించింది.

**ఎన్‌వోసీతోనే నిర్వహిస్తాం..**

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.శరత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. ధర్మాసనం ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్నిమాపక శాఖలో భాగంగానే విపత్తుల నిర్వహణ జరుగుతుందన్నారు. ఎన్‌వోసీ తీసుకునే నుమాయిష్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే నుమాయిష్ ఏర్పాట్లపై సీనియర్ ఐపీఎస్ అధికారి స్వయంగా అన్ని శాఖల అధికారులతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com